తమిళనాడు నీట్ బిల్లుకు

రాష్ట్రపతి తిరస్కరణ

- కేంద్రం తీరుపై సిఎం స్టాలిన్ తీవ్ర ఆగ్రహం
- 9న అఖిలపక్షం భేటీకి పిలుపు

7



PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 242 | విజయవాడ, శనివారం 5 ఏప్రిల్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 5 April 2025 | Rs





ఉత్కంఠ పోరులో ముంబయిపై లక్నో గెలుపు

- మార్ష్, మార్‌క్రమ్ అర్ధ శతకాలు

8


## ప్రతి నియోజకవర్గంలో
# 100 పడకల ఆస్పత్రి

- పిపిపి పద్ధతిలో నిర్మాణం
- వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు



మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల నుంచి 300 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులను ప్రభుత్వ, ప్రైవేట్, భాగస్వామ్యం(పిపిపి)తో నిర్మించి, నిర్వహించేలా ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలని చెప్పారు. ఆరోగ్యశాఖపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. 175 నియోజకవర్గాలకుగాను వంద పడకలకు పైగా సామర్థ్యం ఉన్న ఆస్పత్రులు 70వరకు ఉన్నాయని, మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీస్పెషాల్టీ హాస్పటల్స్ నిర్మాణం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృత పరచాలని చెప్పారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని సూచించారు.

**వర్చువల్ వైద్య సేవలు**

పిహెచ్‌సి, సిహెచ్‌సి స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చువల్ విధానంలో ప్రాథమిక సేవలు అందేలా చూడాలని సిఎం ఆదేశించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని చెప్పారు. అనారోగ్యం బారినపడిన తర్వాత వైద్యసేవలు అందించే పరిస్థితి నుంచి ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్, డయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి చాలా వరకు బయటపడవచ్చని చెప్పారు. 25 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను రూ.32.5 కోట్లతో బలోపేతం చేయడంతోపాటు, కొత్తగా మరో 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏజెన్సీ ఏరియాలోని పిహెచ్‌సిల్లో వైద్య ఖాళీల భర్తీ, విజయనగరంలో కొత్తగా 8 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, ఎన్టీఆర్, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో డయాలసిస్ మెషిన్లు పెంచడం, కొవ్వూరు - నిడదవోలు సిహెచ్‌సిలను అప్‌గ్రేడ్ చేయడం వంటి అంశాలపై సిఎం మార్గదర్శకాలు జారీ చేశారు. కుప్పంలో అమలు చేస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అభివృద్ధి చేసిన వినూత్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం డిజిటల్ నెర్వ్ సెంటర్(డిఐఎన్‌సి) పురోగతి గురించి ఆరా తీశారు.


**సచివాలయంలో అగ్ని ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ**

- ఇకపై సెక్రటేరియట్‌లో భద్రతపై ఆడిట్
- సిఎంఆర్ఎఫ్ కార్యాలయంలో అపరిశుభ్రతపై సిఎం అసంతృప్తి

2

**శాంతి అంటే గొంతు నొక్కడమా?**

- మా భూములపైనే వారి కన్ను
- కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు
- యువత కదులుతోంది
- 'ప్రజాశక్తి'తో సిపిఎం జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్

9


# సమానత్వం.. న్యాయసమ్మతం

## డీ లిమిటేషన్‌పై సిపిఎం డిమాండ్





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎం.డి సలీమ్, అరుణ్ తదితరులు

- **తీర్మానాలను మీడియాకు వివరించిన సలీం**

**సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి**
**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి**

నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియ సమానత్వ ప్రాతిపదికన న్యాయసమ్మతంగా జరగాలని సిపిఎం డిమాండ్ చేసింది. సీతారాం ఏచూరి నగర్ (మదురై)లో జరుగుతున్న ఆ పార్టీ 24వ అఖిల భారత మహాసభ ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. ఫెడరల్ వ్యవస్థ సూత్రాలను కచ్చితంగా పాటిస్తూ, దేశభక్తి, ఐక్యత, సమగ్రత నిలబట్టే విధంగా ఆ ప్రక్రియ సాగాలని కోరింది. మహాసభ తీర్మానాలను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.డి సలీమ్ శుక్రవారంనాడిక్కడ మీడియాకు వివరించారు. దీనితో పాటు రాజకీయ తీర్మాన ముసాయిదాపై మహాసభలో చర్చలు జరుగుతున్న తీరును తెలియజేశారు. ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తూ, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దాడిని మహాసభ తీవ్రంగా ఖండించిందన్నారు. మహాసభ మూడవ రోజైన శుక్రవారం ఐదు తీర్మానాలను చర్చించి ఆమోదించిందన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. ఆ విశేషాలు క్లుప్తంగా...

**నియోజకవర్గాల పునర్విభజనపై ....**

'పార్లమెంట్‌లో ఏ రాష్ట్రానికైనా ప్రాతినిధ్యం తగ్గించే విధంగా జరిపే పునర్విభజన ప్రక్రియను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కీలకమైన ఈ అంశంపై రాజకీయ పార్టీలతో, రాష్ట్రాలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలి. డీలిమిటేషన్ విధానం అనుచితంగా కొందరికి ఎక్కువ లబ్ధి చేకూర్చేదిగాను, మరికొందరికి నష్టం కలిగించేదిగాను ఉండకూడదన్నారు. జనాభా నియంత్రణ విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల ప్రయోజనాలను తప్పకుండా పరిరక్షించాలి. పార్లమెంటు ప్రాతినిధ్యాన్ని విస్తరించేందుకు సీట్ల సంఖ్యను నిష్పత్తి ప్రకారం పెంచాలి. అయితే, రాష్ట్రాల మధ్య ప్రస్తుత ప్రాతినిధ్య నిష్పత్తి యథాతథంగా ఉండేలా చూడాలి.' అని తాము డిమాండ్ చేస్తున్నట్లు సిపిఎం నేత సలీం చెప్పారు. రాష్ట్రాల్లో ఉన్న వివిధ వర్గాల స్థానాల నిష్పత్తిని కచ్చితంగా పాటించాలని, అన్ని రాష్ట్రాలతో సమగ్రంగా సంప్రదింపులు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఏకాభిప్రాయం రాని పక్షంలో స్థానాల పెంపుదలపై ప్రస్తుతం ఉన్న మిగతా 7లో

- **'వక్ఫ్ సవరణ' ఆమోదాన్ని ఖండించండి**
- **జనగణనతో పాటే కుల గణన**
- **ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలి**

లోపలి పేజీల్లో

# పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు తెర

- వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదంపై ఆగ్రహజ్వాల
- నిరసనలతో ముగిసిన ఉభయసభలు
- రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చి.. 16 నిరంకుశ బిల్లులకు ఆమోదం
- సుప్రీంను ఆశ్రయించిన కాంగ్రెస్, ఎఐఎంఐఎం





వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ బెంగళూరులో చంటి బిడ్డలతో కలిసి ఆందోళన చేస్తున్న ముస్లిం మహిళలు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు తెర పడింది. రాజ్యాంగ విలువలకు పాతరేసి..సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చి ప్రతిపక్షాలకు గళమెత్తే అవకాశమే లేకుండా చేసి ఆద్యంతం అధికార పక్షపాతిగా సాగిన సమావేశాలు శుక్రవారం ముగిశాయి. జనవరి 31వ తేదీ నుంచి ఈ నెల 4వ తేదీ శుక్రవారం వరకు జరిగిన ఈ సమావేశాల్లో వక్ఫ్(సవరణ) బిల్లు-2025తో మొత్తం 16 బిల్లులను కేంద్రం ఆమోదింపజేసుకుంది. ఉభయసభల్లో రెండు రోజుల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ, తీవ్రస్థాయి వాదోపవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు2025పై పార్లమెంటు ఆమోద ముద్ర పడింది. ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్యే లోక్‌సభలో బుధవారం, గురువారం రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం కూడా పొందింది. రాజ్యసభలో 13 గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఓటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగింది. దాదాపుగా ప్రతి సవరణపైనా ఓటింగ్‌కు విపక్షాలు పట్టుబట్టాయి. వాటి సవరణలన్నీ వీగిపోయాయి. చివరికి బిల్లు ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు లభించాయి. దీంతో వక్ఫ్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఇక రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అది చట్టంగా రూపుదాల్చుతుంది. వక్ఫ్ బిల్లును లోక్‌సభ 288-232 ఓట్ల తేడాతో ఆమోదించడం తెలిసిందే. ఈ బిల్లు కాకుండా మరో 10 బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ముస్లింల హక్కులను కాలరాస్తూ, రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కును మంటగలుపుతూ తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రతిపక్షాల అభ్యంతరాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా అధికార సభ్యుల సంఖ్యాబలంతో ఆమోద ముద్ర వేసుకోవడం పట్ల దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. దేశ రాజధాని న్యూఢిల్లీ సహా పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు అనేక ప్రాంతాల్లో ఆందోళనలు హోరెత్తాయి. మైనార్టీలపై మోడీ సర్కార్ సాగిస్తున్న దాడిని తిప్పికొడతామంటూ ఆందోళనల్లో పాల్గొన్న ప్రజలు నినదించారు. మరోవైపు ఈ బిల్లును ఆమోదించడమంటే మత స్వేచ్ఛను హరించివేయడమేనంటూ కాంగ్రెస్ నేత, ఎంపి మహ్మద్ జావేద్, ఎఐఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఒవైసి సుప్రీంకోర్టులో శుక్రవారం వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు.

**చివరి రోజూ ప్రతిపక్షాలకు అడ్డంకులు**

లోక్‌సభలో బడ్జెట్ సమావేశాల చివరి రోజు కూడా ప్రతిపక్షాల సభ్యులకు అధికార పక్షాల సభ్యులు ఆటంకాలు సృష్టించారు. వారి గొంతు వినిపించే అవకాశం కల్పించకుండా పదేపదే అడ్డు తగిలారు. శుక్రవారం ఉదయం సభ ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలంటూ బిజెపి ఎంపీలు డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లును లోక్‌సభలో ప్రజాస్వామ్యయుతంగా ఆమోదించలేదని, దానిని బుల్డోజ్ చేశారంటూ తీవ్ర నిరసన తెలియజేస్తూ సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల అధికార పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆమె క్షమాపణలు చెప్పి తీరాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో తొలుత సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం తిరిగి ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా బడ్జెట్ సమావేశాల ముగింపు ప్రసంగాన్ని చదివి వినిపించారు. సభను నిరవధికంగా వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ సమావేశాల్లో సభ ఉత్పాదకత 118 శాతం కంటే ఎక్కువ ఉందన్నారు. స్పీకర్ ప్రసంగిస్తున్న సమయంలోనూ కాంగ్రెస్ సభ్యులు తమ నిరసన తెలియజేశారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని కూడా సభలో మాట్లాడనివ్వకుండా వివక్షచూపించారంటూ నినదాలు చేశారు. అభ్యంతరాలను పట్టించుకోకుండా, సముచిత చర్చ చేపట్టకుండానే వక్ఫ్ బిల్లుకు మిగతా 7లో

**ఆమోదం పొందిన బిల్లులు**

1. రైల్వేస్ (సవరణ) బిల్లు, 2. చమురు క్షేత్రాలు (నియంత్రణ అండ్ అభివృద్ధి) సవరణ బిల్లు, 3. అప్రోప్రియేషన్ (నెంబర్ 2) బిల్లు, 4. అప్రోప్రియేషన్ బిల్లు, 5. మణిపూర్ కేటాయింపు (ఓటుపై ఖాతా) బిల్లు, 6. మణిపూర్ కేటాయింపు బిల్లు, 7. విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు, 8. బాయిలర్స్ బిల్లు, 9. బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) బిల్లు, 10. అప్రోప్రియేషన్ బిల్లు (నెంబర్ 3), 11. ఆర్థిక బిల్లు, 12. "త్రిభువన్" సహకారి విశ్వవిద్యాలయ బిల్లు, 13. ఇమ్మిగ్రేషన్ అండ్ విదేశీయుల బిల్లు, 14. వక్ఫ్ (సవరణ) బిల్లు, 15. ముస్సల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు, 16. విమాన వస్తువులపై ప్రయోజనాల రక్షణ బిల్లు.

## 38 మార్కెట్ కమిటీలకు చైర్మన్లు

- టిడిపి 31, జనసేన 6, బిజెపి 1

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా 38 మార్కెట్ కమిటీల (ఎఎమ్‌సి) ఛైర్మన్లను టిడిపి ప్రకటించింది. ఉగాదికి ముందు 47 ఎఎమ్‌సి ఛైర్మన్లను ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ప్రకటించిన జాబితాలో టిడిపి 31, జనసేన 6, బిజెపి 1 ఛైర్మన్ పదవులను దక్కించుకున్నాయి. మిగిలిన నామినేటెడ్ పోస్టుల భర్తీ ముఖ్యంగా ఎఎమ్‌సి, దేవాదాయ కమిటీలకు ఛైర్మన్ల ప్రకటన ఈనెల 15లోగా పూర్తవుతుందని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఈనెల 15నుంచి 20వ తేదీలోగా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల ప్రకటన వెలువడుతుందని ఆ దిశగా కూటమి అగ్రనేతలు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.


**ఆదుకోకపోతే యార్డును ముట్టడిస్తాం**

- గుంటూరు మిర్చియార్డులో రైతుల నిరసన

5


## ఫార్మా విద్యార్థిని
# నాగాంజలి మృతి

- 12 రోజులపాటు మృత్యువుతో పోరాటం
- నాటకీయ పరిణామాల నడుమ మృతదేహం తరలింపు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : సిపిఎం



నాగాంజలి మృతదేహం

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి**

కిమ్స్ ఉద్యోగి లైంగిక వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసిన ఫార్మా విద్యార్థిని నాగాంజలి శుక్రవారం మృతి చెందారు. 12 రోజులపాటు మృత్యువుతో పోరాడిన ఆమె చివరకు కిమ్స్ ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని నాటకీయ పరిణామల మధ్య పోలీసులు తరలించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి చెందిన నాగాంజలి... రాజమహేంద్రవరం సమీపంలోని మధురపూడి వద్దగల ఫార్మసీ కళాశాలలో చదువుతున్నారు. రాజమహేంద్రవరం కిమ్స్‌లో ఫార్మసిస్ట్‌గా ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. ఈ సమయంలో కిమ్స్ ఉద్యోగి దీపక్ ఆమెను పెళ్లి పేరుతో వంచించారు. లైంగికంగా వేధించారు. దీంతో, గత నెల 23న విబి 10 ఎంజి ఇంజక్షన్ తీసుకుని ఆమె ఆత్మహత్యాయత్నం చేశారు. అప్పటి నుంచి అపస్మారక స్థితిలో ఉన్నారు. ఈ ఘటనపై వామపక్షాలు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు అప్పట్లో ఆందోళనలు చేశారు. దీంతో నాగాంజలి సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు దీపక్‌ను గత వారంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**కడసారి చూపు కోసం అంబులెన్స్ అడ్డగింత**

చికిత్స అందించినా ఫలితం మిగతా 7లో

# 'యాక్సిస్' ఒప్పందంతో భారం

- విద్యుత్ కొనుగోలు ఒప్పంద ప్రతిపాదనను తిరస్కరించాలి
- ఎపి ఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు వక్తలు
- 'పొలిటికల్ కలర్' అంటూ అధికారుల గత సమాధానంపై ఆగ్రహం



అభిప్రాయాలను సేకరిస్తున్న ఎపిఇఆర్‌సి ఛైర్మన్ పిబిఆర్ రెడ్డి

**ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్**

యాక్సిస్ ఎనర్జీ ఒప్పందం వల్ల వినియోగదారులపై రూ.14,186 కోట్ల భారం పడుతుందని, విద్యుత్ కొనుగోలు ఒప్పంద ప్రతిపాదనలను తిరస్కరించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల తాము లేవనెత్తిన అభ్యంతరాలకు సరైన వివరణ ఇవ్వకపోగా, 'పొలిటికల్ కలర్' అంటూ అధికారులు సమాధానం ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యంతరాలపై పంపిణీ సంస్థలు చట్టబద్ధంగా స్పందించాల్సి ఉందని. అయితే, అభ్యంతరాలను లేవనెత్తిన వారిపై చర్యలు తీసుకుంటామని బెదిరించడం పట్ల తీవ్రంగా ఆక్షేపించారు. యాక్సిస్ ఎనర్జీ నుంచి ఎస్‌పిడిసిఎల్ 400 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి కర్నూలులోని ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) కార్యాలయంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఇఆర్‌సి ఛైర్మన్ పివిఆర్ రెడ్డి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**బెదిరింపులకు పాల్పడుతున్న ఎస్‌పి డిసిఎల్ క్షమాపణ చెప్పాలి : సిహెచ్ బాబూరావు**

ప్రజాభిప్రాయ సేకరణలో వర్చువల్‌గా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ యాక్సిస్ ఒప్పందంపై ఇప్పటికే మూడు దశల్లో 60పేజీలకుపైగా అభ్యంతరాలు తెలిపామన్నారు. ఇప్పటికే టిడిపి కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లో రూ.17,485 కోట్ల భారాలను విద్యుత్ వినియోగదారులపై మోపిందని వివరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం భారాలు వేయడం సరికాదన్నారు. సెకీ ఒప్పందం ద్వారా 1.20 లక్షల కోట్ల భారం పడుతుందని చెప్పిన చంద్రబాబు ఆ ఒప్పందాన్ని రద్దు చేయడం కుదరదని చెబుతున్నారని, అవినీతి ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయరని ప్రశ్నించారు. ఆ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెకీ ఒప్పందంలో యూనిట్ రూ.2.49తో కొన్నది ఎక్కువ అయితే యాక్సిస్ నుంచి రూ.4.60కు కొనడం ఏ రకంగా తక్కువ అవుతుందని ప్రశ్నించారు. ఆ ప్రతిపాదనను తిరస్కరించాలని, అవసరం అనుకుంటే కాంపిటేటివ్ బిడ్డింగ్‌కు వెళ్లాలని కోరారు. ఈ ప్రాజెక్ట్‌ను జెన్‌కో ద్వారా చేపట్టాలని, గత్యంతరం లేదనుకుంటే దాన్ని చిన్న ప్రాజెక్టుగా మార్చాలని, టారిఫ్ తగ్గించాలని సూచించారు. నాలుగు గంటల పీక్ టైం ధరతోనే 24 గంటలూ కొనడం వల్ల రూ.9,198 కోట్ల నష్టం వస్తుందని వివరించారు. ఇప్పటికే ఇఆర్‌సి తిప్పి పంపిన ప్రతిపాదనలను మళ్లీ తిరిగి ఎందుకు ముందుకు తెచ్చారని ప్రశ్నించారు. అభ్యంతరాలను లేవనెత్తితే సమాధానంలో ఎస్‌పిడిసిఎల్ మిగతా 7లో


**విద్యుదాఘాతంతో లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ మృతి**

2

**బాలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శకుడు మనోజ్‌కుమార్ ఇక లేరు**

8

**చైనా తగ్గేదేలే...!**

- అమెరికాతో ఢీ అంటే ఢీ
- 34 శాతం సుంకాలు విధింపు
- ఏకపక్ష బెదిరింపులపై ఆగ్రహం

5



మృతిచెందిన శివ శంకర్, మహేష్

## విద్యుదాఘాతంతో లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-కొల్లూరు (బాపట్ల జిల్లా)

విద్యుదాఘాతంతో లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ మృత్యువాతపడిన ఘటన బాపట్ల జిల్లా కొల్లూరు మండల పరిధిలోని ఈపూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి బలమైన ఈదురుగాలుల కారణంగా ఈపూరు, చిలుమూరు గ్రామాల మధ్య ఉన్న శ్రీరామ రూరల్ కళాశాల వెనుక భాగంలో చెట్లు విరిగిపడి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ఈపూరు, చిలుమూరు గ్రామాలతో పాటు నదీగర్భంలో ఉన్న లంక గ్రామాలకు కూడా సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆరుగురు విద్యుత్ సిబ్బంది శనివారం ఉదయం మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లారు. తెగిపోయిన వైర్లను బిగించి కిందకు దిగుతుండగా.. విద్యుత్ సరఫరా కావడంతో దోనేపూడి లైన్‌మెన్ పాతర్లంక లీలా దుర్గా శంకర్ (40), ఈపూరు గ్రామ ఎనర్జీ అసిస్టెంట్ ఆకుల మహేష్ (35) మృతిచెందారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటనకు కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌సి తీసుకునే విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

## అంగన్‌వాడీ టీచర్‌కు వేధింపులు

- టిడిపి నాయకుడిపై అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

అంగన్‌వాడీ టీచర్‌ను వేధిస్తున్న టిడిపి నాయకుడిపై పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వేధింపులపై సత్తెనపల్లి మండలం కంకణాలపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వారం రోజుల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బొడ్డు వెంకటేశ్వరరావు తనను తరచూ వేధిస్తున్నాడని, ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడేవాడని, చెప్పినట్లు వినకుంటే ఉద్యోగం తీయిస్తాననీ బెదిరించడమే కాకుండా లైంగిక వేధింపులకూ గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సిఐ తెలిపారు.

## 30లోపు ఆస్థి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నగర పంచాయతీలు, పట్టణాలు, నగరాల్లో ఆస్థిపన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 సంవత్సరానికి పూర్తి పన్నును ఈ నెల 30వ తేదీలోగా చెల్లించే యజమానులకు పన్నులో 5 శాతం రాయితీ కల్పిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆస్థి పన్నుకు సంబంధించిన డిమాండ్ నోటీసులు ఆన్‌లైన్‌లో విడుదలైన అనంతరం పన్ను చెల్లింపునకు అవకాశం కల్పిస్తామన్నారు. ఇతర వివరాల కోసం పురపాలక శాఖ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## పోలవరంపై కేంద్రంతో చంద్రబాబు రాజీ : అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు పరిమితం చేస్తూ కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయం తీసుకుందని మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్ల వరకు ఈ ప్రాజెక్టుపై ఖర్చు చేయకుండా మిగుల్చుకుంటోందన్నారు. నిర్వాసితులకు పునరావాసం ఎగ్గొట్టేందుకు ఎత్తు తగ్గించారని, ఈ మేరకు తాజాగా కేంద్ర జలశక్తి శాఖ వార్షిక నివేదిక వెల్లడించిందని పేర్కొన్నారు. పోలవరం ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేస్తున్నామని స్పష్టం చేసినా సిఎం చంద్రబాబు నోరు మెదపడం లేదని, లోకేష్‌ను సిఎంగా చేసేందుకు కేంద్రంతో రాజీపడ్డారని విమర్శించారు. పోలవరం ఎత్తు 45.72 మీటర్లు ఉంటేనే రిజర్వాయర్‌లో 194.6 టిఎంసిల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. 41.15 మీటర్లకు పరిమితం చేస్తే జలాశయం నిల్వ సామర్థ్యం 115.44 టిఎంసిలకు పరిమితమవుతుందని తెలిపారు.

## విడదల రజని బెయిల్ పిటిషన్ వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి కోట్లు వసూలు చేశామనే ఆరోపణలతో తన ఎసిబి నమోదు కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మాజీ మంత్రి, వైసిపి నేత విడదల రజని, ఆమె మరిది గోపినాథ్ వేసిన వ్యాజ్యాలపై హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. శుక్రవారం పిటిషనర్ల వాదన పూర్తి కావడంతో ఈ నెల 8న ఎసిబి వాదనలు వింటామని జస్టిస్ టి.మల్లిఖార్జునరావు శుక్రవారం ప్రకటించారు. వైసిపి ప్రభుత్వ హాయంలో విజిలెన్స్ తనిఖీ పేరుతో తనను బెదిరించి, రూ.2.20కోట్లు అక్రమంగా వసూలు చేశారని పల్నాడుజిల్లా, యడ్లపాడులోని లక్ష్మీబాలాజి స్టోన్ క్రషర్స్ మేనేజింగ్ పార్ట్నర్ నల్లపనేని చలపతిరావు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎసిబి కేసు నమోదు చేసింది. కాగా, ఇదే కేసులో నిందితుడిగా ఉన్న విడదల రజని పిఎ దొడ్డా రామకృష్ణ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను కూడా ఈ నెల 8కే వాయిదా వేశారు.

# సచివాలయంలో అగ్ని ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ

- ఇకపై సెక్రటేరియట్‌లో భద్రతపై ఆడిట్
- సిఎంఆర్ఎఫ్ కార్యాలయంలో అపరిశుభ్రతపై సిఎం అసంతృప్తి
- 24 గంటల్లో చెత్తను శుభ్రం చేయాలని ఆదేశాలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్‌లోని బ్యాటరీ గ్యాలరీలో శుక్రవారం వేకువజామున అగ్ని ప్రమాదం జరిగిన ఘటనపై రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించింది. అగ్నిప్రమాదం వేకువజామున కావడంతో ఎటువంటి ఇబ్బంది కలగలేదని, అదే సచివాలయం పని వేళల్లో ఇదే ప్రమాదం జరిగివుంటే పరిస్థితి మరో రకంగా ఉండేదే మోననే ఆందోళన వ్యక్తమవుతోంది. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని జిఎడి, సిఆర్‌డిఎ విభాగాలు ప్రాథమికంగా అంచనా వేస్తున్నప్పటికీ, ఏమైనా ఇతరత్రా కారణాలేమైనా ఉండొచ్చా అనే కోణంలో కూడా శాఖాపరమైన విచారణ చేపట్టాలని రాష్ట్ర హోమ్‌శాఖ మంత్రి అనిత అగ్నిమాపకశాఖను ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర అలారం మోగిందా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం ఓ అంచనాకు రాలేక పోతున్నట్లు సమాచారం. సచివాలయంలోని ఇతర విభాగాల్లో అత్యవసర సమయాల్లో మోగాల్సిన అలారాలు పనితీరు ఎలా ఉందోననే చర్చ నడుస్తోంది.

**వివరాలను తెలుసుకున్న సిఎం**

అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సిఎం చంద్రబాబునాయుడు, సిఎస్ విజయానంద్, డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా, హోమ్ మంత్రి వంగలపూడి అనిత, జిఎడి పొలిటికల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్‌మీనాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం ఎలా జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్ బృందం ఎన్ని గంటలకు వచ్చిందని సిఎం, అధికారులను అడిగారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకునేందుకు అవసరమైన ఆధారాలను సేకరించిందా లేదా అని సిఎం అధికారులను ప్రశ్నించారు. కీలకమైన ప్రాంతాల్లో సిసి కెమెరాలు అమర్చి ఉంటే ఇటువంటి సంఘటనలు జరిగిన సమయాల్లో ఎలా అగ్ని ప్రమాదం జరిగిందో సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని సిఎం సూచించారు. సచివాలయంలో అన్ని చోట్ల భద్రతా ప్రమాణాలన్నీ పాటిస్తున్నారా లేదా అన్నదానిపై ఆడిట్ చేయాలని సూచించారు. ఇటువంటి బ్యాటరీ గ్యాలరీనే రెండవ బ్లాక్‌లో అగ్ని ప్రమాదానికి గురైందని సిఎం చంద్రబాబుకు సిఎస్ విజయానంద్ వివరించారు. అనంతరం సిఎం, సిఎంఆర్ఎఫ్ విభాగాన్ని పరిశీలించారు. పనిప్రదేశంలో చెత్త పేరుకు పోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 24 గంటల్లో చెత్తను తరలించాలని, ఎక్కడా చెత్త కనబడకూడదని సిఎం పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర హోమ్‌శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ 10నిమిషాల లోపే అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారన్నారు. జిఎడి, సిఆర్‌డిఎ శాఖల అధికారులు షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమై ఉండొచ్చాని ప్రాథమిక అంచనాకు వచ్చారన్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన అనంతరం ఇందుకు బాధ్యులపై చర్యలు ఉంటాయని అనిత తెలిపారు. బ్యాటరీలు మాత్రమే దగ్ధమయ్యాయని, అంతకు మించి ప్రమాదం ఏమీ లేదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు.

## పోర్టల్ ద్వారానే సిఫార్సు లేఖలు

ప్రజాశక్తి -తిరుమల

తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇకపై తిరుమల తిరుపతి దేవస్థానానికి ఇచ్చే సిఫార్సు లేఖల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్ ద్వారా లేఖలు పంపించాల్సి ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు భక్తులకు ఇచ్చే విఐపి బ్రేక్ దర్శనం, రూ. 300 ప్రత్యేక దర్శన టికెట్లకు సంబంధించిన లేఖలన్నీ ఈ పోర్టల్ ద్వారానే సమర్పించాల్సి ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం ఈ పోర్టల్‌ను ప్రజాప్రతినిధులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై ప్రజాప్రతినిధులు ఈ పోర్టల్ ద్వారానే సిఫార్సు లేఖలను తయారు చేసి, వాటిని సంతకం చేసిన తర్వాత స్కాన్ చేసి అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం భక్తులకు అసలు లేఖను అందజేయవచ్చు. ఈ విధానం ద్వారా ప్రజాప్రతినిధులు ఇచ్చే లేఖలకు ఒక ప్రత్యేకమైన సమర్థమైన విధానం నెలకొంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ పోర్టల్‌లో నమోదైన లేఖల వివరాల ప్రకారమే భక్తులకు దర్శన అనుమతులను మంజూరు చేస్తుందని స్పష్టం చేశారు. పోర్టల్‌లో లేనిలేఖలను తిరుమల తిరుపతి దేవస్థానం అంగీకరించదని తెలియజేశారు. ప్రజా ప్రతినిధులకు ఈ పోర్టల్‌ను ఎలా ఉపయోగించాలో వివరించే యూజర్ గైడ్ కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలందరూ ఈ కొత్త విధానాన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# కళలకు పూర్వ వైభవం

- అమరావతి చిత్రకళా ప్రదర్శనలో డిప్యూటీ స్పీకర్



సిఎం చంద్రబాబు వేసిన చిత్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, మంత్రి దుర్గేష్ తదితరులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రంలో కళలకు పూర్వ వైభవం వస్తోందని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో స్థానిక సెంట్రల్ జైలు ప్రధాన రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన అమరావతి చిత్రకళ ప్రదర్శనను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. సుమారు 500 మంది కళాకారులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను డిప్యూటీ స్పీకర్, మంత్రి సందర్శించారు. అనంతరం నిర్వహించిన సభలో డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ.. కళలకు పుట్టినిల్లు అయిన రాజమహేంద్రవరంలో ఈ ప్రదర్శన నిర్వహించడం హర్షణీయమన్నారు. కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎపి స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటిని అభినందించారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ ప్రదర్శనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్వయంగా చిత్రీకరించిన చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్ర పటాన్ని రూ.1,01,116లకు డిప్యూటీ స్పీకర్ కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్‌పి డి.నరసింహకిషోర్, సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

# సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియంగా రుషికొండ భవనాలు

- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం రుషికొండ భవనాలను సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియంగా మార్చాలని రాష్ట్రప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్రకమిటీ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం లేఖ రాశారు. విశాఖపట్నం నగరంలోని రుషికొండపై గత ప్రభుత్వం నూతనంగా నిర్మించిన అతిథి గృహం నిర్వహణపై రాష్ట్ర కేబినెట్ చర్చల్లో డిస్టినేషన్ వెడ్డింగ్‌లకు ఇవ్వాలని, సుప్రీంకోర్టు బెంచ్ పెట్టడానికి కేంద్రాన్ని కోరాలని రకరకాల ఆలోచనలు చేస్తున్నట్లు పత్రికలలో వచ్చిందని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించి ఏం చేయాలో చెబితే మంత్రిమండలి నిర్ణయించబోతున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఈ అంశంపై తాము గతేడాది నవంబర్ 16న సిఎంకు ఉత్తరం రాసిన విషయాన్ని గుర్తుచేశారు. విలాసవంతమైన ఈ భవనాన్ని నిర్మించడానికి గత ప్రభుత్వం సుమారు రూ.500 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని పేర్కొన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనం ప్రజలకే ఉపయోగపడాలని కోరారు. ఆ రీత్యా పిల్లలు మొదలుకొని పెద్దల వరకు స్వేచ్ఛగా భవనంలోకి అడుగుపెట్టి చూడడానికి అవకాశం కల్పించాలని సూచించారు. రాష్ట్ర విభజన తరువాత హైదరాబాదు, బెంగళూరు తరహాలో విజ్ఞానవంతమైన సైన్సు మ్యూజియం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేదని వివరించారు. ఆధునిక ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సైన్సు అండ్ టెక్నాలజీ మ్యూజియాన్ని ఈ భవనంలో ఏర్పాటుచేస్తే విద్యార్థులకు, యువతకు స్ఫూర్తివంతంగా ఉంటుందని సూచించారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని, ఇందుకు అవసరమైన నిధులను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని తెలిపారు. తద్విరుద్ధంగా సంపన్నుల విలాసాలకు దీన్ని వినియోగిస్తే అది ప్రజాతీర్పును ఉల్లంఘించడమే అవుతుందని వెల్లడించారు. కాబట్టి పై సూచనను గమనంలో ఉంచుకొని గత ప్రభుత్వ హయాంలో అత్యంత వివాదాస్పదమైన ఈ భవనాన్ని అర్థవంతంగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మహిళల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం

- రాష్ట్ర సెర్ప్ సిఇఒ కరుణ వాకటి
- ఫ్లిప్ కార్ట్, సెర్ప్ ఆధ్వర్యంలో అనంతలో తొలి వర్క్ షాప్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహిళల జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు రాష్ట్ర సెర్ప్ సిఇఒ కరుణ వాకటి తెలిపారు. అనంతపురం జిల్లాలోని అలెగ్జాండర్ హోటల్‌లో 'విలువ ఆధారిత మార్కెటింగ్' (వాల్యూ ఛేంజ్ డెవలెప్‌మెంట్ అండ్ మార్కెటింగ్ ఇంటర్వెన్షన్)పై శుక్రవారం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఫ్లిప్‌కార్ట్ కృషి చేస్తోందన్నారు. వాల్యూ చైన్ డెవలప్‌మెంట్ మార్కెటింగ్ ఇంటర్వెన్షన్‌పై ఫ్లిప్‌కార్ట్ సహకారంతో ఈ రోజు పైలెట్ ప్రాతిపదికన అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి రాష్ట్రస్థాయి సదస్సును అనంతపురంలో నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా ఫ్లిప్ కార్డ్, సెర్ప్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఎంఒయు కుదుర్చుకుందన్నారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పిడిలు, డిపిఎంలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ దళారుల ఇబ్బందులు లేకుండా రైతుకు ప్రతి కిలోకూ ఎక్కువ ధరను తీసుకొచ్చేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంలో రైతులకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయి సహకారం అందించాలని సూచించారు. ఫ్లిప్‌కార్ట్ కార్పొరేట్ వ్యవహారాల అసోసియేట్ డైరెక్టర్ గిరీష్ నాయర్ మాట్లాడుతూ దేశంలో ఫ్లిప్‌కార్ట్ సంస్థ రూ.20 కోట్ల విలువజేసే ఉత్పత్తులను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. ఆరు కోట్ల విలువైన ఉత్పత్తులను ఎఫ్‌పిఒల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. నాణ్యత తమకు ముఖ్యమని, ఎఫ్ఎస్ఎస్ఐ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉత్పత్తులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ బి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొనసాగనున్న భిన్నవాతావరణం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేడు అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకూ 12 ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవగా, 23 ప్రాంతాల్లో 50 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని వెల్లడించారు. అత్యధికంగా నంద్యాల జిల్లా మద్దూరు, ప్రకాశం జిల్లా రాళ్లపల్లిలో 111.5 మిల్లీ మీటర్లు వైఎస్సార్ కడప జిల్లా కలసపాడులో 110.7 మిల్లీ మీటర్లు, నంద్యాల జిల్లా పెరుసోమలలో 107 మిల్లీ మీటర్లు, సత్యసాయి జిల్లా కొండకోమర్లలో 101 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మరోవైపు పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలసలో 39.9 డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 39.2 డిగ్రీలు, శ్రీకాకుళం జిల్లా కొల్లివలసలో 39.1 డిగ్రీలు, కాకినాడ జిల్లా జగ్గంపేట, విజయనగరం జిల్లా గుర్లలో 38.9 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో 38.8 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదైనట్లు పేర్కొన్నారు.

# పంటలకు కనీస మద్దతు ధర

- 60 ఏళ్ల రైతులకు నెలకు రూ.10 వేల పింఛను
- ఎఐకెఎస్ జాతీయ సదస్సులో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతు తన పొలంలో విత్తనం విత్తితేనే దేశ భవిష్యత్ ఉంటోందని, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టాలను వెంటనే రద్దుచేయాలని, రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కేరళ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పి.ప్రసాద్‌తో పాటు పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మద్రాసులో నిర్వహించే ఎఐకెఎస్ జాతీయ మహాసభ నేపథ్యంలో శుక్రవారం కర్నూలు శ్రీలక్ష్మీ నరసింహ కల్యాణ మండపంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యమానుద్దేశించి ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందన్నారు. అధికారంలోకి రాక ముందు డాక్టర్ స్వామినాధన్ సిఫార్సులను అమలుచేస్తామని చెప్పిన మోడీ ఎన్నికల అనంతరం దొడ్డిదారిన కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడుతున్నారని విమర్శించారు. 60 ఏళ్ల దాటిని రైతులకు నెలకు రూ.పదివేల పింఛను ఇవ్వాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి జాతీయ మహాసభలో నిర్మాణం చేసి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల మెకయ్య మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించడాన్ని చట్టబద్ధత చేయాలని, మద్దతు ధర లేక రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లా డుతూ.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు, ఎపి రైతు సంఘం చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. దేశాన్ని కాపాడేది లౌకిక పార్టీలే అని, దేశంలో మతతత్వాన్ని రెచ్చకొట్టి బిజెపి మరోమారు అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నం చేస్తోందని సిపిఐ రామకృష్ణ విమర్శించారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి రామచంద్రయ్య, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య మాట్లాడారు.

## కాంతిరాణా పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

సినీనటి కాదంబరి జత్వాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ ఐపిఎస్ అధికారి కాంతిరాణా తాతా వేసిన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదిస్తూ పిటిషనర్ ఇప్పటికే బెయిల్ పొందారని, కౌంటర్ వేసేందుకు గడువు కావాలని కోరారు. ఇందుకు అంగీకరించిన జస్టిస్ ఎన్.హరినాథ్ విచారణను ఏప్రిల్ 8కి వాయిదా వేశారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేత కక్కుల విద్యాసాగర్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు తనను వేధించారని ముంబయి సినీనటి కాదంబరి జత్వాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఇబ్రహీం పట్నం పోలీసులు కేసు నమోదు చేశాక దర్యాప్తును సిఐడికి బదిలీ చేశారు. అయితే ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపిఎస్ అధికారి కాంతిరాణా తాతా తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. విచారణకు హాజరుకావాలని తరచూ నోటీసులు ఇస్తూ పిటిషనర్ను వేధిస్తున్నారన్నారు.

## అప్పులతో ముగ్గురు రైతులు ఆత్మహత్య

- వేర్వేరు జిల్లాల్లో ఘటనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

అప్పుల బాధ తాళలేక ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో ఇద్దరు కౌలు రైతులు ఉన్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన బండి కోటేశ్వరరావు (43) తన ఐదెకరాల సొంత పొలంతోపాటు ఎనిమిది ఎకరాలను కౌలుకు తీసుకుని ఏటా పత్తి, మిర్చి పంటలను సాగు చేసేవారు. ఈ ఏడాది కూడా సొంత పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. మూడేళ్ల నుంచి పంటలు దగ్గకపోవడంతో పంటల సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీలు కలిపి సుమారు రూ.35 లక్షలు అయ్యాయి. అప్పులు తీరే దారిలేకపోడంతో తన పొలం పక్కనే ఉన్న కుంటలోకి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు.

సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామానికి చెందిన నిజాంపట్నం శ్రీనివాసరావు (49) తనకున్న ఎకరం సొంత పొలంతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి పంటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయంలో వచ్చిన ఒడిదుడుకుల కారణంగా రూ.10 లక్షల వరకూ అప్పులపాలయ్యారు. అప్పులు తీరే దారిలేక పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.

అనంతపురం జిల్లా బెళుగుప్పకు చెందిన రైతు హనుమంతరెడ్డి (44) తనకున్న ఆరెకరాల పొలంలో వర్షాధార పంటలు సాగు చేసేవారు. పంటల పెట్టుబడుల కోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేశారు. ఆశించిన స్థాయిలో పంటలు చేతికందకపోవడంతో అప్పులకు వడ్డీల భారం అధికమైంది. మనస్తాపంతో గురువారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆయనను అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించారు.

## పోలవరానికి ద్రోహం

- బాబు, జగన్, పవన్‌పై షర్మిల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో




కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో కలిసి చంద్రబాబు, జగన్, పవన్ పోలవరం ప్రాజెక్టుకు ద్రోహం చేస్తున్నారని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో మొదటి దశ, రెండవ దశ అంటూ ప్రజలను మోసం చేస్తున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు, ముంపు ప్రాంతాల ప్రజల సమస్యలపై నియమించిన పార్టీ కమిటీ తన నివేదికను సమర్పించిన సందర్భంగా... విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.75 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించడం వల్ల రాష్ట్రానికి జీవనాడి కాలేదని, బ్యారేజితో సమానంగా మారిపోతుందని అన్నారు. 45.75 మీటర్ల వద్దే 194 టిఎంసిల నిల్వ సామర్థ్యం ఉంటుందని అన్నారు. లేని పక్షంలో బ్యారేజ్‌తో సమానంగా మారుతుందన్నారు. వైఎస్ఆర్ హయాంలో 33 శాతం పనులు పూర్తి చేస్తే, చంద్రబాబు 17 శాతం, జగన్ 3 శాతం పనులు మాత్రమే చేశారని చెప్పారు. రివర్స్ టెండరింగ్ పేరుతో జగన్ ప్రాజెక్టును నాశనం చేశారన్నారు. 41.15 మీటర్లకే ప్రాజెక్టును పరిమితం చేస్తే, రెండో దశ అబద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పోలవరం ఎత్తు 41.15 మీటర్లను పెడితే ఎంపిలు ఒక్కరూ నోరు మెదపలేదన్నారు. ఇది రాష్ట్రంపై బిజెపి చేస్తున్న కుట్ర అని, ఈ కుట్రలో చంద్రబాబు, జగన్, పవన్‌లు భాగస్వాములయ్యారని విమర్శించారు. పునరావాసం కోసం రూ.33 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని, దాదాపు 96 వేల కుటుంబాలకు ఇంకా పరిహారం అందలేదని అన్నారు. 85 వేల కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇవ్వకుండా తప్పించుకునే కుట్రలో భాగమే ఎత్తు తగ్గించడమన్నారు. వైఎస్ఆర్ ఆస్తులపై రూపొందించిన ఎంఒయుపై జగన్ స్వయంగా సంతకం చేశారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. విజయమ్మకు సరస్వతి షేర్లు గిఫ్ట్‌గా ఇచ్చాడని, ఇచ్చిన షేర్లు వెనక్కి ఇవ్వాలని అడుగుతూ కోర్టులో కేసు వేశాడని చెప్పారు. తల్లిపై కేసు వేసిన వ్యక్తిగా, మేనకోడలు, మేనల్లుడిని మోసం చేసి ఆస్తులను తీసుకున్న వ్యక్తిగా జగన్ మారాడన్నారు.

## వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తీరు దారుణం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తీరు దారుణంగా ఉందని టిఎన్‌టియుసి నాయకులు విళ్లా రామ్మోహన్ కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1513వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటీకరణ చర్యల్లో భాగంగానే కాంట్రాక్టు కార్మికులను స్టీల్‌ప్లాంట్‌లో తగ్గిస్తూ వస్తున్నారన్నారు. ప్లాంట్ కోసం భూములు, ఇళ్లను త్యాగం చేసిన నిర్వాసితులు ప్లాంట్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారని, ఇప్పుడు వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఉక్కు కర్మాగార ప్రగతిలో కాంట్రాక్టు కార్మికుల కృషి ఎనలేనిదన్నారు. ఇప్పటికైనా వారిని తొలగించడం ఆపాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా కార్మిక సంఘాలన్నీ పనిచేస్తున్నాయని, అవి ఇచ్చే పోరాట పిలుపుల్లో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఐక్య పోరాటాలతోనే ప్లాంట్ పరిరక్షణ సాధ్యమన్నారు.



మృతురాలి కుటుంబీకుల నుండి వివరాలు సేకరిస్తున్న బృందం

## బర్డ్‌ఫ్లూ మరణంపై కేంద్ర బృందం విచారణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా/అమరావతి బ్యూరో

బర్డ్‌ఫ్లూతో చిన్నారి మృతి చెందిన నేపథ్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేట బాలయ్య నగర్‌లో కేంద్రం కేంద్ర వైద్యారోగ్య శాఖ బృందం శుక్రవారం పర్యటించింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఐసిఎంఆర్ ఎయిమ్స్ బృందంలో ఎన్‌సిడిసి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంకుర్ గార్గ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నిధి షైనీ, ముంబై నుంచి శాస్త్రవేత్త డాక్టర్ శైలేష్, కేంద్ర పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ విజయ్ కుమార్, ఎయిమ్స్ హాస్పిటల్ పల్మనాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర ఉన్నారు. ముందుగా వీరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం మృతురాలు ఆరాధ్య కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. ఆ పరిసర ప్రాంతాల్లోని పలు ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం చికెన్ కొనుగోలు చేసిన షాపు వద్దకు వెళ్లి పరీక్షల నిమిత్తం కోడి మాంసం నమూనాలు సేకరించారు. నరసరావుపేటలో చిన్నారికి వైద్యం చేసిన ఆసుపత్రిలో వివరాలను సేకరించారు. నమూనాలు పరీక్షించిన అనంతరం ఫలితాల నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామని బృంద సభ్యులు తెలిపారు. పరిశీలనలో వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి, రాష్ట్ర ఎపిడమిక్ విభాగం నిపుణులు డాక్టర్ హనుమ కుమార్, పల్నాడు డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు వారి వెంట ఉన్నారు.

**బర్డ్‌ఫ్లూపై ఆందోళన వద్దు :సిఎంతో ఐసిఎంఆర్ బృందం**

బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చెప్పారు. నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ వైరస్(హెచ్5ఎన్1) లక్షణాలతో ఇటీవల బాలిక మరణించిన ఘటనపై ఐసిఎంఎఆర్ ప్రతినిధులు చంద్రబాబుతో సచివాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. బాలిక నుంచి సేకరించిన నమూనాలలో హెచ్5ఎన్1 లక్షణాలు బయటపడినప్పటికీ ఇతర అనారోగ్య కారణాలు కూడా బాలిక మరణానికి దారితీశాయని వివరించారు. ఉడికించని మాంసం తినడం, చిన్నారి కావడంతో వ్యాధి నిరోధకశక్తి లేకపోవడం, లెప్టోస్పిరోసిస్ (ఎలుకల విసర్జన వల్ల వ్యాపించే వ్యాధి), అపరిశుభ్ర వాతావరణం కూడా మృతికి కారణాలుగా తమ అధ్యయనంలో తేలిందన్నారు. ఆ పరిసర ప్రాంతంలో ఎనిమిది బృందాలతో సర్వే చేపట్టామని, చిన్నారి కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, స్థానికుల నమూనాలు పరీక్షించామని, ఎలాంటి బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని సిఎంకు వివరించారు. భవిష్యత్‌లో ఇలాంటి కేసులు నమోదుకాకుండా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించగా, యాంటీవైరల్ డ్రగ్స్ సిద్ధం చేశామని అధికారులు చెప్పారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

## గుంటూరులో సఖినివాస్ ప్రారంభం

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

**ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి**

రెడ్‌బుక్ పేరు చెబితే వైసిపి నేతలకు భయం కలుగుతోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. గుంటూరులోని మహిళా ప్రాంగణంలో రూ.2.27 కోట్లతో నిర్మించిన సఖి నివాస్ భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ... వైసిపి హయాంలో మహిళలపై జరిగిన దాడులను మర్చిపోయి ఆ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారి పేర్లతోనే రెడ్‌బుక్ తయారైనట్లు మంత్రి లోకేష్ చెప్పారని, ఇంకిత జ్ఞానం లేని మహిళా నాయకుల మాటాలను తాము పట్టించుకోమని మాజీ మంత్రి రోజానుద్దేశించి వ్యాఖ్యానించారు. మహిళల భద్రత, ప్రజల సంక్షేమం లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

## కాకాణి బెయిల్ పిటిషన్ మళ్లీ వాయిదా

**ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి**

మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్, విచారణ మళ్లీ వాయిదా పడింది. శుక్రవారం రాష్ట్ర హైకోర్టులో కాకాణి బెయిల్ పిటిషన్ పై ఆయన తరపు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ న్యాయవాది రాకపోవడంతో ఈ కేసును సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది. దాదాపు పది రోజుల నుంచి గోవర్ధన్‌రెడ్డి అరెస్టు బెయిల్ పిటిషన్‌పై ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే.

## కసిరెడ్డి పిటిషన్ కొట్టివేత

**ప్రజాశక్తి - అమరావతి**

మద్యం స్కాంలో సాక్షిగా తమ ఎదుట హాజరుకావాలని సిట్ జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ వైసిపి ప్రభుత్వంలో ఐటీ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డివేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. సిట్ ఇచ్చిన నోటీసుకు చట్టబద్ధత ఉన్నందున తాము జోక్యం చేసుకోలేమని చెప్పింది. సిట్ విచారణ సమయంలో వీడియో రికార్డింగ్ చేయాలని, లాయర్‌ను అనుమతించాలని పిటిషనర్ వినతిపత్రం సమర్పించినప్పుటికీ ఆ విషయాన్ని పిటిషన్ ద్వారా హైకోర్టును కోరలేదని ఆక్షేపించింది. తగిన సమయం ఇచ్చి తిరిగి నోటీసు జారీ చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ జస్టిస్ ఎన్. హరినాథ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. మద్యం కుంభకోణం కేసులో సాక్షిగా తమ ఎదుట హాజరుకావాలని మార్చి 25, 28న ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్) ఇచ్చిన నోటీసులను కొట్టేయాలంటూ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సిట్ తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ, నోటీసు ఇచ్చి విచారణకు హాజరుకావాలని కోరే హక్కు సిట్‌కు ఉందన్నారు. వాదనల తర్వాత హైకోర్టు సిట్ జారీ చేసిన నోటీసుల విషయంలో జోక్యానికి నిరాకరించింది. అలాగే, పిటిషనర్ వయసు 60 ఏళ్లు దాటలేదు, కాబట్టి కసిరెడ్డిని ఇంటి వద్దే విచారించేలా ఉత్తర్వులు కూడా ఇవ్వలేమని స్పష్టం చేసింది.

## 7న కాకాణి పిటిషన్ విచారణ

**ప్రజాశక్తి - అమరావతి**

క్వార్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారం ఆరోపణలతో నమోదైన కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వైసిపి నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి వేసిన వ్యాజ్యాన్ని ఈ నెల 7న హైకోర్టు విచారించనుంది.

ఎస్సి, ఎస్టి చట్టంలోని సెక్షన్లు ఈ కేసులో చెల్లుబాటు కాదని, రాజకీయ కారణాలతో కేసు నమోదు చేశారని కాకాణి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎస్సిఎస్టి సెక్షన్లు వర్తించవని ప్రాథమికంగా నిర్ధారణకు వస్తే ముందస్తు బెయిల్ మంజూరు చేసే అధికారం హైకోర్టుకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. శుక్రవారం ఈ వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు విచారణను ఏప్రిల్ 7కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## రోడ్డును తవ్వేస్తే సహించేది లేదు

- అడ్డుకున్న చీడిపాలెం గిరిజనులు
- వెనుదిరిగిన రియల్ ఎస్టేట్‌దారులు

**ప్రజాశక్తి- శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)**



శృంగవరపు మండల ంలోని ముషిడిపల్లి పంచాయతీ చినఖండేపల్లి నుంచి చీడిపాలెం వెళ్లేదారిని ఒక లేఆవుట్ యాజమాన్యం తవ్వేయడంతో రాకపోకలు ఆగిపోయాయి. శుక్రవారం పాఠశాల పిల్లలను తీసుకెళ్తున్న ఆటో నిలిచిపోవడంతో ఆ గ్రామ గిరిజనులు అక్కడికి చేరుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ... ఇక్కడ భూములు కొన్న కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిలో ఈ రోడ్డువుందని ఎవ్వరికి చెప్పకుండా ఏకంగా రోడ్డును తవ్వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో గడిచిన 40 ఏళ్లలో 7సార్లు ప్రజాధనంతో ఈరోడ్డును వేశారని, ప్రస్తుతం ఈ రోడ్డును మెటల్ రోడ్డుగా గ్రామస్థులు వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రజలు తిరుగుతున్న రోడ్డును యదేచ్ఛగా ఎలా తవ్వుతారని ప్రశ్నించారు. ఆ సమయంలో గ్రామపెద్దలు చేరుకోవడంతో వెనక్కి తగ్గిన లే అవుట్ సూపర్‌వైజర్లు పని ఆపి తిరిగి యాధాతథంగా రోడ్డువేస్తామని చెప్పడంతో గిరిజనులు శాంతించారు. ఈవిషయంపై లేవుట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. అది తమ జిరాయితీస్థలమని, ప్రభుత్వం రోడ్డు వేసినప్పుడు తమకు తెలియదని చెప్పారు. గ్రామస్తుల కోసం వేరే రోడ్డు వేస్తామని తెలిపారు. విఆర్ఒ గణపతి వచ్చి పరిశీలనచేశారు. గిరిజనులు ఆందోళన చేస్తున్న విషయం తెలియడంతో ఆక్కడకు పోలీసులు చేరుకున్నారు ఈరోడ్డు తవ్వకం విషయంపై గంట్యాడ తహాశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి వివరణ కోరగా ఈవిషయంపై పూర్తిస్థాయి పరిశీలనచేసి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.





### సులభతర సేవలందించేందుకే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

# స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు

- 26 జిల్లా కేంద్రాల్లో అందుబాటులోకి సేవలు
- దశల వారీగా 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు
- రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రజలకు సులభతర సేవలందించేందుకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ అధికారిక వెబ్‌సైట్‌లో స్లాట్‌బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏ రోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుకింగ్ ఉపయోగపడు తుందని అన్నారు. సచివాలయంలో శుక్రవారం మంత్రి అనగాని, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పిసిఓడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజి హరినారాయణ, అడిషనల్ ఐజి ఉదయ్‌భాస్కర్, జాయింట్ ఐజిలు రవికుమార్, సరోజలతో కలిసిస్లాట్ బుకింగ్ అవగాహన కరపత్రాన్ని, పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్లాట్ ఆధారిత అపాయింట్‌మెంట్‌లు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గిస్తాయన్నారు. నేటి నుంచి 26 జిల్లాల ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈస్లాట్ బుకింగ్ సిస్టమ్ దశలవారీగా అందుబాటులోకి వస్తుందని, 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇప్పటికే ఈ విధానం గాంధీనగర్, కంకిపాడు సభ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశామని, ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు స్లాట్ బుకింగ్ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయడంతోపాటు డాక్యుమెంట్ ప్రిపేర్ చేసుకోవడంతోపాటు ఫీజు కూడా చెల్లించిన అనంతరం స్లాట్ బుక్ చేసుకుంటే 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుందన్నారు. ఒకవేళ స్లాట్ బుక్ చేసుకోలేకపోతే అటువంటి వ్యక్తులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సాయంత్రం ఐదు గంటల తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా రూ.5 వేలు ప్రత్యేక ఫీజు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా వరుసగా మూడు రోజుల సెలవుల్లో సుమారు రూ.74 కోట్లు రిజిస్ట్రేషన్‌శాఖకు ఆదాయం వచ్చిందన్నారు. రిజిస్ట్రేషన్స్ తర్వాత ఆటో మ్యుటేషన్లు సులభతరం చేసేందుకు రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌ను రెవెన్యూ డేటా బేస్‌తో అనుసంధానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. మున్సిపల్, డిటిసిపి వంటి ఇతర శాఖలతో అనుసంధానం ప్రారంభించామని, 2025 ఏప్రిల్ 15నాటికి ఈ ప్రక్రియపూర్తవుతుందని చెప్పారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో వరుసగా తీసుకొస్తున్న సంస్కరణలతో అవినీతి తగ్గిపోయి పారదర్శకత పెరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ఫేస్‌లెస్, పేపర్‌లెస్, క్యాష్‌లెస్‌గా రిజిస్ట్రేషన్లు జరపాలనేది తమ లక్ష్యమన్నారు.

**స్లాట్ బుకింగ్ ఇలా:**

రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్‌సైట్ తీవస్త్ర-ఙర్‌తీఖ్‌ఙశీఅ .ఖజూ.స్త్రశీఇ.ఱఅ లోని పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ ద్వారా డేటా అందా ఎంట్రీ చేసి అప్లికేషన్ నెంబరును పొందాల్సి ఉంటుంది. అనంతరం స్లాట్ బుకింగ్ మాడ్యూల్‌లో అప్లికేషన్ నెంబరును ఎంటర్ చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆ రోజు నుంచి 15 రోజుల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు.

## కొనసాగనున్న భిన్నవాతావరణం

- విపత్తుల నిర్వహణ సంస్థ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేడు అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకూ 12 ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవగా, 23 ప్రాంతాల్లో 50 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని వెల్లడించారు. అత్యధికంగా నంద్యాల జిల్లా మద్దూరు, ప్రకాశం జిల్లా రాళ్లపల్లిలో 111.5 మిల్లీ మీటర్లు వైఎస్సార్ కడప జిల్లా కలసపాడులో 110.7 మిల్లీ మీటర్లు, నంద్యాల జిల్లా పెరుసోమలలో 107 మిల్లీ మీటర్లు, సత్యసాయి జిల్లా కొండకోమర్లలో 101 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మరోవైపు పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలసలో 39.9 డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 39.2 డిగ్రీలు, శ్రీకాకుళం జిల్లా కొల్లివలసలో 39.1 డిగ్రీలు, కాకినాడ జిల్లా జగ్గంపేట, విజయనగరం జిల్లా గుర్లలో 38.9 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో 38.8 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదైనట్లు పేర్కొన్నారు.

## క్షణ క్షణం ఏనుగుల భయం

**ప్రజాశక్తి - కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)**

కురుపాం నియోజకవర్గ ప్రజలకు క్షణక్షణం ఏనుగుల భయంతో కంటిమీద కునుకు లేకుండా పోతుంది. శుక్రవారం ఉదయం జియ్యమ్మ వలస మండలం పెదమేరంగి జంక్షన్ వద్ద కురుపాం గ్రామానికి చెందిన వ్యక్తి వ్యాను చింతపండు లోడుతో వెళ్తుండగా వ్యాన్‌పై ఏనుగులు దాడి చేశాయి. దీంతో డ్రైవర్, క్లీనరు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. వ్యానులో ఉన్న చింతపండును చిందర వందర చేసి వ్యాన్ అద్దాలను పగలగొట్టాయి. అంతేకాకుండా నిత్యం పంట పొలాలపై పడి పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురై ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులను తమ గ్రామాల నుంచి దూరంగా అటవీ ప్రాంతాలకు తరలించి తమ ప్రాణాలను, పంటలను కాపాడాలని కోరుతున్నారు.

## నూతన పారిశ్రామికవేత్తలకు ఊతమిచ్చేలా పాలసీలు

- మంత్రులు టిజి భరత్, కె శీనివాస్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

యువ, నూతన పారిశ్రామికవేత్తలకు ఊతమిచ్చేలా కూటమి ప్రభుత్వం ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చిందని, ఇప్పటివరకూ రూ.8.50 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని పరిశ్రమలశాఖ మంత్రి టిజి భరత్, ఎంఎస్ఎంఇ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలోని ఒక హోటల్‌లో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి ప్రగతిశీల విధానాల కోసం కార్యాచరణ మార్గదర్శకాలను మంత్రులు శుక్రవారం విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి భరత్ మాట్లాడుతూ... ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తున్నామని, వారికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఇండస్ట్రియల్ పాలసీ తీసుకొచ్చినా నియమ నిబంధనలు రూపొందించలేదని చెప్పారు. పారిశ్రామిక వేత్తలకు గత ప్రభుత్వం బకాయిపెట్టిన సబ్సిడీలను త్వరలోనే విడుదల చేయనున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం నూతన పారిశ్రామిక విధానం తీసుకురావడంతోపాటు గత ప్రభుత్వం విడుదల చేసిన పాలసీలకూ నియమనిబంధనలు రూపొందించామని చెప్పారు. ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... మరో రెండు నెలల్లో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మరో రెండేళ్లలో 175 ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కనీసం మండలానికో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నామని వివరించారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగ కల్పనతో భాగంగా ఇప్పటినుంచే పారిశ్రామిక అనుకూల విధానాలు అవలంభిస్తున్నట్లు తెలిపారు. పి3, పి4 విధానంలో ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎపి ఇండస్ట్రియల్ డవలప్మెంట్ పాలసీ 4.0, ఎపి ఎంఎస్ఎంఇ, ఎంటర్ ప్రెన్యూర్ డవలప్మెంట్ పాలసీ 4.0, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 నియమ నిబంధనలను మంత్రులు భరత్, శ్రీనివాస్ విడుదల చేశారు. వెబ్ పోర్టల్‌ను మంత్రులు ప్రారంభించారు. కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఎపి ఎంఎస్ఎంఇడిసి ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జా బాబూరావు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ సిఇఒ గడ్డం శేఖర్ బాబు, ఎపి ఎంఎస్ఎంఇడిసి సిఇఒ ఎం.విశ్వ, పారిశ్రామికవేత్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సముద్ర తీరంలో తాబేళ్ల సందడి

**ప్రజాశక్తి - భోగాపురం (విజయనగరం జిల్లా)**



సముద్ర తీరంలో తాబేళ్ల పిల్లలు సందడి చేస్తున్నాయి. గుడ్లు పొదిగి పిల్లలు వస్తుండడంతో వాటిని ట్రీ ఇండియా స్వచ్ఛంద సంస్థ సిబ్బంది తీరంలో వదులుతున్నారు. వందలాది పిల్లలు ఒడ్డు నుంచి సముద్రంలోకి బుజ్జి బుజ్జి అడుగులు వేసుకుంటు వెళున్నాయి. జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఏటా జనవరి నెల నుంచి పెద్ద పెద్ద తాబేళ్లు వందల సంఖ్యలో గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తుంటాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో గుడ్లు పెట్టేందుకు వచ్చిన తాబేళ్ళు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. తీరానికి వచ్చి ఇసుకలో పెట్టిన గుడ్లను తీరం ఒడ్డున ఉన్న అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రాల్లో స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఇసుక లోపల గుడ్లను ఉంచుతారు. రెండు మండలాల పరిధిలో చేపల కంచెరు, చోడిపిల్లిపేట, ముక్కాం, కోనాడ, తిప్పలవలస, బర్రిపేట, చింతపల్లి, పులిగెడ్డ ఇలా పది చోట్ల తీరప్రాంత గ్రామాల్లో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు వేసి గుడ్లను భద్రపరిచారు. ఈ రెండు మండలాల పరిధిలో సుమారు 56వేలు పైనే గుడ్లను స్వచ్ఛంద సంస్థ సభ్యులు సేకరించారు.

**రెండు వారాలుగా సముద్రంలోకి..**

గత 15 రోజుల నుంచి తాబేళ్ల పిల్లలను స్వచ్ఛంద సంస్థ సభ్యులు సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. ఈ సంరక్షణ కేంద్రాల్లో భద్రపరిచిన గుడ్లు గత రెండు వారాలుగా పొదిగి పిల్లలు వస్తున్నాయి. బయట చల్లదనం ఉంటేనే ఆ సమయంలో ఇవి బయటకు వస్తుంటాయి. అంటే ప్రతిరోజు ఉదయం నాలుగు నుంచి ఐదు గంటల ప్రాంతంలో, రాత్రి ఎనిమిది నుంచి తొమ్మిది గంటల ప్రాంతంలో పిల్లలు బయటకు వస్తున్నాయి. బయటికి వచ్చిన పిల్లలను స్వచ్ఛంద సంస్థ సభ్యులు సేకరించి వాటిని సముద్ర తీరం ఒడ్డున వదులుతారు. అవి నడుచుకుంటూ బుజ్జి బుజ్జి అడుగులు వేసుకొని సముద్రంలోకి వెళ్తుంటాయి. మే నెల ఆఖరి వరకు గుడ్లు పొదిగి పిల్లలు వస్తుంటాయని కంచెరు తీరంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు వాసుపల్లి రాము, నర్సింగరావు తెలిపారు.

**రెండు మండలాల్లో 56వేలు గుడ్లు సేకరించాం**

భోగాపురం, పూసపాటిరేగ తీర ప్రాంత గ్రామాల్లో తాబేళ్ల గుడ్లను సంరక్షించేందుకు పది సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 56 వేలు గుడ్లను సేకరించాం. సుమారు 5వేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టాం. మే నెలాఖరి వరకు గుడ్లు పొదుగుతాయి. ప్రతిరోజు పొదిగిన పిల్లలను సముద్రంలోకి విడిచి పెడుతుంటాం.

## పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవశిక్ష

**ప్రజాశక్తి- పావగడ (శ్రీసత్యసాయి జిల్లా)**

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష, రూ.1.5 లక్షల జరిమానా విధిస్తూ తుముకూరు ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. పావగడ తాలూకా లింగదహళ్లి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గతేడాది సంక్రాంతి పండుగ రోజున ఇంటి ముందు ముగ్గులు వేయడానికి రంగులు తీసుకొచ్చేందుకు లింగదహళ్లికి బయల్దేరింది. మార్గమధ్యలో శ్రీరామ్ అనే యువకుడు బాలికకు మాయ మాటలు చెప్పి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని సమీపంలోనే పొదల చాటుకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ద్వారా ఈ విషయం తెలుసుకున్న బంధువులు అరసికెరె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో, పోలీసులు శ్రీరామ్‌ను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. రూరల్ సిఐ గిరీష్ దర్యాప్తు చేసి కోర్టుకు వివరాలు అందించారు. బాలిక తరపున ప్రభుత్వ న్యాయవాది హనుమంతరాయ తలికేరి వాదించారు. పూర్వాపరాలను పరిశీలించిన తుముకూరు ప్రత్యేక కోర్టు బాలికకు జిల్లా న్యాయ సేవ ప్రాధికార సమితి నుంచి రూ.8 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. నిందితుడు శ్రీరామ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 1.5 లక్షల జరిమానా విధించింది.

## శ్రీనివాస దీక్షితులు పిటిషన్ తిరస్కరణ

**ప్రజాశక్తి - అమరావతి**

తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడిగా తనను నియమించే విధంగా టిటిడి ఈవోకు ఉత్తర్వులు జారీ చేయాలంటూ అర్చకుడు శ్రీనివాస దీక్షితులు వేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు డిస్మిస్ చేసింది. ఫలానా ప్రాంతంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరే హక్కు ఉద్యోగులకు ఉండదని తేల్చి చెప్పింది. పరిపాలన అవసరాలకు అనుగుణంగా బదిలీలు ఉంటాయని, ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ మండవ కిరణ్మయి మూడు రోజుల క్రితం తీర్పు చెప్పారు. తిరుమలలో అర్చకుడిగా చేస్తున్న తనను తిరుపతి గోవిందరాజస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడిగా పోస్టింగ్ ఇచ్చారని, తిరుమలలో ప్రధాన అర్చకుడిగా నియమించాలని కోరుతూ ఈవోకు దరఖాస్తు చేసుకుంటే తిరస్కరించారంటూ ఈ పిటిషన్ వేశారు.

సంపాదకీయం

# వ్యతిరేకించాలి

ప్రతిపక్షాల తీవ్ర ప్రతిఘటనల నడుమ వక్ఫ్ చట్టానికి సమూల సవరణలు చేసే బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందింది. రాజ్యాంగాన్ని, ముస్లిం మైనార్టీల హక్కులను, మత స్వేచ్ఛను ఈ బిల్లు హరిస్తుందని లౌకిక, ప్రజాస్వామ్యవాదులు, ముస్లిం సమాజం వెలిబుచ్చిన అభ్యంతరాలను, ఆందోళనలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బుల్డోజ్ చేసి మరీ బిల్లును ఆమోదింపజేసుకుంది. లోక్‌సభలో, రాజ్యసభలో బుధ, గురువారాల్లో సుదీర్ఘ చర్చకు ప్రభుత్వం అవకాశం కల్పించడం నటన తప్ప సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోడానికి కాదని కేంద్ర మంత్రుల వాలకం చూస్తే అర్థమవుతుంది. బిల్లును ప్రవేశపెడుతూ మైనార్టీల వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలు మరీ జుగుప్సాకరంగా ఉన్నాయి. పార్లమెంట్ సైతం వక్ఫ్ ఆస్తి అయ్యే ప్రమాదం నుంచి రక్షించామని రెచ్చగొట్టారు. వివాదాస్పద వక్ఫ్‌బిల్లు ఆమోదానికి బిజెపి పాత్ర ఎంత ఉందో, మెజార్టీ లేని మోడీ ప్రభుత్వానికి భుజం కాసిన ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలదీ అంతే పాత్ర ఉంది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమికి నాయకత్వం వహిస్తున్న టిడిపి, జనసేన, బీహార్ అధికార పార్టీ జెడియు సహాయంతోనే మోడీ ప్రభుత్వం మనగలుగుతోంది. ఆ పార్టీలు బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపాయి. చట్టం వచ్చాక ముస్లిం హక్కులకు వాటిల్లే అన్యాయాలు, నష్టాలకు బిజెపి పల్లకి మోస్తున్న ఆయా పార్టీలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

వక్ఫ్ చట్ట సవరణల బిల్లు మోడీ సర్కారు కేంద్రంలో మూడవ తడవ వచ్చీ రాగానే గతేడాది ఆగస్టులో లోక్‌సభలో ప్రవేశపెట్టింది. విపక్షాలతోపాటు ఎన్‌డిఎలోని కొన్ని పార్టీలు, ఎన్‌డిఎకు సన్నిహితంగా ఉండే పార్టీలు సైతం వ్యతిరేకించాయి. దాంతో బిల్లుపై విస్తృత స్థాయి చర్చల నిమిత్తం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి ప్రభుత్వం అప్పగించింది. జెపిసి నిర్వహించిన సమావేశాలు మొక్కుబడిగానే సాగాయి. బిజెపికే చెందిన జెపిసి ఛైర్మన్ జగదాంబికాపాల్ ప్రతిపక్షాలు, ముస్లిం సంఘాలు, సంస్థల అభిప్రాయాలను సరిగ్గా వినిపించుకోలేదన్న విమర్శలు వచ్చాయి. దాంతో జెపిసి తుది నివేదిక ఏ విధంగా ఉంటుందో తెలిసిపోయింది. కాగా బిల్లులోని పలు అంశాలు ముస్లిం ప్రజల ఆస్తులను కొల్లగొట్టేవిగా ఉన్నాయి. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 రద్దు వలన వక్ఫ్ తన ఆస్తులపై అధికారాన్ని, నియంత్రణను కోల్పోతుంది. సునాయాసంగా వక్ఫ్ ఆస్తులను స్వాధీనపర్చుకొనే కుట్రలెన్నో బిల్లులో కనిపిస్తాయి. రాజ్యాంగంలోని 25,29,30 ఆర్టికల్స్‌కు, ఇతర నిబంధనలకు విరుద్ధమైన బిల్లు అయినందునే సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హిందూత్వ ఎజెండాలో భాగమే వక్ఫ్ బిల్లనడంలో ఎలాంటి శషభిషలూ అక్కర్లేదు. బిజెపి, సంఘ్ పరివార్‌ల లవ్‌జిహాద్, ఘర్‌వాపసీ, ఏకరూప పౌరస్మృతి, మసీదుల తివిధ్వంసం, మూక దాడులకు కొనసాగింపుగానే వక్ఫ్ బిల్లును చూడాలి. బిల్లులోని కొన్ని సవరణలు మత విద్వేషాలను రాజేసేవిగా ఉన్నాయి. వక్ఫ్ బోర్డులలో ఇతర మతస్తుల నియామకానికి అవకాశం కల్పించే సవరణ మత విభజనకు ఉద్దేశించినదే. వక్ఫ్ స్థలాలపై యాజమాన్యాన్ని నిరూపించుకునే విషయంలో ఐదేళ్లుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నట్లు అధీకృతంగా తెలపాలి. ఈ నిబంధన ముస్లింలను వేధింపులకు గురి చేస్తుంది. అచ్చం సిఎఎ చట్టాన్ని తలపిస్తుంది. వక్ఫ్ విద్యా సంస్థలు, ఆస్పత్రులు, వృత్తి పరమైన శిక్షణా సంస్థల అక్రమ స్వాధీనానికి, జప్తునకు వక్ఫ్ బిల్లు తప్ప వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, అభివృద్ధికి ఎంత మాత్రం కాదు. ఒక పథకం ప్రకారం ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి చేస్తుంది. ఒకసారి వక్ఫ్ చేసిన ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగానే ఉంటాయి, వాటిని మార్చే అధికారం ఎవ్వరికీ లేదు అని గతంలో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. సుప్రీం తీర్పునకు భిన్నంగా మోడీ సర్కారు బిల్లు తెచ్చింది. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న బిల్లుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పలు పార్టీలు, సంఘాలు ప్రకటించాయి. కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడకుండా లౌకిక, ప్రజాతంత్ర వాదులు, పార్టీలు బిల్లును ఏకోన్ముఖంగా వ్యతిరేకించాలి. ఉపసంహరించుకునేలా మోడీ ప్రభుత్వ మెడలు వంచాలి.

మహనీయుల మాట

**డా॥ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి**



**కుల అణచివేతలు, గుడ్డి ద్వేషాలు, అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సామాజిక సంస్కరణోద్యమాలలో జగ్జీవన్ రామ్ విశిష్టమైన స్థానాన్ని పదిలపరచుకున్నారు. అణగారిన సామాజిక వర్గాల అభ్యున్నతికి అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ పనిముట్టుగా మలుచుకున్నారు.**

జననం : 5.4.1908
మరణం : 6.7.1986

# ఐఐటీ ల్లో ఉపాధి అవకాశాలు ఎందుకు తగ్గుతున్నాయి?

విశ్లేషణ



**వి. రాంభూపాల్**

**కొత్త సంస్థలు రాకపోగా వున్నవి మూత పడడం ఈ రంగాన్ని మరింత కలవర పరస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,300 కంపెనీలు మూతపడ్డాయి. వీటిలో మహారాష్ట్రలో 459, కర్ణాటకలో 440 మూతపడడం ఈ రంగంలో వున్న సంక్షోభానికి పరాకాష్ట. 2023 ఆర్థిక సంవత్సరంలో 2.40 లక్షల మందికి ఐటి రంగం ఉపాధి కల్పించగా, 2024 నాటికి ఇందులో 40 శాతం అంటే లక్ష మందికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయింది. దేశంలోని ఐదు పెద్ద ఐటి కంపెనీల్లో 21,838 మంది ఉద్యోగాలను కోల్పోయినట్లు మంత్రతత్వ శాఖ నివేదిక తెలిపింది. ఐటి ఉద్యోగాలు తగ్గడమంటే దానితో ముడిపడిన ఈ అన్ని రంగాలు కష్టాల్లో వున్నట్లే. అందుకే క్యాంపస్ నియామకాలు తగ్గిపోతున్నాయి. ఎంపికైన వారికి సంవత్సరాలుగా ఉద్యోగాలు ఇవ్వడంలేదు. పనిలో వున్నవారికి వేతనాల పెంపుదల నామమాత్రంగా జరుగుతున్నది.**




దేశంలోని 23 ఐఐటిల్లో క్యాంపస్ సెలక్షన్లు తగ్గడంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటిల్లోనూ ప్లేస్‌మెంట్లు గణనీయంగా తగ్గాయని ఈ నివేదిక తెలిపింది. 2021-22లో 98.54 శాతం ఉన్న ప్లేస్‌మెంట్లు 2023-24 నాటికి 79.88 శాతానికి తగ్గాయి. ఇందులో దేశ రాజధాని ఢిల్లీ ఐఐటి లో 15 శాతం, ఆర్థిక రాజధాని ముంబయిలో 12.72, మద్రాసులో 12.42, కాన్పూర్‌లో 11.15 శాతం మేర తగ్గిపోవడం తీవ్ర ఆందోళనకరమని నివేదిక అభిప్రాయపడింది. ఈ పరిస్థితి కొత్తగా స్థాపించిన ఐఐటిలకే పరిమితం కాలేదని, 2015కు ముందు నుండి వున్న వాటిల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ప్రకటించింది. పరిస్థితిని వివరించిన స్టాండింగ్ కమిటీ ఇది సాధారణమేనంటూ, ఈ క్షీణతను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టాలంటూ సూచనలతో సరిపుచ్చింది. దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యాలయాలుగా వున్న ఐఐటి, ఎన్ఐటి లలో చదువుకున్న వారికే ఉద్యోగాలు రాకపోతే ఇతర ఇంజనీరింగ్ విద్యార్థుల పరిస్థితి ఏమిటి? ఈ పరిస్థితులకు కారణాలు ఏమిటి? యువతకు ఉపాధి చూపే పరిష్కారాలు ఏమిటని కేంద్ర పాలకులు ఆలోచించడంలేదు. మరోవైపు ఐటి రంగంలో కొత్త కంపెనీలు రావడంలేదని, వున్నవే మూత పడుతున్నాయని సేవా రంగాల రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజా నివేదిక ప్రకటించింది.

ప్లేస్‌మెంట్లు ఎందుకు లేవు? అంటే ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గడం. అవి ఎందుకు తగ్గాయంటే యూరప్, అమెరికాతోపాటు మన దేశ ఆర్థిక వ్యవస్థల సంక్షోభం కారణం. సంక్షోభం ఎందుకు వచ్చిందంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, దీనికి మూలం అత్యధికమంది ఆధారపడిన వ్యవసాయం దివాళా తీయడం. లక్షల మందికి ఉపాధినిచ్చిన ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం, కొత్త పరిశ్రమలను స్థాపించకపోవడం, దేశీయ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించకుండా అదానీ, అంబానీలను పెంచి పోషించడం. వీటి ఫలితంగా కోట్లాది యువత నిరుద్యోగంలో కూరుకుపోతుంటే, అతి కొద్దిమంది అత్యంత సంపన్న బిలియనీర్లుగా ఎదుగుతున్నారు. ఈ వాస్తవాలను ప్రజలు గుర్తించకుండా వుండేందుకు మొన్నటి వరకు మహా కుంభమేళా, తాజాగా అమెరికా అధ్యక్షుడు మోడీని పొగిడిన వార్తలతో మీడియా హోరెత్తిస్తున్నది.

**ఇంజనీరింగ్ క్రేజ్**

1991 తర్వాత అనుసరించిన ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా ఇంజనీరింగ్ విద్యకు కొత్త క్రేజ్ వచ్చింది. ఇంజనీరింగ్ పూర్తయితే చాలు, ఐటి రంగంలో ఉద్యోగం, లక్షల వేతనం గ్యారంటీ అనే ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. దీంతో ఇంజనీరింగ్ కోర్సులో చేరుతున్న విద్యార్థుల్లో అత్యధికమంది కొన్నేళ్ళుగా కంప్యూటర్స్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి విభాగాల్లో చదవడం పెరిగింది. రెండేళ్ళుగా కంప్యూటర్ సైన్స్‌లో 85 శాతం పైగా సీట్లు భర్తీ అవుతుంటే, మెకానికల్‌లో 40-45 శాతం, సివిల్‌లో 25-30 శాతం సీట్లు కూడా భర్తీ కావడంలేదు. సాంకేతిక రంగంలో పరిశోధనలు గణనీయంగా తగ్గాయి. మన రాష్ట్రంలో 2021-22 విద్యా సంవత్సరంలో 87 వేల మంది ఇంజనీరింగ్‌లో చేరితే అందులో 58 శాతం మంది కంప్యూటర్ కోర్సులు చదివారు. దానికి కారణం ఐటి రంగంలో ఉపాధి అవకాశాలతో పాటు, అధిక వేతనాలకు అవకాశాలు వుండడమే. గత రెండు దశాబ్దాలుగా మన దక్షిణాది రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ విద్య అనేది ఒక దర్జాగా మారింది. 2022 నాటికి దేశవ్యాప్తంగా 12,47,667 బీటెక్ సీట్లు వుంటే దక్షిణాది రాష్ట్రాల్లోనే 6,74,697 సీట్లు ఉన్నాయి. ఎంసీఏలో 70,065 సీట్లు వుంటే 30,812, ఎంబిఎ, పిజిడిఎం లాంటి మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించిన కోర్సుల్లో కూడా ఎక్కువ భాగం దక్షిణాది రాష్ట్రాల్లోనే వున్నాయి. అందులో కూడా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అత్యధిక భాగం వున్నాయి. గత ఐదేళ్ళుగా సంవత్సరానికి సగటున 4 లక్షల మంది విదేశీ విద్యకు వెలుతుంటే అందులో దక్షిణాది రాష్ట్రాల నుండి 2.8 లక్షల మంది ఉన్నారని ఎఐసిటిఇ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి) అధ్యయనంలో తేలింది.

**ఐటి రంగంలో కొలువుల కొరత**

ఐటి లో తమ పిల్లల భవిష్యత్ బాగుటుందనే ఆశతో లక్షల రూపాయలు ఖర్చు చేసి తల్లిదండ్రులు, తీవ్ర ఒత్తిళ్ళతో పిల్లలు కష్టపడుతున్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఆభరణంగా పిలవబడిన ఐటి రంగం మన దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారింది. 2004లో ఆరు లక్షల మంది సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందుతుంటే నేడు సుమారు పది లక్షలకు పైగా పెరిగింది. ఈ రంగం నుండి దేశ ఆర్థిక వ్యవస్థకు 1990లో 197 మిలియన్ల ఆదాయం రాగా, 2020 నాటికి 8,000 మిలియన్లకు పెరిగింది. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశ జిడిపిలో సేవా రంగం వాటా 55 శాతం వుంటుందని పాలకులు అంచనా వేశారు. అయితే గత మూడు సంవత్సరాల నుండి ఈ రంగం తీవ్ర సవాళ్ళను ఎదుర్కొంటున్నది. ప్రపంచ ఐటి అవుట్ సోర్సింగ్‌లో మన దేశం కీలక స్థానంలో వుందని ఇన్నాళ్ళూ గొప్పగా చెప్పుకున్నాం. మొదట్లో ఐటి రంగం కాల్ సెంటర్లకే పరిమితం అయ్యింది. క్రమంగా ఆరోగ్య సంరక్షణ, విద్య, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసులు, ఫైనాన్స్, వినోదం ఇలా అనేక రంగాలకు ఈ సేవలు విస్తరించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేవలం 6-8 శాతం మాత్రమే ఐటి రంగం వృద్ధి అయ్యే అవకాశం వుందని సేవ రంగాల రేటింగ్ సంస్థ క్రిసిల్ తాజాగా అంచనా వేసింది. గత ఐదు సంవత్సరాల్లో కొత్తగా స్థాపించబడిన ఐటి కంపెనీల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా పార్లమెంట్‌లో ప్రకటించింది.

2020లో 16,338 ఐటి కంపెనీలు వుంటే 2025 నాటికి 2,419 కి అంటే 90 శాతానికి తగ్గడం దేశీయ ఐటి రంగం పట్ల ఆశలతో వున్న కోట్లాది యువతను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. తాజాగా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ఆధారంగా కార్పొరేట్ దగ్గిజాలుగా పిలవబడుతున్న ఇన్ఫోసిస్, విప్రో వంటి కంపెనీలకు కేంద్రంగా వున్న బెంగళూరులో కొత్త ఐటి కంపెనీలు రావడంలేదు. కర్ణాటకలో 2020లో కొత్త ఐటి కంపెనీలు 2,544 స్థాపించగా, 2025 మార్చి నాటికి 212కు, మహారాష్ట్రలో 2,483 నుండి 375కు, తెలంగాణలో 2,077 నుండి 233 తగ్గాయని మంత్రితత్వశాఖ నివేదిక తెలిపింది. ఇది కేవలం కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాలేదని, దేశమంతటా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ప్రకటించింది. కొత్త సంస్థలు రాకపోగా వున్నవి మూత పడడం ఈ రంగాన్ని మరింత కలవరపరస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,300 కంపెనీలు మూతపడ్డాయి. వీటిలో మహారాష్ట్రలో 459, కర్ణాటకలో 440 మూతపడడం ఈ రంగంలో వున్న సంక్షోభానికి పరాకాష్ట. 2023 ఆర్థిక సంవత్సరంలో 2.40 లక్షల మందికి ఐటి రంగం ఉపాధి కల్పించగా, 2024 నాటికి ఇందులో 40 శాతం అంటే లక్ష మందికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయింది. దేశంలోని ఐదు పెద్ద ఐటి కంపెనీల్లో 21,838 మంది ఉద్యోగాలను కోల్పోయినట్లు మంత్రతత్వ శాఖ నివేదిక తెలిపింది. ఐటి ఉద్యోగాలు తగ్గడమంటే దానితో ముడిపడిన ఈ అన్ని రంగాలు కష్టాల్లో వున్నట్లే. అందుకే క్యాంపస్ నియామకాలు తగ్గిపోతున్నాయి. ఎంపికైన వారికి సంవత్సరాలుగా ఉద్యోగాలు ఇవ్వడంలేదు. పనిలో వున్నవారికి వేతనాల పెంపుదల నామమాత్రంగా జరుగుతున్నది. ఇదిలా వుండగా 18 గంటల పనిదినం కావాలని, ఆదివారం శెలవు ఎందుకని ఐటి యాజమాన్యాలు బహిరంగంగానే ప్రకటిస్తున్నాయి. దీంతో ఐటి ఉద్యోగుల్లో ఆందోళన పెరిగింది. ఇటీవల బెంగళూరులో వేలాది టెకీలు రోడ్డు మీదకొచ్చి 'మేము బానిసలం కాదు, మాకు కుటుంబాలు వున్నాయి' అని గర్జించారు.

**ఈ పరిస్థితికి కారణాలు**

2025లో ప్రపంచ ఆర్థికాభివృద్ధి రేటు 3.2 శాతానికి మించి వుండదని, అభివృద్ధి చెందిన యూరప్ దేశాలతో పాటు, అమెరికా 1 నుండి 1.78 శాతానికి మించి అభివృద్ధి సాధించలేవని ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు అంచనా వేశాయి. 46 దేశాల అభివృద్ధి మరింత కనిష్టంగా వుంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 13 శాతం మంది యువజనులు అంటే 6 కోట్ల 49 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే సంపదలో కార్మికుల వాటా పెద్ద ఎత్తున తగ్గింది. ప్రపంచ జనాభాలో 300 కోట్ల మంది దారిద్ర్యరేఖ కంటే దిగువన జీవిస్తున్నారు. మన దేశంలో వ్యవసాయం, తయారీ రంగాలు గత రెండు దశాబ్దాలుగా సంక్షోభంలో వున్నాయి. నోట్ల రద్దు, కోవిడ్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీశాయి. పదకొండు సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి దగ్గర ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన ఆర్థిక ప్రణాళిక లేదు. మతాన్ని, రాజకీయాలను మిళితం చేసి ప్రజల ఐక్యతను చీల్చి అధికారంలో కొనసాగడం, అధికార బలంతో కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టడం వారి విధానంగా వుంది. ఈ విధానాలనే మన రాష్ట్రంలో గతంలో జగన్ మోహన్ రెడ్డి, నేడు చంద్రబాబు కూటమి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. కూటమి నేతలు పి4 పేరుతో దాతల సహాయంతో పేదరికాన్ని నిర్మూలిస్తామని ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉన్నత విద్యావంతులైన యువత వాస్తవాలను గుర్తిస్తారు, దేశాభ్యుదయానికి సరైన బాటలు వేస్తారు.

**(వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు )**

# విఆర్‌ఏల గోడు పట్టించుకోరేం!

సమస్య



**కె. ఉమామహేశ్వరరావు**




**మన రాష్ట్రంలో కూడా విఆర్‌ఎలకు పేస్కేల్ జీతాలు చెల్లించాలని కోరుతుంటే ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. దశాబ్దాలుగా పని చేస్తున్న నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించడం లేదు. రాష్ట్ర వ్యాపితంగా ఏళ్ళ తరబడి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయడంలేదు. దీనివల్ల ఈ పోస్టులకు అర్హులైన విఆర్‌ఎలు వయోపరిమితి దాటిపోయి, తమకు అన్యాయం జరుగుతోందని ఆందోళన చెందుతున్నా పాలకులు స్పందించడంలేదు.**

గ్రామాలలో ఎంత చిక్కుముడి వున్న భూముల వివరాలు తెలియాలన్నా విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (విఆర్‌ఏ) లకే సాధ్యం. ఏ సర్వే నెంబర్‌లో ఎవరి భూమి ఉంది? ఎక్కడ వుంది? అనే విషయాలు చటుక్కున చెప్పగల సామర్థ్యం వీరి సొంతం. ప్రభుత్వ పెద్దలు, అధికారులు గ్రామ పర్యటనకు వచ్చి ముగించుకుని వెళ్లే వరకూ...వారికి కావలసిన అన్ని రకాల సేవలు వీరితోనే చేయిస్తారు. అనాథలు చనిపోతే, వారి పంచనామా, అంత్యక్రియలు జరిపించేదీ వీరే. గ్రామాలలో ఎవరికి ఏ అవసరం వచ్చినా మొదట వివరాలు అడిగేది విఆర్‌ఎలనే. చాకిరి బారెడు, జీతం మాత్రం గొర్రె తోక లాగా బెత్తెడు.

**ఎనిమిదేళ్ళగా జీతాలు పెరగలేదు**

రాష్ట్ర విభజన తర్వాత నేటి వరకు విఆర్‌ఏల జీతాలు పెరగలేదు. తాము అధికారంలోకి వస్తే విఆర్‌ఏలకు జీతాలు పెంచుతామంటూ టిడిపి, వైసిపి రెండూ పోటీలు పడి వాగ్దానాలు కురిపించాయి. 2015లో జగన్ మోహన్ రెడ్డి విఆర్‌ఎల ధర్నా శిబిరానికి వచ్చి నెలకు రూ.15,000 జీతం ఇస్తామంటూ వాగ్దానం చేశారు. గద్దెనెక్కారు కానీ, జీతం పెంచింది లేదు. విఆర్‌ఏ లకు కరువు భత్యం చెల్లించేవారు. దీనిని జీతంలో కలపడం వల్ల ఐదేళ్ళ కాలంలో జీతం పెరుగుదల కన్పించేది. కానీ, వైసిపి ప్రభుత్వం అప్పటి వరకు విఆర్‌ఎలకు ఇస్తున్న డి.ఎ ఎత్తివేసింది. అంతేగాక ఒక్కో విఆర్‌ఏ నుండి 14-15 వేల రూపాయలు రికవరీ చేసింది.

రాష్ట్ర వ్యాప్తంగా విఆర్‌ఏలు 2023-2024లో చేసిన పోరాట ఫలితంగా వైసిపి ప్రభుత్వం రూ.500 డిఎ చెల్లించేలా ఉత్తర్వులు జారీచేసింది. అయితే గతంలోలాగా డిఏ ని జీతంలో కలపక పోవడంతో వీరు జీవితాంతం నష్టపోతున్నారు.

**అదనపు పని భారం**

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చాకైనా జీతాలు పెరుగుతాయని, గతంలో లాగా డిఎని జీతంలో కలుపుతారని, ప్రమోషన్లు అమలు చేస్తారని విఆర్‌ఎలు ఆశించారు. కానీ, గత 9 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం విఆర్‌ఎల సమస్య ఏ ఒక్కటీ పరిష్కరించలేదు. పైగా నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు వేస్తోంది.

అన్నమయ్య జిల్లా మదనపల్లి రెవెన్యూ ఆఫీసులో అగంతకులు ఫైళ్ళు తగులపెట్టడంతో, రికార్డులను కాపాడాలంటూ విఆర్‌ఎలకు నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు వేశారు. పురుషులతో పాటు మహిళలకూ నైట్‌డ్యూటీలు వేశారు కాని వారి మాన, ప్రాణాలకు రక్షణ కల్పించే చర్యలు తీసుకోలేదు. దీనికి తోడు ఇసుక అక్రమ రవాణా, బియ్యం అక్రమ తరలింపుల వార్తలు సంచలనంగా మారడంతో వీటి రక్షణ నిమిత్తం విఆర్‌ఎలకు సంబంధం లేకపోయినా డ్యూటీలు వేశారు. ఫలితంగా విఆర్‌ఎలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పని చేయాల్సి వచ్చింది.

ఇదేగాక రీసర్వే పేరుతో మైళ్ల కొద్దీ ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేయాల్సి వచ్చింది. అదనపు పని భారం పెంచినా అందుకు అవసరమైన టిఏ, డిఏ లు గురించి పట్టించుకోలేదు. అదనపు పని భారానికి ఆర్థిక సమస్యలు కూడా తోడవడంతో విఆర్‌ఏ ల కుటుంబాలు పస్తులతో గడపాల్సిన స్థితికి నెట్టబడ్డాయి.

**నిర్బంధాన్ని ఎదుర్కొంటూ పోరాటం**

తమపై మోపిన అదనపు పనిభారాన్ని తగ్గించాలని, నిబంధనలకు విరుద్ధంగా వేసిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలని విఆర్‌ఎలు...మంత్రులు, అధికారులకు, ఇతర ప్రజాప్రతినిధులకు విన్నవించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహించారు. ప్రభుత్వ పెద్దలలో స్పందన లేకపోవడంతో శాంతియుతంగా 2024 డిసెంబర్ 18వ తేదీన సిసిఎల్‌ఏ కు సామూహిక రాయబార కార్యక్రమానికి పూనుకున్నారు. ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించినా దానిని అధిగమించి మంగళగిరి సిసిఎల్‌ఎ ఆఫీసు దగ్గర ధర్నా నిర్వహించారు.

రాష్ట్ర వ్యాపిత పోరాట ఫలితంగా మహిళలను నైట్ డ్యూటీల నుండి మినహాయిస్తూ సిసిఎల్‌ఎ డిసెంబర్ 27న ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన డిమాండ్ల పైనా ప్రభుత్వానికి సానుకూలంగా ప్రతిపాదనలు పంపించారు.

**పేస్కేల్ జీతాలు చెల్లించాలి**


తెలంగాణ ప్రభుత్వం గత మూడేళ్ళుగా విఆర్‌ఎలకు పేస్కేల్ జీతాలు చెల్లిస్తున్నది. ఇంకో 3 వేల మంది నామినీలకు పేస్కేల్ జీతాల కోసం అక్కడ పోరాటం జరుగుతోంది. మన రాష్ట్రంలో కూడా విఆర్‌ఎలకు పేస్కేల్ జీతాలు చెల్లించాలని కోరుతుంటే ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. దశాబ్దాలుగా పని చేస్తున్న నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించడం లేదు. రాష్ట్ర వ్యాపితంగా ఏళ్ళ తరబడి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయడంలేదు. దీనివల్ల ఈ పోస్టులకు అర్హులైన విఆర్‌ఎలు వయోపరిమితి దాటిపోయి, తమకు అన్యాయం జరుగుతోందని ఆందోళన చెందుతున్నా పాలకులు స్పందించడంలేదు.

పాలకులు మారుతున్నారే తప్ప విఆర్‌ఎల జీవితాలలో మార్పు రావడంలేదు. సిఐటియు అండతో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (గ్రామ సేవకుల సంఘం) విఆర్‌ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రెవెన్యూ మంత్రికి పలుమార్లు రాయబారాలు నిర్వహించింది. ప్రభుత్వంలో చలనం లేదు. ఈ నేపథ్యంలో విఆర్‌ఎలు మరో పోరాటానికి సన్నద్ధమవుతున్నారు. తమ న్యాయమైన పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతునిచ్చి తోడ్పడాలని వారు కోరుకుంటున్నారు.

**/వ్యాసకర్త ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి (సిఐటియు)/**

# గ్రీన్‌లాండ్ ప్రతిపత్తిని ప్రజలకే వదిలేయాలి

కత్తిరింపులు




అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఇటీవల గ్రీన్‌లాండ్ పర్యటనకు వెళ్లి 56 వేల మంది జనాభా కలిగి వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ఆర్కిటిక్ దీవిని ఎలాగైనా తమ అధీనంలోకి తెచ్చుకోవాలన్న ట్రంప్ పన్నాగాన్ని గురించి గట్టిగా మరోసారి నొక్కిచెప్పడం అమెరికా కండకావరాన్ని తెలియచేస్తోంది. అందుకే ఆయన పర్యటనకు గ్రీన్‌లాండ్ స్థానిక నేతలు, డెన్మార్క్ ప్రభుత్వం నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. గ్రీన్‌లాండ్‌పై డెన్మార్క్ ప్రభుత్వానికే సార్వభౌమాధికారం వుంది. గత కొద్ది వారాలుగా ఉద్రిక్తంగా వున్న అమెరికా-గ్రీన్‌లాండ్ సంబంధాలు దీంతో మరింతగా దిగజారాయి. పిటూఫిక్ స్పేస్ బేస్ (గతంలో తులే ఎయిర్ బేస్)ను వాన్స్ తనిఖీ చేస్తుండగా, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడం కోసం అమెరికా ఎంతకైనా తెగిస్తుందని ట్రంప్ ప్రకటించారు. ఆ దీవిని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నించడం ఇదే మొదటిసారి కాదు. 1867లో, రష్యా నుండి అలాస్కాను కొనుగోలు చేసిన తర్వాత అమెరికా, గ్రీన్‌లాండ్‌ను కొనేందుకు డెన్మార్క్‌తో చర్చలు జరిపింది. కానీ అవి ఫలించలేదు. రెండో ప్రపంచ యుద్ధంలో, నాజీ జర్మనీ డెన్మార్క్‌ను ఆక్రమించిన తర్వాత, గ్రీన్‌లాండ్‌లో మిలిటరీ, రేడియో స్టేషన్లను అమెరికా నెలకొల్పింది. 1946లో, గ్రీన్‌లాండ్ కోసం వంద మిలియన్ల డాలర్లు ఇస్తామంటూ అమెరికా ముందుకొచ్చింది. కానీ దాన్ని డెన్మార్క్ తిరస్కరించింది. ఇటీవలే, ట్రంప్ మొదటి హయాంలో కూడా ఇదే రకమైన ఆఫర్ చేశారు. దాన్ని కూడా డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లు మళ్లీ తిరస్కరించాయి. అట్లాంటిక్ సముద్రానికి రెండు వైపులా దేశాల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ దానితో నిమిత్తం లేకుండా ఇప్పుడు రెండో పదవీకాలంలో ట్రంప్ తన ఆలోచనను మళ్లీ దూకుడుగా ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తున్నారు.

అయితే 19వ శతాబ్దంలో లేదా 20వ శతాబ్దం మధ్యలో వున్న గ్రీన్‌లాండ్‌కు ఈనాటి గ్రీన్‌లాండ్‌కు చాలా తేడా వుంది. ఒకప్పుడు డానిష్ కాలనీగా వుండే గ్రీన్‌లాండ్ 1953లో డెన్మార్క్ రాజ్యంలోకి లాంఛనంగా చేరింది. 1979 రెఫరెండం తర్వాత, గ్రీన్‌లాండ్‌కు స్వయంప్రతిపత్తి వచ్చింది. కానీ విదేశాంగ వ్యవహారాలు, రక్షణ విభాగాలు మాత్రం డెన్మార్క్ ప్రభుత్వ అధీనంలో వుంటాయి. అప్పటి నుండి, గ్రీన్‌లాండ్‌లో జాతీయవాద భావజాలం బాగా పెరిగింది. 80 శాతం మందికి పైగా గ్రీన్‌లాండ్ జాతీయులు పూర్తి స్వాతంత్ర్యం కావాలని కోరుకుంటున్నారు. 85 శాతం మంది జనాభా అమెరికాలో భాగం కావడాన్ని వ్యతిరేకిస్తున్నారని మరో సర్వేలో వెల్లడైంది. గ్రీన్‌లాండ్ కోసం అమెరికా ఇంత గట్టిగా పట్టుబట్టడానికి భౌగోళిక, రాజకీయ కారణాలు అనేకం వున్నాయి. వాతావరణ మార్పుల వల్ల ఆర్కిటిక్ మంచు కరగడం పెరిగితే, ఆ ప్రాంతం నౌకల రాకపోకలకు, వనరుల తవ్వకాలకు మరింత వెసులుబాటుగా మారుతుంది. కేవలం ఐదు దేశాలకు మాత్రమే ఆర్కిటిక్ సముద్రంతో నేరుగా సంబంధాలు వున్నాయి. అవి కెనడా, రష్యా, నార్వే, డెన్మార్క్ (వయా గ్రీన్‌లాండ్), అమెరికా (వయా అలాస్కా). ఈ ప్రాంతంలో రష్యాకు ఇప్పటికే బలమైన మిలటరీ స్థావరం వుంది. గ్రీన్‌లాండ్‌పై పట్టు గనక వుంటే ఆర్కిటిక్‌పై తన పట్టును విస్తరించుకోవడానికి, ఇప్పటివరకు ఎవరికీ అందుబాటులోకి రాని ప్రకృతి వనరులు అందుబాటులోకి తెచ్చుకోవడానికి సులభంగా వుంటుందని అమెరికా భావిస్తోంది. కానీ వ్యూహాత్మకంగా లేదా ఆర్థికంగా ప్రయోజనాలు పొందడం కోసం ఆ భూభాగాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయడం గత సామ్రాజ్యాల ప్రవర్తనను ప్రతిధ్వనిస్తోంది. ట్రంప్ విస్తరణవాద ఆశయాలు రెండో ప్రపంచ యుద్ధానంతరం అసలే అంతంత మాత్రంగా వున్న అంతర్జాతీయ శాంతి భద్రతల వ్యవస్థను మరింత దెబ్బ తీసే ప్రమాదం వుంది. ప్రాదేశిక సమగ్రత, జాతీయ సార్వభౌమాధికారం సూత్రాలపైనే అంతర్జాతీయ శాంతి భద్రతలు ఆధారపడి వుంటాయి. గ్రీన్‌లాండ్ ప్రజల మనోభీష్టాన్ని అమెరికా గౌరవించాలి. గ్రీన్‌లాండ్ హోదాలో ఏదైనా మార్పు రావాలంటే అది కచ్చితంగా ఆ ప్రజల ప్రజాస్వామ్యయుతమైన ఎంపికల ద్వారానే రావాలి. అంతేకానీ భౌగోళిక, రాజకీయ క్రీడల ద్వారా లేదా వెలుపలి నుండి వచ్చే ఒత్తిళ్ళ ద్వారా కాదు.

**/ 'హిందూ' సంపాదకీయం /**

# ఆదుకోకపోతే యార్డును ముట్టడిస్తాం

- గుంటూరు మిర్చియార్డులో రైతుల నిరసన



గుంటూరు మిర్చి యార్డులో నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

**ప్రజాశక్తి-గుంటూరు**

తమను ఆదుకోకపోతే మిర్చి యార్డును ముట్టడిస్తామని రైతులు హెచ్చరించారు. రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యాన గుంటూరు మిర్చి యార్డులో శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం యార్డు సెక్రటరీకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడారు. గతేడాది మిర్చి ధర ఒక క్వింటాలు రూ.20 వేలు పైగా ఉండగా ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన ఎంఐఎస్ స్కీం ధర ఒక క్వింటాలుకు రూ.11,781 మాత్రమే ప్రకటించడం అన్యాయమన్నారు. ఈ స్కీమ్‌లో సాధారణ రకానికి కనీస ధర రూ.15 వేలు, మేలు రకాలకు రూ.20 వేలు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిర్చి సాగులో ఒక క్వింటాలుకు రూ.25 వేల నుండి రూ.30 వేలు ఖర్చు అవుతుంటే అందులో సగం కూడా ధర కల్పించడం లేదన్నారు. రైతులు విక్రయించుకున్న ప్రతి ఒక క్వింటాలుకు రూ.ఐదు వేలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం యార్డు సెక్రటరీతో చర్చించారు. సెక్రటరీ స్పందిస్తూ.. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించిన రైతులందరికీ మిగతా మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతుల వద్ద వివరాలు తీసుకుంటున్నామని, విధి విధానాలు విడుదల కావాల్సి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇ-క్రాప్‌లో నమోదవ్వని, పంట విక్రయించుకున్న కౌలు రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు జి.బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.


నోట్లో గడ్డి పెట్టుకుని నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

## నోట్లో గడ్డితో ఉపాధి కార్మికుల నిరసన

**ప్రజాశక్తి - చీడికాడ (అనకాపల్లి)**

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం చీడిపల్లి పంచాయతీలో శుక్రవారం ఉపాధి కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. నోట్లో గడ్డి పెట్టుకుని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వారికి మద్దతు తెలుపుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.53 కోట్ల ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తొమ్మిది వారాల నుంచి చెల్లింపులు చేయకపోతే కార్మికులు గడ్డి తిని బతకాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో ఉపాధి వేతనాలు చెల్లించని సంబంధిత శాఖపై కార్మికులు కేసు పెట్టే అవకాశం చట్టంలో ఉందని గుర్తుచేశారు. అటువంటి పరిస్థితి రాకముందే ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ ఏడాది కొత్త పనులకు రూ.ఏడు పెంచి ఉపాధి కార్మికులందరూ పండగ చేసుకోవాలంటూ ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. మండుటెండలో పని చేస్తున్న కార్మికులకు కనీసం టెంట్ సౌకర్యం కూడా కల్పించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. గతంలో తట్టా, గునపాం, పార, మంచి నీరు, ట్రావెలింగ్, సమ్మర్ అలవెన్సులు ఇచ్చే వారని, ప్రస్తుతం అవి పూర్తిగా కట్ చేసి రూ.ఏడు పెంచినట్టు ప్రకటించడం అన్యాయమని అన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన శాఖకు మంత్రిగా పవన్ కల్యాణ్ ఉండి వారి కష్టాన్ని అర్థం చేసుకోకపోవడం విచారకరమని తెలిపారు. ఉపాధి హామీ నిధులకు కేంద్రం కోతలు పెడుతూ వస్తోందన్నారు.

## అనంత కోర్టులో బోరుగడ్డ అనిల్

**ప్రజాశక్తి-అనంతపురం**

పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు జిల్లా కోర్టులో ప్రవేశపెట్టారు. బోరుగడ్డ అనిల్ ఏడేళ్ల క్రితం మారుపేర్లతో అనంతపురం త్రీటౌన్ సిఐ ఎస్ మురళీకృష్ణను దూషించినట్లు కేసు నమోదు అయ్యింది. అనంతపురం నగరం రామచంద్రనగర్‌లో ఉన్న చర్చికి సంబంధించిన ఆస్తుల విషయాల్లో రెండు గ్రూపుల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో 2018, జులై 22న చర్చి వద్ద సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ క్రాంతికుమార్‌లు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. ఇదే రోజున బోరుగడ్డ అనిల్ రెండుసార్లు, రెండు వేర్వేరు ఫోన్ నెంబర్లతో సిఐకు ఫోన్ చేసి బెదిరిస్తూ అసభ్య పదజాలంతో దూషించినట్లు పోలీసుల నిర్ధారణకు వచ్చారు. ఈ ఫోన్ నెంబర్లపై పోలీసులు విచారణ చేయగా అవి బోరుగడ్డ వినియోగించినట్లు తెలింది. ఈ నేపథ్యంలో ఆయనపై 2018 జులై 26న అనంతపురం 3వ నగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు నిమిత్తం అనిల్‌ను రాజమండ్రి జైలు నుంచి తీసుకొచ్చి అనంతపురం జిల్లా కోర్టులో హాజరపర్చగా ఈ నెల 10వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించింది. దీంతో బోరుగడ్డను పోలీసులు మళ్లీ రాజమండ్రి జైలుకు తరలించారు.


బోరుగడ్డను అనంతపురం నుంచి రాజమండ్రికి తీసుకెళ్తున్న పోలీసులు

## సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరు


సమావేశంలో నినాదాలు చేస్తున్న ఎపి కోకో రైతుల సంఘం నాయకులు

- ఎపి కోకో రైతుల సంఘం

**ప్రజాశక్తి- ఏలూరు అర్బన్**

కోకో గింజల కొనుగోలు, ధర సమస్యపై కోకో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ మేరకు ఈ నెల 7వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం కోసం ఎదురు చూస్తామన్నారు. కోకో రైతులకు న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏలూరులోని అన్నే భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోకో రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. నెల రోజులుగా కోకో రైతులు చేసిన పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపడం హర్షణీయమన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో జరిగిన జాయింట్ సమావేశంలో కంపెనీల ప్రతినిధులు అబద్దాలు చెప్పడం విమర్శించారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.750కుపైగా ధర ఉందని, కంపెనీలు రూ.550 నుండి రూ.450కే కొనుగోలు చేస్తుండడం, అన్ సీజన్ గింజలను కొనుగోలు చేయకపోవడం వల్ల కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మంత్రి హామీ మేరకు ఈ నెల ఏడో తేదీ వరకు కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలపై సానుకూల నిర్ణయం కోసం ఎదురు చూస్తామని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలు కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

కంపెనీల మోసాలు అరికట్టాలని కోరారు. కోకోను సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చే వరకు పోరాడుతామని తెలిపారు. కోకో రైతులందరూ సంఘటితం కావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, గుదిబండి వీరారెడ్డి, రాష్ట్ర కోశాధికారి జాస్తి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.


నాలుగు రోడ్డు కూడలిలో మానవహారం చేపట్టిన విద్యార్థులు

## హెచ్‌సియు విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ, రాస్తారోకో

**ప్రజాశక్తి - పార్వతీపురం**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమిని ఐటి కంపెనీ పేరుతో తెలంగాణ ప్రభుత్వం నాశనం చేస్తుందని, దీన్ని యూనివర్సిటీ విద్యార్థులు వ్యతిరేకిస్తూ ధర్నా చేయగా, వారిపై కేసులు, అరెస్టులు, లాఠీ ఛార్జీలకు పాల్పడడం అన్యాయమని విద్యార్థులు నిరసన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో స్థానిక పాత బస్టాండ్ నుంచి ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రాస్తారోకో,మానవహారం చేశారు. ఈ నిరసనుద్దేశించి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.అఖిల్, కె.రాజు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం నాశనం చేస్తోందని, పర్యావరణాన్ని కాపాడే పెద్ద పెద్ద చెట్లు, ఎన్నో రకాల పక్షులు అందులో ఉన్నాయని తెలిపారు. దీన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తుంటే విద్యార్థులపై కేసులు పెట్టడం, లాఠీఛార్జీలు, అరెస్టులకు తెలంగాణ ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కమిటీ సభ్యులు ఆదిత్య, అభి,సురేష్, మనీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

## మా స్థలాలు బలవంతంగా లాక్కున్నారు

- టిడిఆర్ బాండ్ల స్పెషల్‌డ్రైవ్‌లో బాధితులు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**


బాధితులతో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తమ భూములను ట్రాఫిక్ సమస్య పరిష్కారం పేరుతో తిరుపతి జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బలవంతంగా తీసుకున్నారని శుక్రవారం నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నగరంలో 23 నూతన మాస్టర్‌ప్లాన్ రోడ్ల కోసం దాదాపు రెండు వేల ఎకరాల భూములను తీసుకున్నారని ఆరోపించారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన టిడిఆర్ బాండ్ల జారీలో స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని శుక్రవారం కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు హాజరై టిడిఆర్ బాండ్ల దరఖాస్తులను పరిశీలించారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల వారీగా వివరాలను సేకరించారు. దరఖాస్తుల పరిశీలన, వాలిడేషన్, రిజిస్ట్రేషన్ విధానంపై వివరించారు. ఈ మేళాలో తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లు, డిసిపి మహాపాత్ర, ఎసిపిలు బాలాజీ, మూర్తి పాల్గొన్నారు. భూములు కోల్పోయిన బాధితులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అయితే డిసిపి మహాపాత్రోకు తెలుగు రాకపోవడంతో 'సమస్య ఎట్టా సెప్పుకోవాలంటూ' బాధితుల్లో గందరగోళపడడం కనిపించింది. మా స్థలాలను బలవంతంగా లక్కున్నారని బాధితులు వాపోయారు. బాధితులు తమ స్థలాలకు సంబంధించి పూర్తి ఆధారాలతో వచ్చి కార్పొరేషన్‌కు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తే, టిడిఆర్ బాండ్లు జారీ చేస్తామని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వారం రోజుల పాటు ఈ స్పెషల్‌డ్రైవ్ జరగనుంది.

## రాపిడో, ఉబర్, ఓలా సంస్థలకు అనుమతులు రద్దు చేయాలి



ఆటో డ్రైవర్ల ర్యాలీ

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రాపిడో, ఉబర్, ఓలా సంస్థలకు అనుమతులు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏలూరు నగరంలోని పాత బస్టాండ్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వరకు ఆటో డ్రైవర్లు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ విదేశీ కంపెనీలైన రాపిడో, ఉబర్, ఓలా సంస్థలు ఎటువంటి పెట్టుబడీ పెట్టకుండా ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని కోట్లాది రూపాయలు ఆటో డ్రైవర్ల ఆదాయాన్ని కొల్లగొడుతున్నారన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం సవారి యాప్ ద్వారా ఆ రాష్ట్రంలోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఆరు శాతం కమీషన్‌కు సేవలందిస్తోందని తెలిపారు. మన రాష్ట్రంలో రాపిడో వంటి సంస్థలు 25 నుండి 30 శాతం కమీషన్లను గుంజుతున్నాయని విమర్శించారు. రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో ఆటోస్టాండ్‌లకు పార్కింగ్ స్థలాలు లేవని, రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, కేరళ, తమిళనాడు తరహాలో ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూరేలా ఆన్‌లైన్ యాప్‌ను తయారు చేయాలని కోరారు. రాపిడో, ఉబర్, ఓలా సంస్థలను నిషేధించకపోతే రానున్న కాలంలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లందరినీ సమీకరించి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని, దానికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తొలుత సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి సోమయ్య జెండా ఊపి ఆటో ర్యాలీని ప్రారంభించారు. ధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ అమర్‌కుమార్, జె గోపీ, నగర అధ్యక్ష కార్యదర్శులు అడ్డాల రాజు, బి చంద్రశేఖర్ నాయకత్వం వహించగా పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు తమ ఆటోలతో ర్యాలీలో పాల్గొన్నారు.



విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వితేజ్

## విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభం

**విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకే : సంస్థ ఎండి పృథ్వితేజ్**

**ప్రజాశక్తి-విజయనగరంటౌన్**

విజయనగరం పాత జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఎదురుగా విశాఖ రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్‌ను తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ, విఎన్‌గ్లోబల్ ఎంటర్ ప్రైజెస్ సంస్థతో కలిసి సంస్థ సిఎండి ఇబ్బడి పృథ్వితేజ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించాలనే రాష్ట్ర ప్రభుత్వ క్లీన్ ఎనర్జీ విధానంలో భాగంగా తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లను ప్రయివేటు భాగస్వామ్యంతో పిపిపి విధానంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పది విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఛార్జింగ్ స్టేషన్ మొదటిదని వివరించారు.

రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో ఐదు వేల విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పిఎం సూర్యఘర్‌లో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పదివేల మంది ఎస్‌సి, ఎస్‌టి ఇళ్లకు సౌరవిద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. వారికి ఇంటిపైకప్పుపై ఏర్పాటుకు స్థలం ఉంటే ఇంటిపైనే ఏర్పాటు చేస్తామని, స్థలం లేని పక్షంలో ఇంటికి దగ్గరలో ఖాళీస్థలంలో ఏర్పాటు చేస్తామన్నారు. తమ సంస్థ పరిధిలోని జిల్లాల్లో ఇప్పటివరకు 7,800 సూర్యఘర్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ జిల్లాలో 700 వరకు యూనిట్లు ఏర్పాటైనట్లు తెలిపారు. పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకొంటే త్వరగా యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలోని 1912 విద్యుత్ కాల్ సెంటర్ మూడు షిఫ్టుల్లో 24 గంటలూ సేవలు అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. తమ సంస్థ పరిధిలో 35 శాతం సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ సంస్థల్లో ఇప్పటికే 90 శాతం మేరకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తయ్యిందన్నారు. గృహ వినియోగ దారులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఇంకా మొదలు కాలేదన్నారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ డి చంద్రం, సిజిఎం జంగా శ్రీనివాసరావు, ఎస్ఇ ముప్వల లక్ష్మణరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ బాలాజీ, ఆపరేషన్స్ ఇఇ పి త్రినాథరావు, డిఇ కిరణ్, టెక్నికల్ ఇఇ పి మురళి, రూరల్ డిఇ సురేష్‌బాబు, కన్‌స్ట్రక్షన్ డిఇ హరి, ఎంఆర్‌టి డిఇ కెవి సత్యనారాయణ, ఇపిడిసిఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలోనే మైనింగ్ రంగంలో నూతన పాలసీ తీసుకొస్తాం

- మంత్రి కొల్లు రవీంద్ర

**ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)**

మైనింగ్ రంగంలో ప్రకాశం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, జగన్ పాలనలో మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపిస్తామని రాష్ట్ర గనుల శాఖ మంత్రి రవీంద్ర తెలిపారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ సెజ్‌లోని ఫ్యాక్టరీలను సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో జగన్‌మోహన్‌రెడ్డి మైనింగ్ శాఖ మొత్తాన్ని దోపిడీకి వాడుకున్నారని విమర్శించారు. మైనింగ్ కంపెనీలపై రూ.వేల కోట్లు పెనాల్టీలు వేసి మొత్తం కంపెనీలను హస్తగతం చేసుకునేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. జగన్ అరాచకాలతో, తప్పుడు కేసులతో, వేధింపులతో మూతబడిన అన్ని యూనిట్లను తెరిపిస్తామని, త్వరలోనే నూతన పాలసీతో మైనింగ్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మైనింగ్ రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర ఆదాయం పెంచేందుకు చొరవ చూపిస్తామన్నారు. ప్రాసెసింగ్ రంగంలో విస్తారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయి. కటింగ్, ప్రాసెసింగ్ రంగంలో అత్యాధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా శ్రమ తగ్గించడమే కాకుండా నూతన ఆవిష్కరణలకు అవకాశం దక్కుతుందన్నారు. మైనింగ్ వ్యవస్థను రాష్ట్ర ఆదాయ సమపార్జనతో పాటు, ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రానైట్ పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గుండ్లపల్లి గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు మండవ రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ యజమానులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

# చైనా తగ్గేదేలే...!

- అమెరికాతో ఢీ అంటే ఢీ
- 34 శాతం సుంకాలు విధింపు
- ఏకపక్ష బెదిరింపులపై ఆగ్రహం



**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లతో ప్రపంచ దేశాలు వణికిపోతుంటే.. మన పొరుగు దేశం చైనా మాత్రం అంతే స్థాయి టారిఫ్‌లతో యుఎస్‌కు సవాల్ విసిరింది. అమెరికా వాణిజ్య విధానాలకు బదులుగా టారిఫ్‌లు విధించడానికి అనేక దేశాలు భయపడుతోన్న వేళ చైనా మాత్రం ధీటైన నిర్ణయం తీసుకుని.. ట్రంప్‌నకు ప్రతి సవాల్‌ను విసిరింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 34 శాతం సుంకాలను విధిస్తున్నట్లు చైనా ప్రకటించింది. అన్ని వస్తువులపై ఈ సుంకాలు వర్తిస్తాయని చైనా ది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టారిఫ్ కమిషన్ శుక్రవారం స్పష్టం చేసింది. టారిఫ్‌లు విధిస్తూనే మరోవైపు ఘాటైన సవాల్, హెచ్చరికలను జారీ చేసింది.

"చైనాలోని టారిఫ్ చట్టం, కస్టమ్స్ చట్టం, విదేశీ వ్యాపార చట్టం, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల ప్రకారం స్టేట్ కౌన్సిల్ ఆమోదంతో అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏప్రిల్ 10 నుంచి అదనపు సుంకాలు విధిస్తున్నాం" అని ది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టారిఫ్ కమిషన్, చైనా వెల్లడించింది. అమెరికాపై సుంకాలు విధించడాన్ని సమర్థించుకుంది. ప్రస్తుతం ప్రపంచ పెద్దన్నగా భావించుకుంటున్న అమెరికా అనుసరిస్తున్న ఈ విధానం అంతర్జాతీయ వాణిజ్య నియమాలకు అనుగుణంగా లేదని ఆందోళన వ్యక్తం చేసింది. ట్రంప్ చర్యలు తమ దేశ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని విమర్శించింది. అమెరికా అవలంబిస్తున్న ఏకపక్ష ఆర్థిక బెదిరింపు పద్ధతిని చైనా సహించబోదని స్పష్టం చేసింది.

**27 కంపెనీలపై చర్యలు..**

ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతులపై ఉన్న పన్నులకు అదనంగా ఈ టారిఫ్‌లు కూడా విధించనుంది. ఇప్పటికే అమల్లో ఉన్న పన్ను, ఇతర మినహాయింపు పాలసీలు కూడా కొనసాగనున్నాయి. మార్గం మధ్యలో ఉన్న సరకులు మే 13లోపు చేరుకొంటే.. వాటికి మాత్రం మినహాయింపు లభించనుందని తెలిపింది. తాజా ప్రతీకార చర్యల్లో చైనా అమెరికాకు చెందిన 11 డ్రోన్ తయారీ సంస్థల పేర్లను విశ్వసించని జాబితాలోకి చేర్చింది. అదే విధంగా 16 అమెరికా కంపెనీలపై ఎగుమతి నియంత్రణలను ప్రకటించింది.

చైనా నుంచి అమెరికాకు ప్రతీ ఏడాది సుమారు 438 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.37 లక్షల కోట్లు) వస్తువులు ఎగుమతి అవుతుంటాయి. అమెరికా నుంచి చైనా దిగుమతి చేసుకొనే వస్తువుల విలువ 143.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.12 లక్షల కోట్లు)గా ఉంది. 2024లో అమెరికా-చైనాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 582.4 బిలియన్ డాలర్లుగా ఉంది.

**డబ్ల్యుటిఒ నిబంధనలకు విరుద్ధం..**

"చైనా సహా పలు దేశాలపై అమెరికా పరస్పర సుంకాలను విధించింది. ఇది ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. నిబంధనల ఆధారంగా పనిచేసే బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను పట్టించుకోలేదు. మా ప్రయోజనాలను రక్షించుకొనేందుకు స్పందించే హక్కు మాకుంది" అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. ఇప్పటికీ టారిఫ్‌లపై అమెరికాతో తమ అధికారులు చర్చలు జరుపుతున్నారని చైనా తెలిపింది. ఇది ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రభావం అమెరికా ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తుందని అభిప్రాయపడుతున్నారు.

## మార్కెట్లలో సుంకాల ప్రకంపనలు

- సెన్సెక్స్ 900 పాయింట్ల పతనం
- రూ.9.5 లక్షల కోట్లు ఆవిరి
- ఫార్మా షేర్లపైనా పిడుగు

**ముంబయి :** అమెరికా సుంకాల ప్రకంపనలు భారత మార్కెట్లను భారీ నష్టాలకు గురి చేశాయి. ట్రంప్ పన్ను విధానాలు అమెరికా సహా ప్రపంచ దేశాల మార్కెట్లను ఓ కుదుపు కుదిపాయి. ఈ ప్రభావం శుక్రవారం దలాల్ స్ట్రీట్‌పై తీవ్రంగా పడింది. ఒక్క పూటలో మదుపర్ల సంపద రూ.9.5 లక్షల కోట్లు పైనా హరించుకుపోయింది. ఉదయం ప్రతికూలతలో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. తుదకు 931 పాయింట్లు లేదా 1.22 శాతం నష్టంతో 75,365కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 346 పాయింట్లు కోల్పోయి 22,904 వద్ద ముగిసింది. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.9.5 లక్షల కోట్లు తుడుచుకుపెట్టుకుపోయి రూ.403.83 లక్షల కోట్లకు పరిమితమయ్యింది.

భారత ఫార్మా ఉత్పత్తులపై సుంకాలను వేయబోమని తొలుత ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ మరుసటి రోజే మాట మార్చారు. ఔషధాలపై భారీగానే టారిఫ్‌లు వేస్తామని మీడియాతో ప్రకటించడంతో ఆ రంగం కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అరబిందో ఫార్మా, లారస్ ల్యాబ్స్, లుపిన్, సన్ ఫార్మా షేర్లు 7.2 శాతం వరకు పతనమయ్యాయి.

సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టి, అదానీ పోర్ట్స్ ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ బ్యాంక్, నెస్లే ఇండియా, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. ఫైనాన్షియల్, ఎఫ్ఎంసిజి షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు ఒత్తిడి ఎదుర్కొన్నాయి.

**ప్రధాన కారణాలు..**

ప్రపంచ దేశాల నుంచి అమెరికా చేసుకునే దిగుమతులపై భారీగా టారిఫ్‌లు విధించడం ఇన్వెస్టర్లలో తీవ్ర భయాలను నెలకొల్పింది. వాణిజ్య యుద్ధ భయాలు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తాయన్న నిపుణుల ఆందోళనలు పెరిగాయి. యుఎస్‌కు ధీటుగా చైనా, యూరోపియన్ యూనియన్ దేశాలు ప్రతీకార సుంకాల ప్రణాళికలను సిద్ధం చేస్తోన్నాయనే రిపోర్టులు మార్కెట్లను కుదిపేశాయి. ప్రతీకార సుంకాల మూలంగా యుఎస్ మాంద్యంలోకి వెళుతుందన్న అంచనాలు పెరిగాయి.

**సుంకాలతో దెబ్బ : కేర్‌ఎడ్జ్ రేటింగ్స్**

అమెరికా సుంకాల విధింపు ఎగుమతి ఆధారిత రంగాలకు దెబ్బేనని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ రేటింగ్ ఆఫీసర్ సచిన్ గుప్తా పేర్కొన్నారు. ఈ టారిఫ్‌లతో ఆయా సంస్థల వ్యయాలపై ప్రభావం పడనుందన్నారు. అనిశ్చితితో ప్రయివేటు రంగ మూలధన వ్యయాలు నిలిచిపోవచ్చన్నారు. రూపాయి విలువ తగ్గుదల ఎగుమతిదారులకు కొంత ఉపశమనాన్ని కలిగించొచ్చన్నారు.

## అవంటెల్‌కు జిఎస్ఎల్ ఆర్డర్

**హైదరాబాద్ :** గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జిఎస్ఎల్) నుంచి రూ.11.37 కోట్ల విలువ చేసే ఆర్డర్ దక్కిందని అవంటెల్ లిమిటెడ్ తెలిపింది. ఇది భారతదేశ సముద్ర రక్షణ పర్యావరణ వ్యవస్థ అంతటా కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుందని అవంటెల్ లిమిటెడ్ డైరెక్టర్ సిద్ధార్థ అబ్బూరి పేర్కొన్నారు. ఇది భారతదేశ సముద్ర అవసరాలకు అనుగుణంగా శాటిలైట్ కమ్యూనికేషన్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయడంలో తమ ప్రయత్నాలను నొక్కి చెబుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఫిబ్రవరి 2026, మార్చి 2027 మధ్య అమలు చేయబడుతుందన్నారు.

## టోన్‌బో ఇమేజింగ్‌కు రూ.175 కోట్ల నిధులు

**న్యూఢిల్లీ :** ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్‌లు, డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ ప్లాట్‌ఫాంలను అభివృద్ధి చేసేందుకు ప్రీ-ఐపిఒలో భాగంగా డి సిరీస్ కింద రూ.175 కోట్ల నిధులు సమీకరించినట్లు టోన్‌బో ఇమేజింగ్ తెలిపింది. ఈ వ్యూహాత్మక డిఫెన్స్ టెక్నాలజీ కంపెనీ ఫ్లోరిన్‌ట్రీ అడ్వైజర్స్, టెనేసిటీ వెంచర్స్, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నిధులను అందుకున్నట్లు పేర్కొంది. ఆధునిక యుద్ధ రీతుల్లోని ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొనగలిగే కొత్త తరం ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లను అభివృద్ధి చేసేందు కు ఈ నిధులను ఉపయోగించు కోనున్నట్లు తెలిపింది.

## శ్రీలంక పర్యటనకు మోడీ

**కొలంబో :** మూడు రోజుల పర్యటన కోసం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం శ్రీలంకకు చేరుకున్నారు. బ్యాంకాక్ పర్యటన ముగించుకొని నేరుగా కొలంబోకు మోడీ బయలుదేరారు. శ్రీలంక పర్యటనలో ఆ దేశంలో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ప్రధాని మోడీ దృష్టి సారించనున్నారు. శనివారం శ్రీలంక అధ్యక్షులు అనుర కుమార దిసనాయకేతో మోడీ భేటీ కానున్నారు. ఈ భేటీలో అనేక అంశాలు చర్చకు రానున్నాయి. ముఖ్యంగా ఇంధనం, వాణిజ్యం, కనెక్టివిటీ, డిజిటలైజేషన్, రక్షణ రంగాల సంబంధాలపై చర్చలు జరిపే అవకాశం ఉంది. ఈ పర్యటనకు ముందు బిమ్‌స్టెక్ సదస్సు కోసం థాయ్‌లాండ్‌లో పర్యటించిన ప్రధాని మోడీ అక్కడ వివిధ దేశాధినేతలతో భేటీ అయ్యారు. తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న శ్రీలంకలో ప్రధాని మోడీ పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మూడేళ్ల క్రితం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న శ్రీలంకకు 4.5 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని భారత్ అందించిన సంగతి తెలిసిందే.

## ఎన్నికల బాండ్ల నిధుల జప్తుపై సమీక్షకు సుప్రీం నో

**న్యూఢిల్లీ :** ఎన్నికల బాండ్ల పథకం ద్వారా అందుకున్న నిధులను జప్తు చేయడానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షించేందుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది. 2018లో బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు అందుకున్న రూ.16,518 కోట్ల నిధులను జప్తు చేయాలని కోరుతున్న పిటిషన్లపై నిర్ణయాన్ని సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. గతేడాది ఆగస్టు 2న సుప్రీం తీసుకున్న నిర్ణయంపై ఖేమ్ సింగ్ భాటి రివ్యూ పిటిషన్ వేశారు. దాన్ని ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో బెంచ్ తోసిపుచ్చింది. ఈ అంశంపై బహిరంగ కోర్టులో విచారించాలని భటి చేసిన విజ్ఞప్తిని కూడా కోర్టు తిరస్కరించింది. మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గతేడాది ఫిబ్రవరి 15న ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసింది. ఈ పథకం కింద అధికారిక ఆర్థిక లావాదేవీలు జరిపే ఎస్‌బిఐ, సుప్రీం తీర్పు నేపథ్యంలో తన వద్ద గల డేటాను ఎన్నికల కమిషన్‌తో పంచుకుంది. తర్వాత కమిషన్ దాన్ని బహిర్గతం చేసింది. కార్పొరేట్ కంపెనీల విరాళాల కోసం 2018 జనవరి 2న బిజెపి ప్రభుత్వం ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకువచ్చింది.

## అది.. విధానపరమైన నిర్ణయం : సుప్రీం

**న్యూఢిల్లీ :** 13 ఏళ్ల లోపు చిన్నారులను సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధించాలని కోరుతూ దాఖలైన ఒక పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఇది విధానపరమైన అంశమని పేర్కొంది. అయితే సంబంధించిన అధికారులకు ఈ అంశాన్ని నివేదించే స్వేచ్ఛను పిటిషనర్‌కు జస్టిస్ బి.ఆర్.గవై, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మంజూరు చేసింది. చిన్నారి మనస్సులపై సోషల్ మీడియా చూపే తీవ్రమైన శారీరక, మానసిక ప్రభావాలను ప్రస్తావిస్తూ జెఫ్ ఫౌండేషన్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. 13 ఏళ్ల లోపు చిన్నారులు సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధం విధించాలని, వినియోగదారుల వయస్సును నిర్ధారించడానికి సోషల్ మీడియా వేదికలు బయోమెట్రిక్ ప్రామాణీకరణ వంటి ధ్రువీకరణ వ్యవస్థలను అమలు చేయడం తప్పనిసరి చేయాలని కూడా పిటిషన్ కోరింది. పిటిషనర్ తరుపున న్యాయవాది మోహిని ప్రియ వాదనలు వినిపించారు. నిబంధనలను పాటించడంలో విఫలమైన సోషల్ మీడియా సంస్థలకు కఠినమైన జరిమానా విధించాలని కూడా న్యాయవాది కోరారు. చిన్నారులు సోషల్ మీడియాను ఉపయోగించడంపై నియంత్రణ అనేది కేవలం తల్లిదండ్రులకు సంబంధించిన అంశం కాదని తెలిపారు. అయితే ఇది విధానపరమైన విషయం అంటూ ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 'మీరు పార్లమెంట్‌ను చట్టం చేయమని అడుగుతున్నారా..?' అని వ్యాఖ్యానించింది.

## పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తపై వేధింపులకు ఆధారాలు ఉన్నాయి

- కొల్‌కతా హైకోర్టు

**కొల్‌కతా :** మేద్నిపూర్ పోలీస్టేషన్‌లో ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్త సుచరితా దాస్‌ను కస్టడీలో వేధింపులకు పాల్పడినట్లు ఆధారాలు ఉన్నాయని కొల్‌కతా హైకోర్టు తెలిపింది. సుచరితా దాస్‌ను 17 గంటల పాటు నిర్బంధించినా పోలీసులు కేవలం 13 గంటల సిసిటివి ఫుటేజ్‌ను మాత్రమే కోర్టుకు సమర్పించడంపై హైకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. నాలుగు గంటల ఫుటేజీ అదృశ్యం కావడంపై అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ వివరాలను సుచరితా దాస్ తరుపు న్యాయవాది షమీమ్ అహ్మద్ మీడియాకు వెల్లడించారు. మేద్నిపూర్ పోలీస్టేషన్‌లో మైనం ఉండటాన్ని కూడా జడ్జి ప్రశ్నించారని తెలిపారు. 'పోలీస్ స్టేషన్ సక్రమంగా లేదు. సరైన చర్యలు తీసుకోవాలని డిజికి తెలపండి. లేకపోతే నేను కఠినమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది' అని ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ కిషోర్ దత్‌ను జడ్జి హెచ్చరించినట్లు కూడా తెలిపారు.

మార్చి 1న కొల్‌కతాలోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో జరిగిన హింసను ఖండిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళనలు నిర్వహించింది. ఇందులో భాగంగా మార్చి 3న మేద్నిపూర్ కళాశాలకు చెందిన విద్యార్థులు కూడా తమ క్యాంపస్‌లో నిరసనల్లో పాల్గొన్నారు. వీరిని పోలీసులు బలవంతగా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు తమపై హింసకు పాల్పడ్డారని విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు అధికార పార్టీకి అండగా నిలిచారని, శారీరకంగా, మానసికంగా వేధించారని సుచరితా దాస్ తన పిటీషన్‌లో తెలిపారు.

# 'ఉపాధి' వేతనాల పెంపు అరకొరే

- తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన వేతనం రోజుకు రూ.7
- 8 రాష్ట్రాల్లో రూ.9 అంత కంటే తక్కువ పెంపు



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నూతన ఆర్థిక సంవత్సరం నుంచి వేతనదారులకు చెల్లించే వేతనాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం వివిధ రాష్ట్రాల్లో వేతనదారులకు రోజువారీ వేతనం పెంపు 2.33 నుంచి 7.46 శాతంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో గత ఆర్థిక సంవత్సరంలో రోజువారీ వేతనం రూ.300 ఉండగా, పెంచిన లెక్కల ప్రకారం తెలుగు రాష్ట్రాలకు రూ.7 కలిసి ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రూ.307గా నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం అత్యధికంగా రూ.26 చెల్లించగా, అత్యల్పంగా రూ.7 చెల్లించనున్నారు. ఉపాధి పథకంలో పనులు చేస్తున్న వేతనదారులకు కనీస వేతనాలు అందడం లేదనేది వాస్తవం. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు గతేడాది కంటే 15 నుంచి 30 శాతం వరకూ పెరిగినా ఈ పథకంలో వేతనదారులకు వేతనాలు కేవలం రూ.7 నుంచి రూ.26 పెరగడం విమర్శలకు తావిస్తోంది. జాతీయ స్థాయిలో పెరిగిన వేతనాలు పరిశీలిస్తే రోజుకు రూ.9, అంతకంటే తక్కువ పెరిగిన రాష్ట్రాలు 8 ఉన్నాయి. హర్యానాలో రూ.26, పంజాబ్‌లో రూ.24, కేరళలో రూ.23, గోవాలో రూ.22, కర్ణాటకలో రూ.21 చొప్పున పెంచారు. పెంచిన వేతనాల వల్ల వేతనదారులకు పావు లీటరు పాలు కూడా రావని, తినడానికి బన్ను కొనుగోలు చేయలేరని జాతీయ స్థాయిలోని పలు కార్మిక సంఘాలు సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేశాయి. రూరల్ కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ పేరుతో ప్రభుత్వం పెంచుతున్న ఈ అరకొర వేతనాల వల్ల వేతనదారులకు ఎటువంటి ఉపసమనం కలిగే పరిస్థితి కనిపించడం లేదని వీరి వాదన. గత పార్లమెంట్ సమావేశాల్లో స్థాయీ సంఘం.. ఉపాధి పథకంలో పనిచేస్తున్న వేతనదారులకు చెల్లిస్తున్న వేతనాలపై ఆందోళన వ్యక్తం చేసింది. 2018 అనూఫ్ సత్పతి కమిటీ నివేదికను 8 ఏళ్లయినా అమలు చేయకపోవడం, వేతనాలు సరైన రీతిలో పెంచకపోవడాన్ని తప్పుబట్టింది. వేతనదారులకు కనీస వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అయినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరంలో వేతనాల పెంపు ఏటా పెంచుతున్న విధంగానే ప్రభుత్వం అరకొరగానే పెంచి చేతులు దులుపుకుంది.

**గుదిబండగా బకాయిలు**

ఉపాధి చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులను పెంచకపోగా, బకాయిలు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.26 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.86 వేలకోట్లు కేటాయించారు. ఈ మొత్తంలో బకాయిలకే రూ.26 వేలకోట్లు చెల్లిస్తే, ఈ ఏడాది ఖర్చు చేస్తే మిగిలిన రూ.60 వేల కోట్లు నిధులు ఈ ఏడాది పథకం అమలుకు సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు. కేంద్రం అదనంగా నిధులు కేటాయిస్తే తప్ప వేతనదారులకు పని కల్పించే అవకాశం లేదు.

### కనీస వేతనాలు అమలు చేయాలి

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉపాధి పథకంలో పనులు చేసే వారికి కనీస వేతనాలు అమలు చేయాలి. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కనీస వేతనాలు చెల్లించాలని ఇటీవల చేసిన సిఫార్సులను పట్టించుకోలేదు. వినియోగదారుల ధర సూచి పేరుతో ప్రతియేటా అరకొరగా వేతనాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతుంది. ఉపాధి వేతనదారులకు రోజుకు రూ.600 చెల్లించాలి. ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు, వేతనదారులకు కల్పించే పని దినాలు పెంచాలి.

– ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు

## చైనా స్టార్టప్‌ల తరహాలో ఆలోచించాలి

- మంత్రి పియూష్ గోయల్



**న్యూఢిల్లీ :** భారత స్టార్టప్ సంస్థలు ఆలోచనలు మారాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. చైనా తరహాలో డీప్ టెక్ స్టార్టప్‌లపై దృష్టి పెట్టాలని సూచించారు. స్టార్టప్ మహాకుంబ్ కార్యక్రమంలో పియూష్ గోయల్ మాట్లాడుతూ.. దేశంలోని పలు స్టార్టప్ సంస్థలు ఫుడ్ డెలివరీ, బెట్టింగ్, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి యాప్‌లపై ఎక్కువగా ఆలోచన చేస్తోన్నాయన్నారు. ఇలాంటి వాటి వల్ల దిగువ శ్రేణి కార్మికులు తయారై సంపన్నులు కాలు బయటపెట్టకుండా ఆహారం పొందగలుతున్నారన్నారు. మరోవైపు చైనా చైనా సంస్థలు ఎఐ, ఇవిలు, సెమీ కండక్టర్ల రంగాలను ఎంచుకుంటున్నాయన్నారు. భారత్‌లో 1000 డీప్ టెక్ స్టార్టప్‌లు మాత్రమే ఉండటం ఆందోళనకరమన్నారు. ఇక్కడి యువతరం రూ.25 లక్షలు, రూ.50 లక్షలకు తమ గొప్ప ఆలోచనలను విదేశీ కంపెనీలకు అమ్మేసుకుంటున్నారన్నారు. మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై జెప్టో సిఇఒ అదిత్ పలిచా తీవ్రంగా స్పందించారు. విమర్శించడం తేలిక అంటూ వ్యాఖ్యానించారు. భారత స్టార్టప్‌లను తక్కువ చేయొద్దని, డీప్‌టెక్ సంస్థల వృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి సహాయం అందిస్తోందని తెలుపాలని ఇన్ఫోసిస్ మాజీ సిఎఫ్ఒ మోహన్‌దాస్ పాయ్ ప్రశ్నించారు.

## రెండో రోజూ యుఎస్ మార్కెట్లు కుదేలు

- ప్రారంభంలోనే 3 శాతం పతనం



**వాషింగ్టన్ :** ట్రంప్ వాణిజ్య నిర్ణయాలు అమెరికా మార్కెట్లకు ప్రతికూలంగా మారాయి. వరుసగా రెండో రోజూ అక్కడి స్టాక్స్ కుప్పకూలాయి. శుక్రవారం ప్రారంభంలోనే అమ్మకాల వెల్లువ చోటు చేసుకుంది. డోజోన్స్ 1,061 పాయింట్లు లేదా 2.62 శాతం నష్టంతో 39,484.65 పతనాన్ని చవి చూడగా.. ఎస్అండ్‌పి 500 సూచీ 163.84 పాయింట్లు లేదా 3.04 శాతం క్షీణతతో 5,232.75 వద్ద నమోదయ్యింది. అదే బాటలో నాస్‌డాక్ 563.20 పాయింట్లు లేదా 3.40 శాతం నష్టంతో 15,987.41 ట్రేడింగ్ అయ్యింది. అమెరికా ఉత్పత్తులపై చైనా 34 శాతం దిగుమతి సుంకాలను వర్తింపజేయనున్నట్లు చేసిన ప్రకటన యుఎస్ మార్కెట్లను తీవ్ర కలవరానికి గురి చేశాయి.ఇంతక్రితం గురువారం సెషన్‌లోనూ అక్కడి మార్కెట్లు 5 శాతం పైగా పతనమై భారీ నష్టాన్ని చవి చూశాయి. ఈ ఒక్క రోజులోనే ప్రపంచవ్యాప్తంగా 500 మంది కుబేరుల మొత్తం సంపద 208 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.17 లక్షల కోట్లు) కరిగిపోయింది. ఈ స్థాయిలో నష్టం జరగడం గత దశాబ్ద కాలంలో ఇదే తొలిసారి. మెటా జూకర్‌బర్గ్ సంపద 17.9 బిలియన్‌డ ఆలర్లు, అమెజాన్ జెఫ్ బెజోస్ సంపద 15.9 బిలియన్లు, టెస్లా అధినేత ఎలన్ మస్క్ సంపద 11 బిలియన్ డాలర్లు, డెల్ సిఇఒ మైఖెల్ డెల్ సంపద 9.53 బిలియన్ డాలర్ల చొప్పున హరించుకుపోయింది.




ఎక్సైజ్ డిఎస్‌పి ముందు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న మహిళలు

# మద్యం షాపును తొలగించాలి

- మహిళల ఆందోళన
- ఎక్సైజ్ డిఎస్‌పిపై ఆగ్రహం

**ప్రజాశక్తి- అంబాజీపేట (డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామం వెంకటేశ్వర కాలనీ కుసుమేవారిపేట చినకుసుమేవారి పేటలకు ఆనుకుని ఉన్న మద్యం షాపును తక్షణమే తొలగించాలని శుక్రవారం ఎక్సైజ్ డిఎస్‌పి ముందు సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు హాజరై మద్దతు తెలిపారు. గురువారం అమలాపురం ఎక్సైజ్ సూపరెంట్ కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలపడం విదితమే. ఈ నేపథ్యంలో విచారణకు వచ్చిన ఎక్సైజ్ డిఎస్‌పి గ్రామానికి 150 మీటర్ల దూరంలో మద్యం షాపు ఉంటే మీకేంటి అభ్యంతరం అని మహిళలను ప్రశ్నించారు. దీంతో, వారంతా డిఎస్‌పికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తక్షణం మహిళలు రక్షణలేనివిధంగా ఏర్పాటు చేసిన మద్యం షాపుని తక్షణమే ఇక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ అనుమతులు తీసుకోకుండా అంబాజీపేట నుంచి ఇక్కడికి షాపును మార్యారని తెలిపార. ఒకపక్క స్కూలు, మరోపక్క అంబేద్కర్ విగ్రహం, ఇరువైపులా గ్రామాలు ఉన్న ప్రజలకు మహిళలకు ఇబ్బందికరంగా ఉన్న స్థలంలో అక్రమంగా మద్యం షాపును ఏర్పాటు చేయడం హాస్యాస్పదమన్నారు. తక్షణం మహిళలకు రక్షణ లేనటువంటి మద్యం షాపుని ఇక్కడ నుంచి తొలగించకోతే మద్యం షాపు ఎదురుగా ప్రత్యక్ష ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మద్యం షాపును తొలగించే విధంగా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఎక్సైజ్ డిఎస్‌పికి ముందు ఆందోళన చేపడుతున్నటువంటి మహిళలను అక్కడకు వచ్చినటువంటి ఒక మందుబాబు అసభ్యకరంగా ఫొటోలు చిత్రీకరించి అసభ్యకర పదజాలంతో దూషించాడు. దీంతో, ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాచవరం వెంకటేశ్వర కాలనీ కుసుమే వారి పేట,చినకుసుమేవారి పేట గ్రామాలకు చెందిన కుసుమ నాగమణి, అయితా బత్తుల శాంతికుమారి, జ్యోతి, పేయ్యిల మారతమ్మ, మెడిద బాల విజయ కుమారి, అయితాబత్తుల నవీన్, సరేళ్ల సత్య నారాయణ, అయితా బత్తుల శ్రీను, మేడిద శ్రీను, సరేళ్ళ వీర్రాజు, గోగి రాజేష్, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్..టెన్షన్

- వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ వేగవంతం
- రెవెన్యూ డివిజన్ పరిధిలో పింఛన్‌దారులంతా ఒకచోటుకు
- ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద కిటకిట
- రెండు జిల్లాల్లో దాదాపు 60 వేల మంది లబ్ధిదారులు



**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

వికలాంగుల పింఛన్‌దారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పింఛన్ ఉంటుందా.. కారణాలు బూచిగా చూపి తొలగిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ప్రభుత్వం వికలాంగుల పింఛన్లకు సంబంధించి వెరిఫికేషన్ వేగవంతంగా సాగిస్తోంది. ఏలూరు జిల్లాలో మొత్తం 2,60,195 సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతుండగా ఇందులో దాదాపు 33 వేల వరకూ వికలాంగుల పింఛన్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 2,25,718 పింఛన్లు ఉండగా వికలాంగుల పింఛన్లు 27 వేలు వరకూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వికలాంగుల పింఛన్లలో అనర్హులు ఉన్నారంటూ వెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. ముందుగా మంచానికే పరిమితమైన రూ.15 వేలు పింఛన్ అందుకుంటున్న వారిని వెరిఫికేషన్ చేసింది. ఆ ప్రక్రియ పూర్తయ్యింది. వెరిఫికేషన్ జాబితాను మాత్రం బహిరంగపర్చలేదు. ఇప్పుడు నెలకు రూ.ఆరువేలు పింఛన్ అందుకుంటున్న వికలాంగుల పింఛన్లను వెరిఫికేషన్ చేస్తోంది. బుధ, గురు, శుక్రవారాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ సాగింది. ఇంకా చేయాల్సి ఉంది. రెవెన్యూ డివిజన్ పరిధిలోని వికలాంగులను ఒకచోటుకు రప్పించి ఈ వెరిఫికేషన్ ప్రక్రియ సాగిస్తున్నారు. ఏలూరు డివిజన్ పరిధిలో పింఛన్ అందుకుంటున్న వికలాంగులందరినీ ఏలూరు సర్వజన ఆసుపత్రికి రప్పిస్తున్నారు. ఎముకలకు సంబంధించిన వికలాంగులకు భీమడోలు, కైకలూరులోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ చేస్తున్నారు. చెవి, మానసిక, ఇతర సమస్యలు ఉన్న వికలాంగులంతా ఏలూరు సర్వజన ఆసుపత్రికి రావాల్సిందే. ఒకపక్క వేసవి ఎండలు, మరోపక్క దూర ప్రయాణంతో వికలాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. డిఆర్‌డిఎ సిబ్బంది ఆసుపత్రి వద్ద టెంట్లు వేసుకుని ఈ ప్రక్రియను సాగిస్తున్నారు. వెరిఫికేషన్‌కు వచ్చిన వికలాంగులంతా గంటల తరబడి వేచి ఉండలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు వంటి వసతులు సైతం సరిగా ఏర్పాటు చేయలేదు. వికలాంగుల పింఛన్ వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా సాగుతుందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి.

**పింఛన్ల లబ్ధిదారులను తగ్గించే ఎత్తుగడ అంటూ విమర్శలు**

కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రూ.మూడు వేలు పింఛన్ రూ.నాలుగు వేలు చేస్తామని, వికలాంగులకు రూ.మూడు వేల నుంచి రూ.ఆరు వేలు ఇస్తామని ప్రకటించింది. గెలిచిన తర్వాత అనుకున్నట్లు పింఛన్ పంపిణీ ప్రారంభించింది. అయితే పింఛన్ల భారం పెరగడంతో తగ్గించుకునే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ముందుగా వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ప్రారంభించిందనే చర్చ సాగుతోంది. గతంలో ఇదే అధికారులు ఉన్నారు. అప్పుడు పింఛన్ మంజూరు చేసిన డిఆర్‌డిఎ అధికారులే ఇప్పుడు మళ్లీ వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొంటున్నారు. అనర్హులు ఉంటే తొలగించడం తప్పుకాదు. అందుకోసం పింఛన్ అందుకుంటున్న వికలాంగులందరినీ ఇబ్బంది పెట్టడం ఏవిధంగా సమంజసమో అర్థం కావడం లేదు. పింఛన్లు తగ్గించుకునేందుకు అంగవైకల్యం శాతం తక్కువగా చూపించి తొలగిస్తారేమోననే భయం వికలాంగులను వెంటాడుతోంది. అనర్హుల వ్యవహారం సాకుగా చూపి కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కొత్త పింఛన్లను మంజూరు చేయకుండా నిలిపివేసింది. దీంతో ఎంతోమంది పింఛన్ల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

## నేపాల్‌లో స్వల్ప భూకంపం.. ఉత్తర భారత్‌లోనూ ప్రకంపనలు

**ఖాట్మండూ :** నేపాల్‌లో స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.0 తీవ్రతగా నమోదైంది. గర్ఖాకోట్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో, 20కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం 7.52 గంటల సమయంలో ఇది రికార్డయినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఇటు ఉత్తర భారత్‌నూ ఇవి తాకినట్లు తెలిసింది. ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో పలు చోట్ల భూప్రకంపనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

## 'ఆయుష్మాన్ భారత్'లో అవకతవకలు..

**ఇడి దాడులు**

**న్యూఢిల్లీ :** కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకంలో భారీ కుంభకోణం జరిగిందని కాగ్ రిపోర్టు వెల్లడించింది. దీంతో ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) శుక్రవారం జార్ఖండ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఏకకాలంలో 21 ప్రదేశాల్లో దాడులు నిర్వహించింది. జార్ఖండ్‌లో అమలైన ఆయుష్మాన్ పథకంలో పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు జరిగాయని 2023లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన కాగ్ రిపోర్టు వెల్లడించింది. లేని వ్యక్తులు (మరణించిన వ్యక్తులు) ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు చూపించి.. బీమా మొత్తాన్ని మోసపూరితంగా క్లయిమ్ చేస్తున్నట్లు కాగ్ నివేదిక వెల్లడించింది. దేశంలోని 212 ఆసుపత్రుల్లో అమలవుతున్న ఈ పథకంలో భారీగా ఆర్థిక అవకతవకలు జరిగాయని ఈ నివేదిక పేర్కొంది. కాగ్ నివేదిక తర్వాత ఆర్థిక మోసాలకు పాల్పడిన వారికి సంబంధించిన సమాచారాన్ని జార్ఖండ్ ఆరోగ్యశాఖ నుంచి ఇడి సమాచారం కోరింది. ప్రత్యేకించి కొన్ని ఆసుపత్రులపై నమోదైన ఎఫ్ఆర్‌ల ఆధారంగా ఇడి ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. ఇడి సోదాల్లో భాగంగా నేడు జార్ఖండ్ మాజీ ఆరోగ్యశాఖ మంత్రి బన్నా గుప్తా వ్యక్తిగత కార్యదర్శి ఓం ప్రకాష్, థర్డ్ పార్టీ అసెస్‌మెంట్ (టిపిఎ), ఎండి ఇండియా, సేఫ్‌వే, మెడి అసిస్ట్ వంటి ఏజెన్సీలకు చెందిన వారి ఇళ్లలో ఇడి సోదాలు నిర్వహించింది.

# సీనియారిటీ.. ఏదీ క్లారిటీ!

- అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 10 వరకూ గడువు
- గతంలో రెండు పర్యాయాలు ఇదే తంతు
- అయినా మళ్లీ తప్పుల తడకే అంటున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి)లను స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించడం కోసం జిల్లా విద్యాశాఖ చేపడుతున్న సీని యారిటీ జాబితాల తయారీ తప్పుల తడకగానూ, ప్రహసనం గానూ మారుతోంది. తాజాగా ఈ నెల 4 నుంచి 10 వరకూ అభ్యంతరాలపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు నుంచి వెలువడ్డ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయం, మండల విద్యాశాఖ అప్రమత్తమయ్యాయి. ఈ క్రమంలో విద్యాశాఖ పరిధిలోగల అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి సరైన సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. మండల విద్యాశాఖలు జాబితాల తయారీలో ఇప్పటికే నిమగ్నమయ్యాయి. అయితే గత రెండు దఫాలుగా స్వీకరించిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకపోవడం, డిఇఒ కార్యాలయంలో సరైన జాబితాల్లేకపోవడంతో మళ్లీ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశముందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

**సబ్జెక్టుల వారీగా జాబితా తయారీ**

ఎస్‌జిటి టీచర్ల సీనియారిటీ జాబితాలను వాస్తవానికి ఇప్పటివరకూ జరిగిన డిఎస్‌సిల వారీగా జిల్లా విద్యా శాఖ కార్యాలయాలు తమ వద్ద ఉంచుకోవాల్సి ఉన్నా సరైన పద్ధతిలో ఆ ప్రక్రియ సాగలేదు. సబ్జెక్టుల వారీగా సీనియారిటీ జాబితాపై ఏ టీచరుకైనా అభ్యంతరాలు ఉంటే చినగదిలి మండలంలోగల విశాఖ వ్యాలీ స్కూల్ వద్దగల డిఇఒ కార్యాలయంలో తెలుపవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రకటించారు. గతంలో రెండు సార్లు సీనియారిటీ లిస్టులను ఇచ్చినప్పటికీ అవేవీ ప్రతిబింబించలేదని, తప్పులు యధావిధిగా దొర్లాయని నేటికీ విమర్శలు వినిపిస్తున్నాయి. డిఇఒ కార్యాలయంలో ఒరిజినల్ జాబితాలు లేనందున ఈ సమస్య తలెత్తుతోంది.

**ఏం జరగాలి ? ఏం జరుగుతోంది ?**

డిఎస్‌సిల వారీగా జాబితాలు, టీచర్లుగా ఎంపికైన వారి పేర్లు, మార్కులు, రోస్టరు, ర్యాంకులు ఇలా అన్ని వివరాలతో కూడిన ఫైలు డిఇఒ కార్యాలయంలో కచ్చితంగా ఉండాలి. ఉదాహరణకు 1998లో 1000 మంది టీచర్లు జిల్లాలో సెలక్టు అయితే వారి జాబితా పై అన్నిటితో కలిపి ఉండాలి. కానీ 2001 సంవత్సరం తర్వాత ఈ సీనియారిటీ లిస్టుల్లో తీవ్ర గందరగోళం ఉన్నట్లు తెలుస్తోంది. అభ్యంతరాలను స్వీకరించినా డిఎస్‌సిల వారీగా టీచర్ల జాబితాలేకుంటే సమస్య మళ్లీ మొదటికే వస్తుందని పలువురు టీచర్లు చెబుతున్నారు.

**మొదటి సంతకం పెట్టాక ఏడాది కావస్తున్నా...**

రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం తొలి సంతకం డిఎస్‌సిపై పెట్టింది. సుమారు ఏడాది సమీపిస్తున్నా డిఎస్‌సిపై పూటకో మాట చెబుతోంది. 2018 తర్వాత రాష్ట్రంలో డిఎస్‌సి తీయలేదు. పైగా ఇలా సీనియారిటీ జాబితాల తయారీ పేరుతో కాలయాపనే జరుగుతోంది. టీచర్ల సంఖ్యను ఎలా తగ్గించాలన్న గత జగన్ ప్రభుత్వ వ్యూహాన్నే ఈ ప్రభుత్వమూ అనుసరిస్తోందని యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్ వెల్లడించారు. ఒకవైపు ఏడేళ్లుగా డిఎస్‌సి జాప్యం జరుగుతుంటే.. మరోవైపు ఎస్‌జిటి టీచర్ల సీనియారిటీ జాబితాల తయారీ నేటికీ సరిగా జరగకపోవడం దేనికి సూచికమని ఆయన ప్రశ్నిస్తున్నారు.



దెబ్బతిన్న బీర పంటను చూపుతున్న రైతులు

## పంటపై వర్షం దెబ్బ

- పుట్లూరులో నేలకూలిన అరటి చెట్లు
- పలు మండలాల్లో పంట నష్టం

**ప్రజాశక్తి- పుట్లూరు, శింగనమల (అనంతపురం జిల్లా) కళ్యాణదుర్గం రూరల్, బొమ్మనహాల్**

అనంతపురం జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కురిసిన వర్షాలు పలు పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి. 20 రోజుల క్రితం కురిసిన వర్షానికి పుట్లూరు, యల్లనూరు, తాడిమర్రి తదితర మండలాల్లో అరటి చెట్లు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. తాజాగా గురువారం నాటి వర్షం అరటిపై మళ్లీ దెబ్బకొట్టింది. పుట్లూరు మండలం నాయకులపల్లి, మడ్డిపల్లి కడవకల్లు, గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులకు అరటి చెట్లు నేల కొరిగాయి. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి అరటి సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయంలో అవి నేలకూలడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకునిపల్లి గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఐదెకరాల్లో అరటి పంట సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయంలో ఈదురుగాలకు నేలమట్టం అయ్యిందన్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు.

**బీర నేలపాలు**

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండలంలోని గుద్దెళ్ల గ్రామంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి రూ.10 లక్షల విలువజేసే బీర పంట నేలపాలైనట్లు బాధిత రైతులు తెలిపారు. లీలావతి, గుద్దెళ్ల హారిలకు చెందిన పదెకరాల్లో సాగు చేసిన బీర పంట మొత్తం ఈదరు గాలులు, వర్షంతో దెబ్బతింది. రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు.

**తడిసిన మిరప**

బొమ్మనహాల్ : మండలం దర్గావన్నూరు, గోవిందవాడ గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి గాలి వానకు అరబెట్టిన ఎండుమిర్చి తడిసిపోయింది. ఉంతకల్లు గ్రామంలో మామిడి, ఎల్‌బి.నగర్‌లో సపోటా, దానిమ్మ, దేవగరి, బొమ్మనహాల్‌లో అరటి, రామదాసప్పతోటలో మునగ పంటలు అకాల వర్షంతో దెబ్బతిన్నాయి. మండలంలో వరి 150 ఎకరాలు, దానిమ్మ 300 ఎకరాలు, అరటి 25 ఎకరాల్లో నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఎండిమిర్చి, మామిడి ఇతర ఉద్యా పంటలూ దెబ్బతిన్నాయి.

## జనగణనతో పాటే కుల గణన

- సిపిఎం మహాసభ డిమాండ్

**సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి**

2021లో జరగాల్సిన జనగణన ఇప్పటివరకు నిర్వహించకపోవడం పట్ల సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సాధ్యమైనంత త్వరగా జనగణనతో పాటే కుల గణనను కూడా నిర్వహించాలని డిమాండ్ చేసింది. మూడు రోజులుగా ఇక్కడ జరుగుతున్న పార్టీ మహాసభ ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. జిల్లా, తాలూకా, బ్లాక్ లేదా గ్రామ స్థాయిల వంటి పాలనా సరిహద్దుల ఆధారంగా జనగణనను నిర్వహించడానికి జూన్ 2024 వరకూ గడువు ఉందని, దీనిని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు పొడిగించలేదని ఆ తీర్మానం పేర్కొంది. 2021లో జరగాల్సిన జనగణనను కోవిడ్ కారణంగా వాయిదా వేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఆ తరువాత ఇప్పటి వరకు దానిని నిర్వహించే సూచనలు కనిపించడం లేదని తెలిపింది. వెనుకబడిన తరగతుల గణాంకాలను సేకరిస్తే విద్య, అభివద్ధి మధ్య ఉన్న సంబంధాలను అర్థం చేసుకోవచ్చని, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూపొందించిన పాలకుల విధానాల ప్రభావాన్ని అంచనా వేయవచ్చని తెలిపింది. వీటిని దృష్టిలో ఉంచుకుని కుల ఆధారిత జనగణన కోసం ఉన్న డిమాండ్‌ను సమర్థిస్తున్నట్లు సిపిఎం పేర్కొంది. సమాజంలోని పీడిత వర్గాలకు న్యాయం జరగాలంటే, 2021 నుంచి వాయిదా పడుతున్న జనగణనతో పాటే కులగణన కూడా నిర్వహించాలని మహాసభ డిమాండ్ చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు అవదేశ్‌కుమార్ ప్రతిపాదించగా, టి.జ్యోతి బలపర్చారు.

## రోమన్ చక్రవర్తిలా ట్రంప్

- నోబెల్ శాంతి గ్రహీత ఆస్కార్ విమర్శ
- వీసా రద్దు చేసిన అమెరికా

**శాన్‌జోస్ :** నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించిన రోమన్ చక్రవర్తి తరహాలో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్నారని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, కోస్టారికా మాజీ అధ్యక్షులు ఆస్కార్ అరియాస్ (84) విమర్శలు గుప్పించారు. ఈ విమర్శలపై ట్రంప్ సర్కార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన వీసాను రద్దు చేసింది. ఈ విషయాన్ని అరియాస్ తెలిపారు. కోస్టారికా రాజధాని శాన్ జోస్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ వీసా రద్దుకు కారణమేమిటో తనకు స్పష్టంగా తెలియదని పేర్కొన్నారు. వీసా రద్దు చేస్తున్నట్లు అమెరికా అధికారులు మెయిల్ పంపారని, ఈ విషయమై ఎలాంటి వివరణా ఇవ్వలేదని తెలిపారు. అయితే ట్రంప్ తీరును రోమన్ చక్రవర్తితో పోలుస్తూ బహిరంగ విమర్శలు చేసినందునే వీసా రద్దుకు దారితీసివుండవచ్చునని ఆయన తెలిపారు. తాను కోస్టారికా అధ్యక్షునిగా ఉండగా చైనాతో దౌత్య బంధాన్ని పునరుద్ధరించానని అది కూడా వీసా రద్దుకు కారణమైవుండొచ్చునని ఆయన పేర్కొన్నారు. సెంట్రల్ అమెరికాలో ఘర్షణల నివారణకు చేసిన కషికిగాను అరియాస్‌కు 1987లో నోబెల్ శాంతి పురస్కారం లభించింది. ఆయన 1986–1990, 2006–2010 మధ్య ఎనిమిదేళ్లు కోస్టారికా అధ్యక్షులుగా సేవలందించారు.

## పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు తెర

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తెలిపారని విమర్శించారు. వివిధ శాఖలకు సంబంధించిన గ్రాంట్లు, ఆర్థిక బిల్లుకు కూడా లోక్‌సభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బడ్జెట్ ప్రక్రియ ముగినట్లు సభాపతి ప్రకటించారు. మరోవైపు రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్ రాష్ట్రానికి సంబంధించిన బడ్జెట్ కూడా క్లియర్ అయినట్లు తెలిపారు.

**రాజ్యసభలో 119 శాతం ఉత్పాదకత**

లోక్‌సభ వాయిదా పడిన కొద్దిసేపటికే రాజ్యసభను కూడా నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రకటించారు. వక్స్ (సవరణ) బిల్లుతోపాటు పలు కీలక అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. సభ ఉత్పాదకత 119 శాతంగా ఉన్నట్లు పేర్కొన్నారు. 49 ప్రైవేట్ మెంబర్స్ బిల్లులను ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 3న (గురువారం) ఉదయం 11 గంటల నుంచి వేకువజామున 4.02 వరకు సభను నిర్వహించామని, రాజ్యసభ చరిత్రలోనే ఇంత సుదీర్ఘ సమయం సభనడవడం ఇదే తొలిసారి అని ఆయన అన్నారు.


కోల్‌కతాలో ఆందోళన చేస్తున్న ముస్లిం సంఘాల జెఎసి నాయకులు


తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టివికె పార్టీ కార్యకర్తల ఆందోళన

# వక్ఫ్ సవరణలపై ఆగ్రహజ్వాల

- దేశవ్యాప్తంగా ఆందోళనలు
- కొల్‌కతా, చెన్నయ్, అహ్మదాబాద్‌లో భారీ ర్యాలీలు
- తెలుగు రాష్ట్రాల్లోనూ నిరసన ప్రదర్శనలు


పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్షాల ఎంపిలు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. నిరసనలు హోరెత్తాయి. పార్లమెంటు వెలుపల కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాల సభ్యులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. మత స్వేచ్ఛ హక్కును హరించి, ప్రజల మధ్య విభజన తీసుకొచ్చేందుకే ఈ బిల్లును బలవంతంగా ఆమోదించుకుందని ప్రతిపక్షాల సభ్యులు విమర్శించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, కేరళ, ఇటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఆందోళనలు మిన్నంటాయి. ఈ ఆందోళనల్లో ముస్లిం మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం ఎక్కడికక్కడ నిరసనల ప్రదర్శనలు చేపట్టారు. బిజెపి ప్రభుత్వ ఏకపక్ష వైఖరిని నిరసించారు. పశ్చిమ బెంగాల్‌లోని కొల్‌కతా, తమిళనాడులోని చెన్నై, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో భారీ ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళలన్నీ జాయింట్ ఫారమ్ ఆఫ్ వక్ఫ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలోని చేపట్టారు.

**అహ్మదాబాద్‌లో తీవ్రరూపం**

వక్ఫ్ సవరణల బిల్లుపై గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చేపట్టిన ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. రోడ్లపై కూర్చొని పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అయితే పోలీసులు వారిని బలవంతంగా తొలగించే ప్రయత్నం చేసే క్రమంలో మరింత ఉద్రిక్తత నెలకొంది. శాంతియుతంగా నిరసన చేపడుతున్న ముస్లింలపై పోలీసులు విరుచుకుపడ్డారు. రోడ్డుపై కూర్చున్న ముస్లింలను పోలీసులు అక్కడి నుండి బలవంతంగా తరుముతున్న దృశ్యాలు మీడియాలో వైరల్‌గా మారాయి.

**తమిళనాడులో విజయ్ పార్టీ ఆందోళనలు**

చెన్నైలో నిరసనలు భారీగా జరిగాయి. ప్రముఖ నటుడు విజయ్ ఇటీవల స్థాపించిన 'తమిళగ వెట్రి కజగం (టివికె)' పార్టీ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. చెన్నయ్, కోయంబత్తూర్, తిరుచిరాపల్లి తదితర నగరాల్లో టివికె కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వక్ఫ్ సవరణలను వ్యతిరేకించారు. 'వక్ఫ్ బిల్లుని వ్యతిరేకించండి', 'ముస్లింల హక్కులను కాపాడండి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య వ్యతిరేకమని విజయ్ ఇదివరకే పేర్కొన్నారు. ఈ బిల్లును ఆమోదించడం దేశ లౌకిక పునాదిపై దాడిగా అభివర్ణించారు.

పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో వేలాది ముస్లింలు జాతీయ జెండాను చేబూని రోడ్డెక్కారు. 'వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం', అనే ప్లకార్డులను ప్రదర్శించారు. 'జాయింట్ ఫోరమ్ ఫర్ వక్ఫ్‌ప్రొటెక్షన్' ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. తెలంగాణలోని హైదరాబాద్‌లోని పాతబస్తీతో సహ పలుచోట్ల ముస్లింలు శుక్రవారం నమాజ్ అనంతరం వక్ఫ్‌సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసనలు చేశారు.

## చమురు ఉత్పత్తిని పెంచుతున్న ఒపెక్ ప్లస్ దేశాలు

**వియన్నా :** అంచనాలకు మించి చమురు ఉత్పత్తిని పెంచనున్నట్లు పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య (ఒపెక్), దాని మిత్ర దేశాలు ప్రకటించాయి. మే మాసంలో రోజుకు 4,11,000 బారెళ్ళ చమురు ఉత్పత్తిని పెంచుతున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఒపెక్ వెబ్‌సైట్‌లో ప్రకటన వెలువడింది. సౌదీ అరేబియా, రష్యా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, కజకస్తాన్, అల్జీరియా, ఒమన్‌లతో సహా సభ్య దేశాలు ఆన్‌లైన్‌లో సమావేశమై అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను సమీక్షించాయని, భవిష్యత్ అవకాశాలను అంచనా వేశాయని ఆ ప్రకటన పేర్కొంది. తొలుత రోజుకు 1,35,000 బారెళ్ళ మేరకు పెంచాలని ఒపెక్ ప్లస్ దేశాలు భావించాయి. ఇటీవలి ఉత్పత్తిలో కోతలను క్రమేపీ తగ్గించడంలో భాగంగా ఉత్పత్తిని ఈ మేరకు పెంచాలని భావించారు. కానీ గ్రూపు తర్వాత తన వ్యూహం మార్చుకుంది. ఆరోగ్యకరమైన మార్కెట్ పరిస్థితులను, సానుకూల మార్కెట్ ధోరణిని ఇందుకు కారణాలుగా పేర్కొంది. తలెత్తే పరిస్థితులకు అనుగుణంగా ఈ పెంపును తగ్గించడమో లేదా కాస్తంత విరామం ఇవ్వడమో జరుగుతుందని కూడా ఆ ప్రకటన తెలిపింది.



## ముంబయిలో పోషకాహారలేమితో చిన్నారులు

**ముంబయి :** మహారాష్ట్రలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏలుబడిలో చిన్నారలకు సరైన ఆహారం కూడా అందడం లేదు. ఆర్థిక రాజధానిగా పేరొందిన ముంబయి మహానగరం శివారుల్లో 16,343 మంది చిన్నారులు పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన ఒక ప్రాథమిక సర్వేలో ఈ విషయం వెల్లడయింది. పోషణ్ ట్రాకర్ యాప్ ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో 2,38,094 మంది చిన్నారులు నమోదయ్యారు. వీరిలో 2,34,896 మంది బరువు, ఎత్తు కొలతలు తీసుకున్నారు. వీరిలో 2,887 మంది చిన్నారులు తీవ్రమైన పోషకాహార లోపంతోనూ, 13,457 మంది మధ్యస్త పోషకాహారలోపంతో బాధపడుతున్నట్లు తెలిపారు.

## అమెరికా వాహనాలపై 25 శాతం సుంకాలు విధించిన కెనడా

**ఒట్టావా :** అమెరికాపై తాము కూడా 25 శాతం పరస్పర సుంకాలు విధిస్తున్నామని కెనడా ప్రధాని మార్క్ కార్నే ప్రకటించారు. కెనడా–అమెరికా–మెక్సికో ఒప్పందం (సియుఎస్ఎంఎ) పరిధిలోకి రాని, అమెరికా నుండి దిగుమతయ్యే అన్ని వాహనాలపై ఈ సుంకాలు వుంటాయని తెలిపారు. దీనివల్ల మెక్సికో ప్రభావితం కాదన్నారు. నిన్నటి కాన్న ఈనాటి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ప్రాథమికంగా భిన్నంగా వుందని కార్నే వ్యాఖ్యానించారు. బుధవారం ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడిందన్నారు. అమెరికాతో తమ పాత బంధం ఇక ముగిసిందని ఆయన వ్యాఖ్యానించారు. 80ఏళ్ళుగా అమెరికా అనుసరిస్తూ వచ్చిన అంతర్జాతీయ ఆర్థిక నాయకత్వానికి ఇక కాలం చెల్లిందన్నారు. ఈ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్య చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని పేర్కొంటూ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో పిటిషన్ వేసినట్లు కార్నే చెప్పారు.

## దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్‌పై వేటు

- పదవి నుంచి తొలగిస్తూ రాజ్యాంగ ధర్మాసనం తీర్పు

**సియోల్:** అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను ఆ పదవి నుంచి తొలగిస్తూ ఆ దేశ రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. గత ఏడాది డిసెంబర్‌లో మార్షియల్ చట్టాన్ని ప్రయోగించినందుకు యూన్ సుక్ యోల్‌కు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఆయనపై పార్లమెంట్‌లో అభిశంసన జరిగింది. అభిశంసనలో ఓడిన యూన్‌ను ఆఫీసు నుంచి తప్పిస్తూ రాజ్యాంగ కోర్టు శుక్రవారం ఆదేశాలు ఇచ్చింది. రాజ్యాంగ కోర్టు తాత్కాలిక చీఫ్ మూన్ యుంగ్ బే ఇచ్చిన ఆదేశాలను జాతీయ టివిలో ప్రసారం చేశారు. దీంతో ప్రజలు సంబరాల్లో తేలారు. యూన్‌పై అభిశంసనను 8 మంది సభ్యులున్న రాజ్యాంగ కోర్టు బెంచ్ సమర్థించింది. యూన్ సుక్ యోల్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించి మార్షియల్ చట్టాన్ని విధించినట్లు మూన్ తెలిపారు. అభిశంసనకు గురైన వెంటనే యూన్ సుక్ యోల్‌ను జైలుకు తరలించారు. గత నెలలో జైలు నుంచి విడుదలయ్యారు. సియోల్‌లోని ఒక కోర్టు యూన్ అరెస్టును రద్దు చేసిన నేపథ్యంలో ఆయనకు నిర్బంధం నుంచి విముక్తి లభించింది. గత డిసెంబరులో సైనిక పాలన విధిస్తూ యూన్ వెలువరించిన ఆదేశాలు దక్షిణ కొరియాలో పెను సంక్షోభాన్ని సృష్టించిన సంగతి తెలిసిందే.

## 'ఎంపురన్' నిర్మాత గోపాలన్‌పై ఇడి గురి

**చెన్నయ్ :** గుజరాత్‌లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సంఘ్ పరివార్ గూండాలు సాగించిన నరమేధాన్ని కళ్లకట్టేలా తెరకెక్కించిన మలయాళ 'ఎంపురన్' (లూసీఫర్ 2) చిత్ర నిర్మాతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఎంపురన్ నిర్మాతల్లో ఒకరైన గోకులం గోపాలన్ నివాసం, కార్యాలయంలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలు నిర్వహించింది. చెన్నైలోని నీలాంగరై ప్రాంతంలో ఉన్న నివాసం, కొడంబక్కం ప్రాంతంలోని ఆయనకు చెందిన చిట్ ఫండ్ కార్యాలయంలో సోదాలు జరిగాయి. మరోవైపు, కొజికోడ్‌లోని గోపాలన్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన్ను ఇడి విచారించింది. కొచ్చిలోని ఇడి యూనిట్ నుంచి వచ్చిన అధికారులు ఈ విచారణలో పాల్గొన్నారు. గోపాలన్, ఆయనకు చెందిన శ్రీ గోపాలన్ చిట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌పై విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఎఫ్ఇఎంఎ) నిబంధనల కింద ఇడి అధికారులు కేసు నమోదు చేశారు.

## రష్యాలో కొత్త వైరస్ భయాలను కొట్టిపారేసిన డబ్ల్యుహెచ్‌ఓ

**మాస్కో :** రష్యాలో కొత్త వైరస్ గురించి వస్తున్న వదంతులను డబ్ల్యుహెచ్‌ఓ రష్యా కార్యాలయ అధినేత బత్యిర్ బెర్డిక్లిచెవ్ తోసిపుచ్చారు. రష్యాలో ఇటీవల తలెత్తిన కేసులన్నీ కూడా మైకోప్లాస్మా న్యుమోనియా ఇన్ఫెక్షన్‌కు సంబంధించినవేనని ఆయన తెలిపారు. ఇన్ఫెక్షన్ వచ్చిన రోగులు రక్తం కక్కుకుంటున్నారని వచ్చిన వార్తలపై స్పందిస్తూ రష్యా అధికారులు సంబంధిత డేటాను ఇవ్వాలని డబ్ల్యుహెచ్‌ఓ కోరినట్లు చెప్పారు. దర్యాప్తులు, లేబరేటరీ నిర్ధారణలు జరిపిన తర్వాత మాస్కోలో నమోదైన ఐదు కేసులు కూడా మైకోప్లాస్మా న్యుమోనియా వల్ల నమోదైనవేనని తేలిందని ఆయన చెప్పారు. ఇదేమీ కొత్త వైరస్ కాదన్నారు. పైగా ఈ కేసుల సంఖ్య వల్ల ఎలాంటి ముప్పు కూడా లేదన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుతో మత స్వేచ్ఛకు విఘాతం

- సుప్రీంకోర్టులో కాంగ్రెస్, ఎంఐఎంఐఎం పిటిషన్లు




**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) బిల్లు, 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ కాంగ్రెస్ ఎంపి మహ్మద్ జావేద్, ఎఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసి శుక్రవారం సుప్రీం కోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. రాజ్యసభలో ఈ బిల్లుపై సుదీర్ఘంగా చర్చ సాగిన అనంతరం పార్లమెంట్ దీనికి ఆమోద ముద్ర వేసిన గంటల వ్యవధిలోనే ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. వక్ఫ్ ఆస్తులు, వాటి నిర్వహణపై ఈ బిల్లు ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తోందని తద్వారా ముస్లింల మతపరమైన స్వయం ప్రతిపత్తికి, మత స్వేచ్ఛకు ఇది విఘాతం కలిగిస్తోందని జావేద్, అసదుద్దీన్ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. 300ఎ అధికరణ కింద రక్షణ కల్పించబడిన ఆస్తుల హక్కులకు ఈ సవరణలు విఘాతం కలిగిస్తున్నాయని తెలిపారు. వక్స్ ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణను విస్తరించడం, ఆస్తిని మతపరమైన ప్రయోజనాలకు అంకితం చేసేందుకు వ్యక్తులకు గల సామర్ధ్యాన్ని పరిమితం చేయడం, వక్ఫ్ ఆస్తులను ఉన్నత పరిశీలనకు గురి చేయడం వంటి చర్యల ద్వారా ఈ చట్టం మతపరమైన ఆస్తులపై నియంత్రణను లౌకిక అధికారులకు బదిలీ చేయాలన్న సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వుందన్నారు. మత పరమైన, ఆస్తి హక్కులను ఉల్లంఘిస్తోందని పిటిషన్లలో పేర్కొన్నారు.

ఇతర మతపరమైన నిధుల పాలనలో భాగం కాని ఆంక్షలను విధించడం ద్వారా ముస్లింలపై ఈ ప్రతిపాదిత చట్ట నిబంధనలు వివక్షను కనబరుస్తున్నాయని తెలిపారు. ఉదాహరణకు, హిందూ, సిక్కు మత ట్రస్టులు స్వయం నియంత్రణను కలిగివున్నాయి. కానీ వక్ఫ్ చట్టం, 1995కి సవరణలు చేయడం ద్వారా వక్ఫ్ వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత రూపంలోని ఈ బిల్లు రాజ్యాంగం మౌలిక అంశమైన సమానత్వపు హక్కు ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందన్నారు. ఏ ఏ లక్ష్యాలైతే సాధించాలనుకున్నారో వాటితో ఎలాంటి సహేతుకమైన సంబంధం లేని రీతిలో ఏకపక్ష వర్గీకరణలను ఈ ప్రతిపాదిత బిల్లు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. మతపరమైన ఆచారాల కాల వ్యవధి ప్రాతిపదికన వక్ఫ్‌ల ఏర్పాటుపై ఆంక్షలను ఈ నిబంధనలు ప్రవేశపెట్టాయన్నారు. కానీ ఇటువంటి కాలపరిమితులు ఇస్లామిక్ చట్టంలో, ఆచారాల్లో లేవన్నారు. పైగా 25వ అధికరణ కింద మతాన్ని ఆచరించే ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నాయన్నారు.

**దేశవ్యాప్త ఆందోళనలకు ఎఐఎంపిఎల్‌బి పిలుపు**

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి) పిలుపునిచ్చింది. వక్ఫ్ సవరణ బిల్లు 2025పై ప్రభుత్వ వైఖరి విచారకరమని సోషల్‌మీడియా 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ బిల్లుకి వ్యతిరేకంగా త్వరలో దేశవ్యాప్తంగా నిరసనలు, చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఎఐఎంపిఎల్‌బి పేర్కొంది.

## తమిళనాడు నీట్ బిల్లుకు రాష్ట్రపతి తిరస్కరణ

- కేంద్రం తీరుపై సిఎం స్టాలిన్ తీవ్ర ఆగ్రహం
- 9న అఖిలపక్షం భేటీకి పిలుపు

**చెన్నై :** ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ ప్రాతిపదికగా వుండాలన్న నిబంధనల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదాన్ని నిలుపుచేశారు. కేంద్ర ప్రభుత్వం చేసిన సిఫార్సుల ప్రాతిపదికన రాష్ట్రపతి ఈ చర్య తీసుకున్నారు. కేంద్రం వ్యవహరిస్తున్న తీరుపై తమిళనాము ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఈ నెల 9న అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా విస్మరించిందని విమర్శించారు. దీనిపై తదుపరి కార్యాచరణ ఏ రీతిలో వుండాలో న్యాయ నిపుణులతో ప్రభుత్వం చర్చిస్తుందని స్టాలిన్ చెప్పారు. తదుపరి చర్యలపై చర్చించేందుకు చెన్నైలో సచివాలయంలో ఈనెల 9న అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆయన నేతలను కోరారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.రాజన్ నేతృత్వంలో తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల ప్రాతిపదికన 2021 సెప్టెంబరు 13న రాష్ట్ర అసెంబ్లీ తమిళనాడు అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ కోర్సుల అడ్మిషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిందని ముఖ్యమంత్రి చెప్పారు. అయితే ఆ బిల్లును పున:పరిశీలించాల్సిందిగా కోరుతూ గవర్నర్ తిప్పి పంపారు. ఆ తర్వాత 2022 ఫిబ్రవరి 5న అఖిల పక్షం పెట్టి, ఫిబ్రవరి 8న అసెంబ్లీ మళ్లీ బిల్లును ఆమోదించింది. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి పంపింది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు అవసరమైన వివరణలను తమిళనాడు ప్రభుత్వం అందచేసిందని స్టాలిన్ చెప్పారు. అయిని నీట్ మినహాయింపు బిల్లును ఆమోదించడానికి కేంద్రం తిరస్కరించిందన్నారు. ఇది తమ విద్యార్థులకు పెద్ద ఎదురు దెబ్బ అన్నారు. సహకార సమాఖ్యవాదం చరిత్రలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఒక చీకటి అధ్యాయమని వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రజల అభిప్రాయాలను, అసెంబ్లీ తీర్మానాలను పూర్తిగా విస్మరించిందన్నారు.

## 'యాక్సిస్' ఒప్పందంతో భారం

(మొదటి పేజీ తరువాయి)

బెదిరింపులకు పాల్పడుతోందని, ఆ సమాధానాన్ని ఎస్‌పిడిసిఎల్ ఉపసంహరించుకోవాలని, వినియోగదారులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'పొలిటికల్ కలర్' అంటూ సమాధానంలో పేర్కొనడంపై ఆగ్రహం వక్తం చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటే అందుకు తాము సిద్ధమని, శ్వేతపత్రంలో సెకి ఒప్పందం నష్టమని, అందులో డిస్కంల పేరు కూడా పెట్టినందుకు కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

**అధిక ధరకు ఎందుకు కొనాలి?**
**సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ వేణుగోపాలరావు**

సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2 నుంచి రూ.2.50కే వస్తుందని, రూ.4.60 ఎందుకు అవుతుందని, అధిక ధరకు ఎందుకు కొనాలని సీనియర్ జర్నలిస్ట్, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎం.వేణుగోపాలరావు ప్రశ్నించారు. వర్చువల్‌గా ఆయన మాట్లాడుతూ 2018లో యాక్సిస్‌తో ఎంఒయు కుదుర్చుకుంటే ఏడేళ్లు వెనక్కి పడిపోయిన పిటిషన్ మళ్లీ ఎందుకు ముందుకు వచ్చిందని, దీన్ని ఇప్పుడు పైలట్ ప్రాజెక్టుగా చేయడానికి ఉత్సాహం ఎందుకని ప్రశ్నించారు. నాలుగు గంటల పీక్ అవర్స్‌లో 87 మెగావాట్లు మాత్రమే సరఫరా అవుతాయని, మిగిలిన విద్యుత్ అంతా నాన్ పీక్ అవర్స్‌లోనే వస్తుందని వివరించారు. తాము లేవనెత్తిన కొన్ని ప్రశ్నలకు ఎస్‌పిడిసిఎల్ సమాధానం ఇవ్వలేదన్నారు. 'పొలిటికల్ కలర్' వ్యాఖ్యలతో ఎస్‌పిడిసిఎల్ అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సక్రమంగా ఉత్పత్తి చేయకపోతే పెనాల్టీ ఉంటుందని చెబుతున్నారని, అయితే, మొదటి మూడేళ్లు ఎలాంటి పెనాల్టీ ఉండని తెలిపారు.

**విద్యుత్ ఛార్జీలు పెంచుతామంటే సహించబోం : కె.రామకృష్ణ**

యాక్సిస్ సోలార్ ఒప్పందం పేరుతో ఛార్జీలు పెంచుతామంటే సహించబోమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు స్వయంగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎపిలో సోలార్ విద్యుత్ అవకాశం ఉంటే అనాడు ప్రభుత్వం ఆదానితో ఎందుకు ఒప్పందం చేసుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ ఒప్పందం కోసం అదాని నుంచి రూ.1,750 కోట్ల లంచం తీసుకున్నట్లు అమెరికాలో కేసు నమోదైయిందని, అదానికి అమెరికా కోర్టు నోటీసులు కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. ఎపిలో ఇన్ని వసతులు ఉంటే రాజస్తాన్ నుండి విద్యుత్ తీసుకోవడమేమిటని ప్రశ్నించారు. ఎన్నికల ముందు దీనిపై ఎపి హైకోర్టులో ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కోర్టులో కేసు వేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎపిఇఆర్‌సి పరువు కాపాడాలని, వెంటనే సెకి ఒప్పందం రద్దు చేయాలని, అది కుదరని పక్షంలో ఒప్పందాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

**వినియోగదారుల ప్రయోజనాలు కాపాడాలి**

వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాలని, భిన్నమైన పద్ధతి అవలంబించడం సరికాదని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి అన్నారు. హైబ్రిడ్ ఎనర్జీ పేరుతో పీక్ అవర్స్ నాలుగు గంటలకు బదులు 24 గంటలు అన్వయించడం సరికాదని పేర్కొన్నారు. పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ హైదరాబాద్ కన్వీనర్ ఎం.వి.ఆంజనేయులు, న్యూ డైరెక్షన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి బి.దశరథ్ రాం, నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ సిఇఒ సుబ్రహ్మణ్యం, పులిపాక ఎవర్ని బుక్ ఫీల్డ్ రెన్యువబుల్ సిఇఒ సుమన్ కుమార్ తమ అభిప్రాయాలను తెలిపారు. ఎపి ఎస్‌పిడిసిఎల్ తరపున సిజిఎం జానకి రాం, లెర్నెడ్ స్టాండింగ్ కౌన్సిల్ శివరావ్, యాక్సిజ్ ఎనర్జీ తరపున సిఇఒ మురళీ సూరపనేని, లెర్నెడ్ కౌన్సిల్ దీపక్ తమ ప్రతిపాదనలను కౌన్సిల్ ముందు పెట్టారు. అభ్యంతరాలను, ప్రతిపాదనలను విన్న ఇఆర్‌సి చైర్మన్ పివిఆర్ రెడ్డి ఉత్తర్వులను రిజర్వ్ చేశారు.

## ఫార్మా విద్యార్థిని నాగాంజలి మృతి

(మొదటి పేజీ తరువాయి)

లేకపోవడంతో నాగాంజలి మృతి చెందారు. దీంతో, ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. నాగాంజలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కిమ్స్ నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. అప్పటికే ఆమె తల్లిదండ్రులతోపాటు కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు, వామపక్ష నాయకులు, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు అక్కడికి చేరుకున్నారు. అయితే, పోస్టుమార్టం పూర్తి కాకుండానే నాగాంజలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారి గ్రామానికి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. పోస్టుమార్టం పూర్తి కాగానే గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తరలించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. కడసారి చూపు కోసం తోటి విద్యార్థులు, నాయకులు కోరినా అంగీకరించలేదు. మృతదేహాన్ని చూపించాలని అంబులెన్స్‌ను అడ్డుకున్న వామపక్ష నాయకులు, మహిళా, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులను నెట్టేసి క్షణాల్లో ఆస్పత్రి నుంచి అంబులెన్స్‌ను తరలించేశారు.

**ఆస్పత్రి వద్ద ధర్నా**

మృతదేహం తరలింపులో పోలీసుల తీరుకు నిరసనగా ఆస్పత్రి వద్ద వామపక్ష, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ నాగంజలి మృతి బాధాకరమన్నారు. ఆమె మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. సూసైడ్ నోట్‌లో వెల్లడించిన విషయాలతోపాటు, సిసి పుటేజీ, తోటి విద్యార్థుల నుంచి సమగ్ర విషయాలు సేకరించాలని కోరారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, కిమ్స్ యాజమాన్యం బాధితురాలి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి మాట్లాడుతూ కడసారిగా కూడా నాగాంజలిని చూడనివ్వకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు టి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతి దురదృష్టకరం**
**డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్**

ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతి దురదృష్టకరమని, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాగాంజలి తన సూసైడ్ నోట్‌లో కారకుడిగా పేర్కొన్న ఆసుపత్రి ఎ.జిఎం డాక్టర్ దువ్వాడ దీపక్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తోటి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడితే విద్యార్థులు ఆందోళనకు లోనవుతారని, కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో చోటుచేసుకున్న అత్యాచార, హత్య ఘటన సమయంలో మెడికోలు ఆందోళనలు చేయడాన్ని దృష్టిలో ఉంచుకోవాలని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాజమండ్రి ఘటన నేపథ్యంలో అనుసరించాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి హోమ్‌శాఖ మంత్రి అనిత, డిజిపిలకు ఆయన సూచించారు.

## సమానత్వం.. న్యాయసమ్మతం

**డీ లిమిటేషన్‌పై సిపిఎం డిమాండ్**

(మొదటి పేజీ తరువాయి)

పరిమితిని కొనసాగించాలని తద్వారా ఫెడరల్ సూత్రాలకు భంగం కలగకుండా చూడాలని అన్నారు. 'భారతదేశంలో గతంలో 1952, 1963, 1973 సంవత్సరాల్లో డిలిమిటేషన్ ప్రక్రియలు జరిగాయి. అయితే, 1976 స్థిరీకరణ తరువాత, జనాభా ఆధారంగా ప్రాతినిధ్య పంపిణీపై వ్యతిరేకత రావడంతో తదుపరి మార్పులు వాయిదా పడ్డాయి. 2001 జనగణన తరువాత కూడా ఇదే పరిస్థితి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తాము జనాభా నియంత్రణ చర్యలు సమర్థవంతంగా చేపట్టడం వల్ల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే భయంతో తీవ్రంగా వ్యతిరేకించాయి. నియోజకవర్గాల పునర్విభజనపై ఆంక్షలు 1976లో ఎమర్జెన్సీ సమయంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా అమలులోకి వచ్చాయి. వీటి ఉద్దేశ్యం జనాభా నియంత్రణ విధానాలను ప్రోత్సహించడమే. తరువాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఈ విధానాలను 2026 వరకు పొడిగించింది.' అని తీర్మానంలో వివరించారు. తాజా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని, ఈ రాష్ట్రాలు విజయవంతంగా జనాభా నియంత్రణ విధానాలను పాటించడమే దీనికి కారణమని, జనాభా పెరుగుదల అధికంగా ఉన్న రాష్ట్రాలకు (ఉదా: ఉత్తరప్రదేశ్) ఎక్కువ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందని, ఇది అన్యాయం' అని తీర్మానం పేర్కొంది. ఈ తీర్మానాన్ని పొలిట్‌బ్యూరో సభ్యులు జి.రామకృష్ణన్ ప్రతిపాదించగా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి సంజయ్ చౌహాన్ బలపరిచారని సలీం తెలిపారు.

**'ఆ' విధానాల్లో భాగమే...!**

ఎక్కువ సంతానాన్ని కనాలంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇస్తున్న పిలుపును ప్రస్తావించగా ఆర్‌ఎస్ఎస్, బిజెపి విధానాల్లో భాగంగానే బాబు ఆ తరహా పిలుపు ఇస్తున్నారని సలీం చెప్పారు. 'ఒకప్పుడు ముస్లింల జనాభా పెరిగిపోతోందని, దానికి ప్రతిగా హిందువులు అధిక సంతానాన్ని కనాలని ఆర్‌ఎస్ఎస్ చెప్పేది' అని ఆయన గుర్తుచేశారు. దానినే చంద్రబాబు కొంచెం సున్నితంగా, మతాల పేరు ఎత్తకుండా చెబుతున్నారు. ఆ పిలుపు ఆర్‌ఎస్ఎస్, బిజెపి విధానాల్లో భాగమే' అని చెప్పారు.



## మీకోసం

మజ్జిగలో వచ్చిన వెన్నపూసను ప్రతి రోజూ చెమటపొక్కుల మీద రాస్తే ఉపశమనం కలుగుతుంది.

## జీవన సౌరభం

విమర్శలను వినయంగా స్వీకరించినప్పుడే విజయం సాధించగలం.

## వేసవిలో అల్లరి

అచ్చయ్య తోటలోకి
నెచ్చెలులతో వచ్చిరి
నచ్చిన కాయలు తినిరి!


ముచ్చట్లు చెప్పుకొనిరి
నచ్చినట్లుగా నడిచిరి
రెచ్చిపోయి పాడిరి
అచ్చమైన తెలుగు తిండ్లు ఆరగించిరి!

రచ్చలెరుగని అల్లర్లతో
ముచ్చటైన ముచ్చట్లతో



వేసవిలో అల్లరి చేసిరి
అల్లరి పిల్లలు ఆడిపాడిరి!

- ఆళ్ల నాగేశ్వరరావు, తెనాలి,
74166 38823.



## దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో బయట ఉన్న పురుగు, ఆకు దగ్గరకు చేరుకోవాలి. కొంచెం దారి చూపించరూ?

## నేను గీసిన బొమ్మ





కాగిత ప్రజ్వల ,
7వ తరగతి,
ఎంపిపియుపి స్కూలు,
నడవపల్లి,
డా.బి.ఆర్.అంబేద్కర్
కోనసీమ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# నాన్న వద్దనుకున్న బిడ్డని..

**ఆడపిల్లలు తల్లిదండ్రులకు భారమని ఆ తండ్రి భావించాడు. తనకే ఆడపిల్ల పుట్టేసరికి తట్టుకోలేక పోయాడు. ఆ పిల్లపై ద్వేషం పెంచుకున్నాడు. తల్లి లేని వేళ చూసి, పొత్తిళ్ల బిడ్డని, కనీసం నెల రోజులు కూడా పూర్తవ్వని పసిదాన్ని నిర్దాక్షిణ్యంగా కిటికీలోంచి విసిరేశాడు. కిందపడిపోతున్న ఆ బిడ్డని అక్కడే తచ్చాడుతున్న పక్కింటితను కాపాడాడు. అతడు లేకపోయుంటే ఆ బిడ్డ ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి. ఎంత దుర్మార్గం? గుక్కపెట్టి ఏడుస్తున్న ఆ బిడ్డని తల్లి పొత్తిళ్లల్లోకి తీసుకుంది. గుండెలవిసేలా ఏడుస్తున్న బిడ్డని ఓదార్చడం ఆ అమ్మ తరం కాలేదు. ఆ క్షణం ఆ అమ్మ తీసుకున్న నిర్ణయం.. ఇప్పుడు ఆ పిల్ల సంగీత ప్రపంచంలో రికార్డులు బద్దలు కొట్టేలా చేస్తోంది. ఇది ఢిల్లీకి చెందిన 13 ఏళ్ల నియతి చెత్రాన్ష్ నిజమైన కథ!**





'నాన్న వద్దనుకున్న బిడ్డని నేను. అమ్మే నా రోల్ మోడల్' అంటూ నియతి ఎక్కడ సంగీత ప్రదర్శన చేసినా ముందుమాటగా చెబుతుంది. తండ్రి చేసిన దారుణం ఆ బిడ్డ మనసుని ఎంతలా బాధించిందో ఈ ఒక్క ఉదాహరణ చాలు.. నియతి గురించి వాళ్ల అమ్మ మాటల్లో చెప్పాలంటే.. 'నా కూతురు ఓ అద్భుతం.. వాళ్ల నాన్నకి అక్కర్లేదని విసిరేసిన రోజే నేను ఒక నిర్ణయం తీసుకున్నాను. నేను ఈ ప్రపంచాన్ని మార్చలేకపోవచ్చు. కానీ అతను విసిరేసిన ఈ బిడ్డ ప్రపంచాన్ని మార్చేలా తయారుచేస్తాను' అంటూ అతని నుండి బయటికి వచ్చేసి, ఒంటరిగానే నా చిట్టితల్లిని పెంచాను' అని చెబుతున్నారు.

సంగీతంపై నియతి పెంచుకున్న మక్కువ గురించి కూడా ఆమె ఇలా చెప్పారు. 'ఆరు నెలల వయసున్నప్పుడు నేను తనకి ఒక కీబోర్డ్ కొనిచ్చాను. అంత పసిపిల్లగా ఉన్నప్పుడే తను చాలా సహజమైన పద్ధతిలో లయబద్ధంగా ప్లే చేసేది. ఆ తరువాత వంటగది పాత్రలపై కూడా సంగీతాన్ని పలికించేది. అప్పుడే నా బంగారుతల్లి ప్రతిభని గుర్తించాను. సంగీత సాధనలో తను ఎంత దూరం వెళ్లాలనుకుంటే అంత దూరం తనని తీసుకెళ్లాలనుకున్నాను' అంటున్నప్పుడు ఆమె కళ్లు కన్నీటి సంద్రాలయ్యాయి.

అమ్మ గురించి నియతి చెబుతూ.. 'తను నా కోసం ఉద్యోగాన్ని వదులుకుంది. ఫ్రీలాన్సర్‌గా స్థిరపడి వచ్చిన ఆదాయంతోనే ఇద్దరం జీవిస్తున్నాం. చిన్నప్పటి నుండి నాకు సంగీతంపై ఇష్టం వుండేది. అమ్మ నా ఇష్టాన్ని ఎప్పుడూ కాదనలేదు. నేను కన్న కలలు సాకారం చేసేందుకు అమ్మ ఎన్నో త్యాగాలు చేసింది. అందుకే అమ్మ నా రోల్‌మోడల్' అని గర్వంగా చెబుతుంది.

నియతి సంగీత సాధనలో ఎంతో నైపుణ్యం సాధించింది. 12 ఏళ్లకే 42 సంగీత పరికరాలపై స్వరాలు పలికించేది. ఆ ప్రతిభ అక్కడితోనే ఆగలేదు. పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గొప్ప గొప్ప ప్రదర్శనలు చేసి ఔరా అనిపించుకుంది. 65 సెకండ్లలో 15 సంగీత వాయిద్యాలపై జాతీయగీతాన్ని స్వరపర్చి ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుంది. బ్లైండ్‌ఫోల్డ్‌తో ఎంతో క్లిష్టమైన శివతాండవ్‌ని కేవలం 13 సెకన్ల వ్యవధిలో ప్రదర్శించి ప్రేక్షకులను ఆశ్చర్యంలో ముంచెత్తింది.

సంగీతంలో రికార్డులు సృష్టిస్తున్న నియతిని ఎప్పుడైనా ఎవరైనా ప్రశంసిస్తే.. తను అన్న మాటలివి.. 'ఈ రికార్డులు కేవలం సంగీతంలో మాత్రమే కాదు.. నన్ను ఎవరూ నిశ్శబ్దం చేయలేరని నిరూపించడానికి, అలాగే నాలాంటి బిడ్డలని తయారుచేస్తున్న అమ్మలను ఎవరూ ఆపలేరని చెప్పడానికి' అని నియతి ఎంతో గర్వంగా చెబుతుంది.

ఐదేళ్ల వయసుకే ట్రినిటీ కాలేజ్ లండన్‌లో గ్రేడెడ్ పియానో పరీక్షలు రాసిన నియతి, నేడు ఉకులేలే, ఫ్లూట్, తబలాతో సహా 16 విభిన్న వాయిద్యాలను వాయించగలదు. సంగీత దర్శకురాలిగా మారాలన్నది ఆమె కల. ప్రస్తుతం నియతి గంధర్వ మహా విద్యాలయంలో తబలాలో ప్రావీణ్యం సాధిస్తోంది. అలాగే ఏడవతరగతి పియానో అర్హత కోసం కృషిచేస్తోంది. బిడ్డ ఉత్సాహం గుర్తెరిగిన ఆ తల్లి మద్దతుతో రాబోయే సంవత్సరాల్లో నియతి సంగీత ప్రపంచాన్ని తన అద్భుత విన్యాసాలతో అబ్బురపరుస్తూ ఉండాలని కోరుకుందాం.

# ఆమె మద్దతుతోనే...




**పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది నిత్యం ఎంతో ఒత్తిడికి గురవుతుంటారు. అంత ఒత్తిడిలోనూ ఓ లక్ష్యం నిర్దేశించుకుని దాన్ని చేరుకునే వారు చాలా అరుదు. అలాంటివారిలో ఒకరే ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పిల్లి రాజు (40). స్విమ్మింగ్, రన్నింగ్‌లో ప్రతిభ చూపిస్తున్న రాజు ఎప్పటికైనా 'ఐరన్‌మ్యాన్' టైటిల్ గెలవాలని లక్ష్యం పెట్టుకున్నాడు.**

వైరా మండలం, కొత్తల గ్రామానికి చెందిన రాజు దిగువ మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చారు. తన కలలు నెరవేర్చుకునేందుకు కఠోరసాధన చేశాడు. ఏకబిగువున 3.86 కిలోమీటర్లు ఈది ఔరా అనిపించాడు. 180 కిలోమీటర్ల సైకిల్ రైడింగ్ చేశాడు. 42.1 కిలోమీటరు దూరాన్ని ఎక్కడా విరామం తీసుకోకుండా పరుగెత్తాడు. సరిహద్దు వెంట కఠినమైన 100 కిలోమీటర్ల పరుగుపందెంలో కూడా సత్తా చాటాడు.

21 కిలోమీటర్లు, 42 కిలోమీటర్లు, 50 కిలోమీటర్ల కేటగిరీలో పాల్గొన్న రాజు 300 పతకాలు సాధించాడు. 15 ఏళ్లుగా రాష్ట్ర పోలీసు విభాగంలో నిర్వహించే వివిధ క్రీడల్లో పాల్గొని, 40 పతకాలు సొంతం చేసుకున్నాడు. ఒక్క పరుగుపందెంలోనే కాదు, జూడోలో కూడా రాజు విజయపరంపర కొనసాగుతోంది. జనవరిలో కరీంనగర్‌లో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో సత్తా చూపాడు.

కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్న ఓ సాధారణ వ్యక్తి ఇన్ని విజయాలు సాధించడం ఆషామాషీ కాదు. ఈ విషయంపై రాజు మాట్లాడుతూ.. 'నేను సాధించిన ప్రతి విజయం వెనుక మా ఆవిడ శుభారాణి కృషి ఎంతో ఉంది. జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న తను, నన్ను పరుగుపందెం వైపే కాదు, నా లక్ష్యం వైపు పరుగెత్తేలా కూడా ప్రోత్సహించింది. నా పరుగు ప్రత్యక్షంగా అందరికీ కనిపిస్తుంది. తను కుటుంబానికి ఏ లోటూ లేకుండా చూసేందుకు పరుగెత్తుతోంది. ఆర్థికంగా నాకు అండగా నిలబడుతోంది' అంటూ భార్య గురించి గొప్పగా చెప్పాడు. 'ఆమె నా బలమైన పునాది. 4వ తరగతి చదువుతున్న మా కూతురుతో సహా కుటుంబాన్ని అంతటినీ ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఆమె పాత్ర ఎంతోవుంది' అంటున్నాడు.



## 'సింగిల్' ఫస్ట్ సాంగ్ విడుదల


శ్రీవిష్ణు కథానాయకుడిగా కార్తిక్‌రాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సింగిల్'. కేతిక శర్మ, ఇవానా కథానాయికలు. వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా నుంచి చిత్రబృందం ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేసింది. 'శిల్పి ఎవరో.. ఈ శిల్పమెనుక..' అంటూ సాగే లిరిక్స్‌ను శ్రీమణి అందించారు. గీతా ఆర్ట్స్ అండ్ కాల్య ఫిల్మ్స్ బ్యానర్‌పై విద్య కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## మాధవన్ సినిమాలో శివానీ రాజశేఖర్



భారత ప్రముఖ ఇంజనీర్ జి.డి.నాయుడు జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా జిడి నాయుడు (జిడిఎన్). ఆర్.మాధవన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. కథానాయిక శివానీ రాజశేఖర్ కూడా ఇందులో నటిస్తున్నారు. ఎడిసన్ ఆఫ్ ఇండియా, మిరాకిల్ మేన్, వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూరు వంటి పేర్లు గడించిన గోపాలస్వామి దొరైస్వామి షార్ట్‌గా జిడి నాయుడు అని కూడా అంటారు. జిడిఎన్ పేరుతో తెరకెక్కుతున్న బయోపిక్‌కు కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే టైటిల్ లోగోను మేకర్లు విడుదల చేయగా సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండింగ్ అవుతోంది. ప్రియమణి, జయరాం, యోగిబాబు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జిడి నాయుడు కేవలం మూడోతరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కానీ ఆటోమొబైల్, అగ్రికల్చర్, టెక్స్‌టైల్, ఫొటోగ్రఫీ వంటి సెక్టార్లలో కొన్ని పరికరాల ఆవిష్కరణలు చేశారు. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా (2022)లో నటించటంతోపాటుగా డైరెక్షన్ కూడా చేసి మెప్పించారు.

## ఇడ్లీ కొట్టు 6 నెలలు వాయిదా



ధనుశ్ ప్రస్తుతం ఇడ్లీ కడై (తెలుగులో ఇడ్లీ కొట్టు) మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ పతాకాలపై ధనుశ్, ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన బిగ్ అప్‌డేట్‌ని చిత్రబృందం ప్రకటించింది. ముందుగా ప్రకటించినట్లుగా ఏప్రిల్ 10న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడినట్లు తెలిపింది. ఈ మేరకు స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 1వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రాన్ని గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. అరుణ్ విజయ్, షాలినీ పాండే, ప్రకాష్ రాజ్, రాజ్‌కిరణ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్ర తెలుగు విడుదల హక్కులను శ్రీ వేధాక్షర మూవీస్ అధినేత, నిర్మాత చింతపల్లి రామారావు సొంతం చేసుకున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



## తమిళ నటుడు రవికుమార్ కన్నుమూత

తమిళ, మలయాళ సినిమాల్లో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న రవి కుమార్ (71) చనిపోయారు. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన చెన్నై వళచేరిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు ప్రకటించారు. కేరళ త్రిసూర్‌కి చెందిన రవికుమార్.. 1975 నుంచి సినిమాలు చేస్తున్నారు. 'ఉల్లాస యాత్ర', 'అవరగళ్', 'సీబీఐ 5', 'పరమానందం' తదితర మలయాళ చిత్రాలు చేశారు. తమిళంలోనూ 'అల్లాఉద్దీన్ అద్భుత విళక్కుమ్', 'రమణ', 'ఆనంద రాగం' తదితర సినిమాలు చేశారు. చివరగా 2022లో 'వీట్ల విశేషమ్' మూవీలో నటించారు.



## మనోజ్‌కుమార్ ఇక లేరు

బాలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ (87) శుక్రవారం ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా ఆయన గుండె సంబంధిత జబ్బుతో బాధ పడుతున్నారు. చికిత్స పొందుతూ మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలీవుడ్‌లో ఆయన ఎక్కువగా దేశభక్తి చిత్రాలను తెరకెక్కించటంతోపాటుగా నటించారు. అందుకే ఆయన్ను అందరూ 'భరత్‌కుమార్' అని కూడా పిలుస్తారు. ఉపకార్ (1967), పురబ్ ఔర్ పశ్చిమ్ (1970), క్రాంతి (1981) వంటి క్లాసిక్ సినిమాలను ఆయన తీశారు. దశాబ్దాలుగా భారతీయ సినిమాకు చేసిన అపారమైన కృషికి ప్రతిష్టాత్మక పద్మశ్రీ, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డులతో కేంద్రప్రభుత్వం గౌరవించింది. మనోజ్‌కుమార్ మృతికి ప్రధాని నరేంద్రమోడీ, బాలీవుడ్ నటీనటులు తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఉత్కంఠ పోరులో లక్నో గెలుపు

### మార్ష్, మర్‌క్రమ్ అర్ధ సెంచరీలు
### ఛేదనలో పోరాడి ఓడిన ముంబయి



**లక్నో:** చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఐపిఎల్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. 204పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబయి జట్టు 191పరుగులకే కుప్పకూలింది. దీంతో లక్నో జట్టు 12పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. లక్నో బౌలర్ దిగ్వేష్ రాథి(1/21) కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి మ్యాచ్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ముంబయి జట్టు కెప్టెన్ సూర్యకుమార్(67), నమన్ ధీర్(46), తిలక్ వర్మ(25), హార్దిక్(28నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించినా మ్యాచ్‌ను గెలిపించలేక పోయారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 203పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్(60 31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లు), ఎడెన్ మర్కరమ్(53 38 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లు)లు శుభారంభం ఇచ్చారు. యువపేసర్ అశ్వినీ కుమార్ వేసిన 6వ ఓవర్లో వరుసగా 6, 4, రెండు పరుగులు తీసి అర్ధ శతకం సాధించాడు మార్ష్. దాంతో లక్నో జట్టు 6 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 58 పరుగులు చేసింది. నికోలస్ పూరన్(12)ను పాండ్యా బోల్తాకొట్టించగా.. కెప్టెన్ రిషభ్ పంత్(2) మరోసారి నిరాశపరుస్తూ పెవిలియన్ చేరారు. వీళ్లిద్దరూ ఔట్ కాగా.. 107కే మూడు వికెట్లు పడిన దశలో అయుష్ బదొని(30)అండగా మర్కరమ్ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించి జట్టు స్కోర్ 150 దాటించాడు. దూకుడుగా ఆడే క్రమంలో అశ్వినీ కుమార్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ రికెల్టన్‌కు బదొని చిక్కగా.. పాండ్యా ఓవర్లో భారీ షాట్ ఆడిన మర్కరమ్ వెనుదిరిగాడు. వీళ్లిద్దరూ వెనువెంటనే ఔట్ కావడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది. డెత్ ఓవర్లో అబ్దుల్ సమద్(4) నిరాశపరచగా.. డేవిడ్ మిల్లర్(27) తన విశ్వరూపం చూపించాడు. పాండ్యా వేసిన 20వ ఓవర్లో 6, 4 కొట్టడంతో లక్నో 200లకు చేరుకుంది. ముంబయి బౌలర్లలో హార్దిక్ పాండ్యాకు ఐదు, బౌల్ట్, అశ్విని కుమార్, విఘ్నేష్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

**తిలక్ వర్మ రిటైర్డ్ ఔట్...**

ముంబయి బ్యాటర్ తిలక్ వర్మ రిటైర్డ్ ఔట్‌గా పెవీలియన్‌కు చేరాడు. తిలక్ వర్మ 23 బంతుల్లో 25పరుగులు చేసి పరుగులు మాత్రమే చేశాడు. దీంతో రిటైర్డ్ ఔట్‌గా పెవీలియన్‌కు చేరుతున్నట్లు అంపైర్లకు తెలిపాడు. దీంతో 2025 సీజన్‌లో ఈ విధంగా ఔటైన తొలి బ్యాటర్‌గా తిలక్ వర్మ నిలిచాడు. ఆ తర్వాత హార్దిక్ క్రీజ్‌లోకి వచ్చి పోరాడినా ప్రయోజనం లేకపోయింది. ఇన్నింగ్స్ 20 ఓవర్లో ముంబయి జట్టు 6బంతుల్లో 22 పరుగులు చేయాల్సి రాగా.. ఆవేశ్ ఖాన్ వేసిన ఆ ఓవర్లో కేవలం 9పరుగులు మాత్రమే చేసింది. దీంతో ముంబయి జట్టు 12పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

**స్కోర్‌బోర్డు...**


**లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్:** మార్ష్ (సి అండ్ బి)విఘ్నేష్ 60, మార్‌క్రమ్ (సి)రాజ్ బవా (బి)హార్దిక్ 53, పూరన్ (సి)దీపక్ చాహర్ (బి)హార్దిక్ పాండ్యా 12, రిషభ్ పంత్ (సి)కార్బన్ బోచ్ (బి)హార్దిక్ 2, ఆయుష్ బడోని (సి)రికెల్టన్ (బి)అశ్విని కుమార్ 30, డేవిడ్ మిల్లర్ (సి)నమన్ ధీర్ (బి)హార్దిక్ పాండ్యా 27, అబ్దుల్ సమద్ (సి)నమన్ ధీర్ (బి)బౌల్ట్ 4, శార్దూల్ ఠాకూర్ (నాటౌట్) 5, ఆకాశ్ దీప్ (సి)సాంట్నర్ (బి)హార్దిక్ 0, ఆవేశ్ ఖాన్ (నాటౌట్) 2, అదనం 8. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 203పరుగులు. **వికెట్ల పతనం:** 1/76, 2/91, 3/107, 4/158, 5/173, 6/182, 7/200, 8/200 **బౌలింగ్:** బౌల్ట్ 3-0-28-1, దీపక్ చాహర్ 2-0-23-0, అశ్విని కుమార్ 3-0-39-1, సాంట్నర్ 4-0-46-0, విఘ్నేష్ 4-0-31-1, హార్దిక్ పాండ్యా 4-0-36-5.

**ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్:** విల్ జాక్స్ (సి)బిష్ణోయ్ (బి)ఆకాశ్ దీప్ 5, రికెల్టన్ (సి)బిష్ణోయ్ (బి)శార్దూల్ 10, నమన్ ధీర్ (బి)దిగ్వేష్ రాథి 46, సూర్యకుమార్ యాదవ్ (సి)అబ్దుల్ సమద్ (బి)ఆవేశ్ ఖాన్ 67, తిలక్ వర్మ(రిటైర్డ్ ఔట్) 25, హార్దిక్ (నాటౌట్) 28, సాంట్నర్ (నాటౌట్) 2, అదనం 8. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 191పరుగులు. **వికెట్ల పతనం:** 1/11, 2/17, 3/86, 4/152 **బౌలింగ్:** శార్దూల్ 4-0-40-1, ఆకాశ్ దీప్ 4-0-46-1, ఆవేశ్ ఖాన్ 4-0-40-1, దిగ్వేష్ 4-0-21-1, బిష్ణోయ్ 4-0-40-0.

### ఐపిఎల్‌లో నేడు

**చెన్నై సూపర్‌కింగ్స్ × ఢిల్లీ క్యాపిటల్స్**
వేదిక: చెన్నై; మ.3.30గం॥లకు

**పంజాబ్ కింగ్స్ × రాజస్థాన్ రాయల్స్**
వేదిక: ఛండీగఢ్; రా.7.30గం॥లకు



## డిఫెండింగ్ ఛాంపియన్ జు వెన్‌జున్‌కు షాక్

- రెండోరౌండ్‌లో అనూహ్య ఓటమి
- మహిళల ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్

**షాంఘై:** మహిళల ప్రపంచ ఛెస్ కిరీటానికి ఇద్దరు చైనా గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న పోటీలో డిఫెండింగ్ ఛాంపియన్ జు వెన్‌జున్ అనూహ్యంగా రెండోరౌండ్‌లో ఓటమిపాలైంది. శుక్రవారం జరిగిన రెండోరౌండ్ గేమ్‌లో వెన్‌జున్‌పై టాన్ జోంగీ సంచలన విజయం సాధించింది. గురువారం జరిగిన తొలిరౌండ్ గేమ్ 39ఎత్తుల తర్వాత డ్రా కాగా.. శుక్రవారం జరిగిన రెండోరౌండ్ గేమ్‌లో టాన్ గెలిచింది. దీంతో టాన్ 1.5-0.5పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది. రెండోరౌండ్‌లో టాన్ తెల్ల పావులతో ఆడింది. ఈ గేమ్ సుమారు 62ఎత్తుల పాటు దాదాపు ఐదు గంటలసేపు సాగడం గమనార్హం. ఆదివారం మూడోరౌండ్ గేమ్ జరగనుంది.

## టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ఓలీ స్టోన్ దూరం



**లండన్:** టీమిండియాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ క్రికెట్ జట్టును గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే స్టార్ పేసర్ మార్క్ వుడ్ సేవలను కోల్పోయిన ఇంగ్లండ్.. తాజాగా మరో ఫాస్ట్ బౌలర్ ఈ జాబితాలో చేరాడు. ఓలీ స్టోన్ గాయం కారణంగా భారత్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఇసిబి) ధృవీకరించింది. స్టోన్ ఇంగ్లండ్ తరపున ఇప్పటివరకు ఐదు టెస్టులు ఆడాడు. గత వేసవిలో ఇంగ్లండ్ జట్టులో రెగ్యులర్‌గా స్టోన్ ఉన్నాడు. అయితే గత నెలలో అతడి కుడి మోకాలికి గాయమైంది. దీంతో రాబోయే 14 వారాల పాటు ఆటకు దూరంగా ఉండనున్నాడు. ఈ ఏడాది ఆగస్టు నాటికి స్టోన్ కోలుకుంటాడని ఇసిబి పేర్కొంది. కానీ భారత్-ఇంగ్లండ్ మధ్య సిరీస్ ఆగస్టు 4తో ముగియనుంది. మరోవైపు కెప్టెన్ బెన్ స్టోక్స్ ఫిట్‌నెస్ కూడా ఇంగ్లండ్ జట్టు మెనెజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. అతడు ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదు. ఈ స్టార్ ఆల్ రౌండర్ వచ్చే నెలలో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఉండాల్సి ఉంది. కానీ తొలి రౌండ్ మ్యాచ్‌లకు స్టోక్స్ దూరం కానున్నాడని డర్హామ్ ప్రధాన కోచ్ ర్యాన్ కాంప్‌బెల్ వెల్లడించాడు.

## ధోనీకి చెన్నై సూపర్‌కింగ్స్ పగ్గాలు



**చెన్నై:** చెన్నై సూపర్ కింగ్స్(సిఎస్‌కె) పగ్గాలు మరోసారి మహేంద్ర సింగ్ ధోనీ అందుకోనున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ)తో శనివారం జరిగే మ్యాచ్‌లో ధోనీ సారథిగా వ్యవహరించనున్నాడు. రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయపడడంతో ధోనీ కెప్టెన్సీ బాధ్యతలు మోయనున్నాడు. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ సందర్భంగా గైక్వాడ్ ఎడమ మోచేతికి గాయంతో బాధపడిన రుతురాజ్ ఢిల్లీతో మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నట్లు సమాచారం. శనివారం చెపాక్ స్టేడియంలో చెన్నై జట్టు ఢిల్లీతో తలపడనుంది. ప్రస్తుతం ఆడిన మూడు మ్యాచుల్లో ఒకే ఒక విజయంతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉన్న చెన్నైకి ధోనీ సారథ్యం వహించడం కలిసొచ్చే అవకాశం ఉంది.



# సిపిఎం 24వ అఖిల భారత మహాసభ






## చెన్నైలో కారల్ మార్క్స్ విగ్రహం

- సిఎం స్టాలిన్ ప్రకటన
- హర్షం వ్యక్తం చేసిన సిపిఎం

**సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి**

తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై మహానగరంలో మార్క్సిస్టు మహా మేధావి కారల్ మార్క్స్ విగ్రహం ఏర్పాటు కానుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. తమిళనాడు శాసనసభలో ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా ప్రకటించారు. ప్రపంచ ప్రజలకు విముక్తి మార్గాన్ని చూపిన మార్క్స్ విగ్రహాన్ని తమిళనాడు రాజధాని నగరంలో ఏర్పాటు చేయనుండటం గర్వకారణమని ఆయన అన్నారు. స్టాలిన్ ప్రకటన పట్ల సిపిఎం తన సంతోషాన్ని, స్వాగతాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం ఒక ప్రకటన విడుదల చేశారు.

## చిన్నారి సందడి



రెండున్నరేళ్ల వయస్సున్న ఈ పాపాయి పేరు ఈవా. ఢిల్లీ నుంచి ప్రతినిధిగా హాజరైన తల్లితో కలిసి వచ్చింది. చిరునవ్వులు చిందిస్తూ మహాసభల ప్రాంగణంలో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈవా తల్లి అంజు సైనీ అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు. తండ్రి అమన్ సైనీ డివైఎఫ్ఐ ఢిల్లీ కార్యదర్శి.

# శాంతి అంటే గొంతు నొక్కడమా?

- మా భూములపైనే వారి కన్ను
- కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు
- యువత కదులుతోంది

## 'ప్రజాశక్తి'తో సిపిఎం జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్

**"జమ్మూ కాశ్మీర్‌లో శాంతి నెలకొల్పామని ప్రధానమంత్రి మోడీ, హోంమంత్రి అమిత్‌షాలతో పాటు బిజెపి నేతలు చెబుతున్నారు. కానీ జరిగింది వేరు. ఇప్పుడు అక్కడ మౌనం రాజ్యమేలుతోంది. ప్రజలు తమ సమస్యలు చెప్పకోవడానికి కూడా అవకాశం లేదు. ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలూ లేవు. తహసిల్దార్‌ను కూడా లెఫ్టినెంట్ జనరలే బదిలీ చేస్తారు. సమస్యల కోసం ఎవరైనా గళం విప్పితే రకరకాల ముద్రలు వేసి జైలులో వేస్తున్నారు. శాంతి అంటే ప్రజల గొంతు నొక్కడమా? ఎటువంటి శబ్దం లేకుండా నిశ్శబ్దంగా ఉండటమా?" అని జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర సిపిఎం కార్యదర్శి అబ్బాస్ అన్నారు. 45 సంవత్సరాలకే ఆయన సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మదురైలో జరుగుతున్న సిపిఎం అఖిల భారత మహాసభకు ప్రతినిధిగా వచ్చిన ఆయన 'ప్రజాశక్తి' ప్రత్యేక ప్రతినిధి వి.రాజగోపాల్‌తో మాట్లాడారు. జమ్మూకాశ్మీర్‌లో చోటుచేసుకుంటున్న వివిధ పరిణామాలను వివరించారు.**

**సీతారాం ఏచూరి నగర్ నుండి ప్రజాశక్తి ప్రతినిధి**

**చిన్న వయసులోనే రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయారు కదా? ఆ బాధ్యతను ఎలా భావిస్తున్నారు?**

కామ్రేడ్ తరిగామి నేతృత్వంలో మేమంతా ఎదిగాం. ఒక గొడుగులాగా ఆయన మాకు నీడను ఇచ్చారు. కష్టాలను ఎదుర్కోవడం నేర్పించారు. పోరాట స్ఫూర్తిని చూపగల సమర్ధవంతమైన నాయకులు ఎందరో ఇప్పుడు రాష్ట్రంలో తయారయ్యారు. ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి వారంతా సిద్ధమవుతున్నారు. ఆ క్రమంలోనే రాష్ట్ర కార్యదర్శిగా నేను ఎన్నికయ్యాను. తరిగామి వంటి నేత చూసిన బాధ్యతలను అదే స్థాయిలో కొనసాగించడం కొంచెం కష్టమే! కానీ, పార్టీ సహాయ సహకారాలతో కొత్త తరం ఎదుగుతోంది. బాధ్యతలను నిర్వర్తిస్తుంది. పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తుంది.

**జమ్మూకాశ్మీర్‌లో ప్రస్తుతం పార్టీ పరిస్థితి ఎలా ఉంది?**

అక్కడ ఉన్న ప్రత్యేక పరిస్థితి గురించి మీకు తెలుసు. మనకు కొన్ని ప్రాంతాల్లో స్థిరమైన బలం ఉంది. తరిగామిని ఓడించడానికి హిందుత్వ బిజెపి శక్తులు, అంతే మతోన్మాదాన్ని చూపే ముస్లిం ఉగ్రవాద శక్తులతో చేతులు కలిపాయి. అయినా, ప్రజలు సిపిఎం వైపే మొగ్గు చూపి తరిగామిని భారీ మెజార్టీతో గెలిపించారు. మరో, రెండు మూడు స్థానాల్లో కూడా మనకు గణనీయమైన మద్దతు ఉంది. బిజెపిని ఓడించాలన్న లక్ష్యంలో భాగంగా మనం ఒక్క స్థానానికే పరిమితమై పోటీ చేసి, గెలిచాం. మన ప్రభావం రెండు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తోంది. తీవ్ర నిర్బంధ పరిస్థితులు ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తున్నాం. ప్రజలు మనతో కలిసి వస్తున్నారు. పార్టీ చెప్పే విషయాలను వింటున్నారు. ఆందోళనలకు కదులుతున్నారు.

**ఆర్టికల్ 370 రద్దు తరువాత ప్రజల స్పందన ఎలా ఉంది?**

370వ అధికరణాన్ని రద్దు చేసే సమయంలో బిజెపి నాయకులు ప్రజలకు ఎన్నో చెప్పారు. కొంతమందిని మభ్య పెట్టగలిగారు. కానీ, జమ్మూకాశ్మీర్‌ను రెండు భాగాలు చెయ్యడం మెజార్టీ ప్రజల హృదయాలను గాయపరిచింది. 5.50 లక్షల ఉద్యోగాలు వస్తాయని వారు ప్రజలకు చెప్పారు. కానీ, 4 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేశారు. 35ఎ రద్దు వంటివి కూడా ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటున్నారు.



**బిజెపి వ్యూహాలు ఎలా ఉన్నాయి?**

మిగిలిన రాష్ట్రాల్లో మాదిరే మత ప్రాతిపదిక ప్రజలను విభజించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. జమ్మూ ప్రజలకు కాశ్మీరీయులను శత్రువులుగా చూపుతోంది. కాశ్మీర్‌లో కూడా మెజార్టీ, మైనార్టీ ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది. 370 రద్దు, రాష్ట్ర విభజన కూడా ఇందులో భాగమే! అయితే, రాష్ట్ర ప్రజలు ఆ ప్రయత్నాలను ఐక్యంగా తిప్పికొడుతున్నారు. కొన్ని ముస్లిం మతవాద సంస్థలు కూడా మనుషులను విభజించే ప్రయత్నం చేస్తున్నాయి. కొన్ని సమయాల్లో బిజెపితో చేతులు కలపడానికి కూడా వారు సిద్ధమవుతున్నారు.

**ఆర్టికల్ 370 రద్దుతో భూముల విలువ పెరిగి పరిశ్రమలు వస్తాయని మోడీ ప్రభుత్వం చెప్పింది కదా. వాస్తవంగా ఏం జరుగుతోంది?**

మోడీ, అమిత్‌షాలు ఆ మాటలు చెప్పినప్పుడు కొందరు నమ్మారు. కానీ ఇప్పుడు 'ఎవరి భూములు... ఎవరి చేతుల్లోకి వెడుతున్నాయో గమనిస్తున్నారు. అప్పుడు భూముల విలువ తక్కువగా ఉండి ఉండవచ్చు. కానీ, స్థానిక ప్రజల చేతుల్లోనే భూమి ఉంది. ఇప్పుడు ఆ భూమికి రెక్కలు వస్తున్నాయి. కార్పొరేట్ల, సంపన్నుల చేతుల్లోకి భూములు పోతున్నాయి. ఇటీవల శ్రీలంక క్రికెటర్ ఒకరికి పెద్ద మొత్తంలో భూములు కేటాయించారు. ఈ జాబితాలో ఇంకా అనేక విద్యాసంస్థలు ఉన్నాయి. అదాని, అంబానీలకు కూడా భూములు కట్ట బెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**విద్య, వైద్య రంగాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి?**

కీలకమైన ఈ రెండు రంగాల్లోనూ పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ రంగాలకు సంబంధించిన 40 శాతం ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. పారా మెడికల్ సిబ్బంది లేరు. ప్రజలు ప్రైవేటు సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది వారికి తీవ్ర భారం మారుతోంది.

**జమ్మూ, కాశ్మీర్‌లో సిపిఎం భవిష్యత్ ఏమిటి?**

మేం అనేక అంశాలను తీసుకుని పనిచేస్తున్నాం. స్థానిక సమస్యలతో పాటు, 370 రద్దు, రాష్ట్రాల పునరేకీకరణ వంటి అంశాల కోసం పోరాడుతున్నాం. యువత పెద్దఎత్తున ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతోంది. ఇటీవల ఎన్నికల్లోనూ ఆసక్తితో రంగంలోకి దిగింది. అందువల్ల భవిష్యత్‌పై పూర్తి ఆశాభావంతో ఉన్నాం.

## పుస్తకాల ఆవిష్కరణ





సిపిఎం అఖిల భారత మహాసభ వేదికపై శుక్రవారం పలు పుస్తకాలను, మహాసభల సావనీరును ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి రచించిన 'హిందూ రాష్ట్ర అంటే ఏమిటి?' పుస్తకాన్ని పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే.. ప్రకాశ్ కరత్‌కి అందించారు. పార్టీ 7వ మహాసభ నుంచి 23వ మహాసభ వరకూ వివిధ అంశాలు పొందిన బుక్‌లెట్‌ను సీనియర్ నేత ఎస్.రామచంద్రన్ పిళ్లై ఆవిష్కరించారు. మహాసభల సావనీరు ప్రతిని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విద్యార్థి నేత ఐషీ ఘోష్‌కు అందించారు. పార్టీ నేతలు మాణిక్ సర్కార్, బృందాకరత్, సుభాషిణీ ఆలీ తదితరులు పాల్గొన్నారు.





ప్రేక్షకులను అలరించిన సాంస్కృతిక సంరంభం

## అదరహో...

- కన్నులపండుగగా సాంస్కృతిక కార్యక్రమాలు
- ముఖ్య అతిథులుగా విచ్చేసిన సినీ దర్శకులు సముద్రఖని, వెట్రిమారన్

**మదురై నుంచి ప్రజాశక్తి ప్రతినిధి**

సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభలను పురస్కరించుకుని మదురై నగరంలోని సీతారాం ఏచూరి నగర్ (తంబుక్కమ్ మైదానం)లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం అక్కడ నిర్వహించిన కార్యక్రమాలను వీక్షించేందుకు సీపీఐ (ఎం) నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు, సాధారణ ప్రజలు పోటెత్తారు. పలు రంగాలకు చెందిన మేధావులు, అభ్యుదయవాదులు, సాహితీవేత్తలు ఆద్యంతం సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, కళాకారులను కరతాళ ధ్వనులతో అభినందించారు. 'కేరళ మప్లా ముస్లిం మహిళల బృందం' నిర్వహించిన కార్యక్రమం అదరహెూ అనిపించింది. గాన విమల నేతృత్వంలో చెన్నై కల్చరల్ ట్రూప్ ఆలపించిన పాటలకు చప్పట్లు మార్మోగాయి. ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు సముద్రఖని, దర్శకుడు వెట్రిమారిన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారి రాకతో సభికుల్లో జోష్ పెరిగింది.



సాంస్కృతిక కార్యక్రమంలో మాట్లాడుతున్న సముద్రఖని



'కేరళ మప్లా ముస్లిం మహిళల బృందం' సాంస్కృతిక ప్రదర్శన




# భావోద్వేగ భరితం.. అరుణారుణ చరితం

- అడుగడుగునా పోరాట ఘట్టాలు
- అమరవీరుల స్మరణీయ త్యాగాలు
- నాటి నుంచి నేటి వరకు
- కమ్యూనిస్టు పార్టీ స్మృతులు
- మహిళామణుల
- వీరోచిత సాహసాలు
- గాజాపై ఇజ్రాయిల్
- దారుణ మారణకాండ
- కళ్లకు కట్టిన ఫొటో ప్రదర్శన
- యువతరానికి స్ఫూర్తినిస్తున్న ఫొటో ఎగ్జిబిషన్

**మదురై నుంచి ప్రజాశక్తి ప్రతినిధి**

ఎవరన్నారో తెలియదుగానీ.. నిజంగానే 'భావోద్వేగాలను అర్థం చేసుకోవటానికి భాషతో పని లేదు...'. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, పాలకుల నిర్బంధాలు, నియంతృత్వ పోకడలు.. లాఠీఛార్జీలు, కోర్టు కేసులు.. జైలు జీవితాలు.. నిర్బంధాలు.. వెరసి భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర పడిలేచిన కడలి తరంగం. అందులో ఎంతోమంది త్యాగధనులు, విప్లవ పోరాట యోధులు. వారు దేశం కోసం, ప్రజల హక్కుల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదలిపెట్టారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా.. రాజస్థాన్ నుంచి నాగాలాండ్ దాకా ... భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం ప్రభువులు, పాలకులను ఎదిరించి, తాడితులు, పీడితులకు అండగా నిలిచారు. తెలంగాణలో జరిగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో నిర్వహించిన వర్లీ ఆదివాసీల పోరాటం, రైల్వే సమ్మెలు, ఎమర్జెన్సీ రోజులు... ఇలా ఒకటేమిటి, 1908లో దేశంలోనే మొట్టమొదటి కార్మిక సంఘం ప్రారంభం నుంచి నేటి వరకు కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగిన అనేక పరిణామ క్రమాలను వివరిస్తూ రూపొందించిన ఛాయాచిత్ర ప్రదర్శన వీక్షకులను, ముఖ్యంగా ఆనాటి చరిత్ర తెలియని నేటి యువతీ యువకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఒక్కో నాయకుడి పోరాట చరిత వింటేనే రోమాలు నిక్కబొడిచేలా ఉన్న ఆ ఫొటో ఎగ్జిబిషన్ వారిలో స్ఫూర్తినింపుతూ, కార్యోన్ముఖులను చేస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఆ ప్రదర్శనలోని ఫొటోలపై తమిళంలో రాసిన పదాలు, వాక్యాలు, వివరాలు అర్థం కాకపోయినా.. ఆ చిత్రాల్లోని భావాలు, భావోద్వేగాలు మాత్రం ఏ భాష వారికైనా సులభంగా అర్థమవుతాయి.

సిపిఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ కొలువుదీరిన తమిళనాడులోని మదురైలోగల సీతారాం ఏచూరి నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన... ఆద్యంతం పోరాట స్ఫూర్తిని నింపుతోంది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు 1908తో మొదలుపెట్టి... కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం, దేశంలోనే తొలిసారి నిర్వహించిన సార్వత్రిక సమ్మె (1908), రష్యన్ విప్లవంపై సుబ్రమణ్య భారతి కవితలు (1917), దేశంలో తొలిసారిగా మేడే నిర్వహణ (1923), కమ్యూనిస్టు మ్యానిఫెస్టోను తమిళంలోకి అనువదించటం (1931-32), ఏఐటీయూసీ ఆవిర్భావం (1936), ఆలిండియా ఫార్మర్స్ యూనియన్ ఏర్పాటు (1936), ఏఐఎస్ఎఫ్ ఏర్పాటు (1936) తదితర తొలి ఘట్టాలను ఆ ఎగ్జిబిషన్‌లో ప్రస్తావించారు.



వెణ్మణి విషాద ఘట్టాన్ని తిలకిస్తున్న సందర్శకులు

వీటితోపాటు 1952లో జరిగిన తొలి పార్లమెంటు ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించగా, ఏకే గోపాలన్ ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. 1957లో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రజాస్వామ్య ఎన్నికల పద్ధతుల్లో కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చింది. 1964లో సీపీఐ నుంచి విడిపోయి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఏర్పడింది. దానికి పుచ్చలపల్లి సుందరయ్య తొలి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1967లో కేరళలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో, బెంగాల్‌లో అజయ్ ఘోష్ నేతృత్వంలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 1978లో నృపేన్ చక్రవర్తి సారథ్యంలో, ఆ తర్వాత మాణిక్ సర్కార్ నాయకత్వంలో త్రిపురలో వామపక్ష ప్రభుత్వాలేర్పడ్డాయి. కేరళలో 2015 నుంచి వరసగా రెండుసార్లు ఎల్డీఎఫ్ జయకేతనం ఎగరేసింది. ఈ రకంగా దేశ చరిత్రలో పార్టీ సువర్ణ అధ్యాయాన్ని లిఖించిన సందర్భాలను ఫొటో ఎగ్జిబిషన్ కండ్లకు కట్టింది.

వీటితోపాటు తెలంగాణలో నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దాష్టీకాలు; తమిళనాడులోని వెణ్మణి గ్రామంలో రామయ్య గుడిసెలో 44 మందిని సజీవ దహనం చేసిన దారుణ ఘటన, భారత్-పాకిస్తాన్ విభజన, బెంగాల్, కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వామపక్ష ప్రభుత్వాలను పాలకులు కూల్చివేసిన వైనాలు, 1975లో ఇందిరాగాంధీ హయాంలోని ఎమర్జెన్సీ రోజులు, ఆ సందర్భంగా పార్టీ నేతలపై బనాయించిన కేసులు, జైళ్లలో మగ్గిన నేతలు, దేశంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టు నాయకులపై పెట్టిన కుట్ర కేసులు తదితర కీలక ఘటనలను ఛాయాచిత్ర ప్రదర్శన సాక్షాత్కరింపజేసింది. వాటిని వీక్షించిన పాతతరం నాయకులు చెమ్మగిల్లిన కండ్లతో బయటకొస్తే... యువతరం మాత్రం 'అమరవీరులారా వందనం.. మీ ఆశయాలను సాధించేందుకు మేమున్నాం...' అంటూ ప్రతినబూనుతున్నారు.



పార్టీ చరిత్ర ప్రదర్శన వద్ద సందర్శకులు



కెఫియా ధరించి పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

# గాజాలో జాతి హననం ఆపండి

- ఇజ్రాయిల్ దాష్టీకాలకు సిపిఎం ఖండన
- శాశ్వత కాల్పుల విరమణకు డిమాండ్

**సీతారాం ఏచూరి నగర్ నుంచి ప్రజాశక్తి ప్రతినిధి**

గాజాపై ఇజ్రాయిల్ జాతి నిర్మూలన తరహా దాడులు చేస్తోందని సిపిఎం 24వ అఖిల భారత మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. ఇజ్రాయిల్ దాష్టీకాలను అది తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. తక్షణమే శాశ్వత కాల్పుల విరమణ చేయాలని అది డిమాండ్ చేసింది. ఈ తీర్మానాన్ని పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబి ప్రవేశపెట్టగా, మరో పొలిట్ బ్యూరో సభ్యులు జి. రామకృష్ణన్ బలపర్చారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్, అమెరికా వ్యతిరేక నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ తీర్మానంలో '2023 అక్టోబర్ 7న హమాస్ దాడికి ప్రతిస్పందనగా ఇజ్రాయిల్ పాలస్తీనా గాజాపై జాతి హననానికి సమానమైన ఆటవిక దాడులను ప్రారంభించిందని, ఈ దాడుల్లో ఇప్పటివరకూ 50 వేల మందికి పైగా పాలస్తీనీయులు మరణించగా, వేలాది మంది గాయపడ్డారని సిపిఎం తెలిపింది. 'మొదటి దశ కాల్పుల విరమణ ముగిసిన వెంటనే ఇజ్రాయిల్ తన దాడులను పున్ణప్రారంభించింది. అప్పటినుంచి గాజాకు ఆహారం, నీరు, ఇంధనం, వైద్య సహాయంతో పాటు ఇతర మౌలిక వనరులను నిలిపివేసింది. ఇది గాజాలో ఆకలితో అలమటించే వారి సంఖ్యను పెంచింది. ఆసుపత్రులు, సహాయ బందాలు, ఐక్యరాజ్యసమితి శరణార్థ శిబిరాలు, పాఠశాలలు, మసీదులు, చర్చిలు, చివరకు సహాయ బృందాలపై కూడా దాడులు జరిగాయి. గాజాలో సురక్షిత ప్రాంతమంటూ లేకుండా పోయింది. ఇజ్రాయిల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో 60 శాతం మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. జర్నలిస్టులు, ఐక్యరాజ్యసమితి సహాయ ఉద్యోగులు కూడా దాడులకు లక్ష్యంగా మారారు. పంటల్ని నాశనం చేశారు. ఈ దాడులన్నీ ఇజ్రాయిల్ ప్రభుత్వ రాక్షసత్వాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి' అని తీర్మానం పేర్కొంది. 'అంతర్జాతీయ న్యాయస్థానం దీన్ని పరిగణనలోకి తీసుకుని, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపైన, ఇతర నేతలపైన అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అయినా, పశ్చిమ తీరంలో పాలస్తీనా భూమిని ఆక్రమించి, యూదుల ఆవాసాలను నెలకొల్పేలా ఇజ్రాయిల్ ప్రోత్సహిస్తోంది. ఈ విధంగా, పశ్చిమ తీరంలోని పాలస్తీనా భూభాగాన్ని క్రమంగా తమకు అనుసంధానించేందుకు యత్నిస్తోంది. ఇవన్నీ పాలస్తీనీయులను తమ స్వస్థలాల నుంచి గెంటేసి 'గ్రేటర్ ఇజ్రాయిల్' అజెండాను అమలు చేయడంలో భాగమే' అని సిపిఎం పేర్కొంది.

'అమెరికా ఇతర పాశ్చాత్య దేశాలు గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు మద్దతు ఇవ్వడమే కాకుండా, ఆయుధాలు అందించి, అంతర్జాతీయ వేదికలపై అది తప్పు చేయలేదన్న రీతిలో మాట్లాడుతున్నాయి. గాజాను పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న ట్రంప్ ప్రకటన పాలస్తీనీయులను తమ స్వస్థలాల నుంచి గెంటివేయాలని చూస్తున్న ఇజ్రాయిల్‌కు మరింత ఊతమిచ్చేలా వుంది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భారత దేశం ఎంతో కాలంగా పాలస్తీనా పట్ల అనుసరిస్తున్న వైఖరికి భిన్నమైన వైఖరిని తీసుకుంది. పాలస్తీనా ప్రజలతో నిలబడి, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని కోరడానికి బదులు దాడులకు పాల్పడుతున్న వారి వైపు ఉంటోంది. ఫలితంగా, ఐక్యరాజ్యసమితిలో తక్షణ కాల్పుల విరమణ కోరుతూ ప్రతిపాదించిన తీర్మానాలపై భారత్ మొదటిసారి వ్యతిరేకంగా లేదా తటస్థంగా ఓటు వేసింది. దీనివల్ల అభివద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ విశ్వసనీయత కోల్పోయింది. ఇప్పుడు భారత్‌ను వారు అమెరికా - ఇజ్రాయెల్ మిత్రదేశంగా చూస్తున్నారు.' అని తీర్మానం పేర్కొంది. 'గాజాలో తక్షణ కాల్పుల విరమణను ప్రకటించాలని, ఇజ్రాయిల్‌ను ధూర్త దేశంగా ప్రకటించి దానిపై చర్యలు తీసుకోవాలని' మహాసభ డిమాండ్ చేసింది. పాలస్తీనాకు మద్దతు ఇచ్చే విధానాన్ని బిజెపి ప్రభుత్వం తిరిగి అమలు చేయాలని కోరింది. ఈ ప్రాంతంలో శాశ్వత శాంతికి సాధ్యమయ్యే మార్గం 1967కు ముందున్న సరిహద్దులతో, తూర్పు జెరూసలేమ్‌ను రాజధానిగా కలిగి ఉన్న పాలస్తీనా దేశాన్ని స్థాపించడమేనని తెలిపింది. తమ స్వస్థలాన్ని తిరిగి పొందేందుకు పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు మద్దతుగా నిలవాలని ప్రజానీకానికి సిపిఎం పిలుపు ఇచ్చింది.

# 'వక్ఫ్ సవరణ' ఆమోదాన్ని ఖండించండి

- ఉపసంహరణకు డిమాండ్ చేయండి
- సిపిఎం అఖిలభారత మహాసభ

**సీతారాం ఏచూరి నగర్ నుండి ప్రజాశక్తి ప్రతినిధి**

వక్ఫ్ సవరణ చట్టంను పార్లమెంటు ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండించాలని సిపిఎం పిలుపునిచ్చింది మదురైలో జరుగుతున్న సిపిఎం అఖిలభారత మహాసభలో ఈ మేరకు తీర్మానాన్ని ప్రతిపాదించారు. 'పార్లమెంట్ ఆమోదించిన 'వక్ఫ్ సవరణ చట్టం'ను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోంది. దేశ వ్యాప్తంగా ఉన్న సెక్యులర్ సంస్థలు, ప్రజానీకం ముక్తకంఠంతో ఈ చర్యను ఖండించాలని తీర్మానంలో సిపిఎం పేర్కొంది. ఈ చర్య విబేధాలను పెంచుతోందని, దేశపు సెక్యులర్ తత్వానికి చేటుచేస్తుందని తెలిపింది. 'ఇంతకు ముందు ఉన్న వక్ఫ్ చట్టం, వక్ఫ్ ఆస్తుల యొక్క సక్రమ పరిపాలన, ఆక్రమణల నుండి రక్షణతో పాటు ముస్లిం సమాజ ప్రయోజనాలకోసం నిధులను వినియోగించడాన్ని నిర్ధారించింది. అయితే, కొత్త వక్ఫ్ సవరణ చట్టం అనేక అసంబద్ధ విధానాలను కలిగి ఉంది. బిజెపి ప్రభుత్వం మంద బలంతో ఈ చట్టాన్ని పార్లమెంట్ ద్వారా ముందుకు తీసుకువెడుతోంది. తద్వారా రాజ్యాంగంలో హామీ ఇచ్చిన అల్పసంఖ్యాక హక్కులను అడ్డుకుంటూ, హిందుత్వ ఏజండాను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది.' అని తీర్మానంలో సిపిఎం పేర్కొంది. 'తాజా సవరణలతో రాష్ట్ర వక్ఫ్ బోర్డులు రద్దు చేయడం, వాటి అధికారాలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి బదిలీ చేయడం, తద్వారా కేంద్రీకరణను ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఇది ఫెడరలిజానికి విరుద్ధమని పేర్కొన్నారు. అదే విధంగా శతాబ్దాలుగా అమలు పర్చబడిన ఇస్లామిక్ సంస్థలు రాజ్యాంగ రక్షణ పొందుతున్నప్పటికీ, కొత్త చట్టంలో ఆ పరిస్థితి లేదని, అక్రమంగా జప్తు లేదా ధ్వంసం చేయబడిన ఆస్తుల పునరుద్ధరణ లేదా పరిహారానికి ఎటువంటి విధానాన్ని ప్రస్తావించలేదని తీర్మానంలో తెలిపారు. వక్ఫ్ ఆస్తుల హేతుబద్ధతపై సందేహం కలిగించగలిగేలా చట్టం ఉందని, అల్పసంఖ్యాక ప్రజలపై వేధింపులను పెంచి, సాముప్రదాయక ఉద్రిక్తతలను మరింతగా ప్రేరేపిస్తుందని తీర్మానంలో వివరించారు. ఈ సవరణతో ఆస్తుల వివాదాలను కోర్టులలోనే పరిష్కరించుకోవాల్సి వస్తుందని, అధికారిక నోటిఫికేషన్ ద్వారా వక్ఫ్ ఆస్తులను నిర్ధారించాల్సిన విధానానికి భిన్నంగా అనిశ్చితమైన ఒరల్ డిక్లరేషన్ విధానం మరింత గందరగోళానికి దారి తీస్తుందని వివరించారు.

తక్షణమే వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ సవరణల కారణంగా, దేశంలోని ఎక్కువ వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ ఆక్రమణకు గురవుతాయని, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ వంటి ఎక్కువ వక్ఫ్ ఆస్తులను కలిగిన రాష్ట్రాల్లోని ఆస్తులను లక్ష్యంగా మారుతాయని తీర్మానంలో తెలిపారు.

'సర్వే కమిషనర్ నుండి కేంద్ర ప్రభుత్వ నియామకం చేసిన అధికారికి వక్ఫ్ ఆస్తులను నిర్ణయించుకునే అధికారాన్ని బదిలీ చేయడం ద్వారా, ప్రభుత్వం ప్రార్థనా స్థలాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వృత్తి కేంద్రాలను ఆక్రమించుకుని, వక్ఫ్ ఆస్తులపై నియంత్రణను పెంచుకోవాలని చూస్తోంది. వక్ఫ్ ట్రైబ్యునల్ యొక్క అధికారాలను తొలగించడం వల్ల, వక్ఫ్ బోర్డు కూడా ఏ విధమైన న్యాయ సహాయం అందించలేకపోతుంది.' అని తీర్మానంలో పేర్కొన్నారు. 'ఈ సవరణల ద్వారా, కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులపై దాడిచేసే తన విధానాన్ని కొనసాగిస్తోంది. ఇది సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్ (సిఎఎ)తో పోల్చదగినది' అని తెలిపింది. 'దేశంలోని సెక్యులర్, ప్రజాస్వామ్య నిర్మాణాన్ని కాపాడేందుకు అభ్యుదయ శక్తులు ఏకం కావాలని, వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయాలని తీర్మానంలో పిలుపునిచ్చారు.



చర్చల్లో ఏపీ ప్రతినిధులు

# ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలి

**సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి**

ఎన్నికల కమిషన్ స్వతంత్రత, సమగ్రత, పారదర్శకతలను కాపాడాలని, ఎన్నికల ప్రక్రియలో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు ఉండాలని సిపిఎం మహాసభ డిమాండ్ చేసింది. గత దశాబ్ద కాలంగా భారత ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మహాసభ ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ కాలంలో ఎన్నికల విధానం పూర్తిగా పారదర్శకత కోల్పోయిందని, రాజ్యాంగ విరుద్ధంగా మలచ బడిందని, స్వతంత్రతను కోల్పోవడం, ప్రతిపక్ష పార్టీలను తక్కువచేసే ధోరణితో ఎన్నికల చట్టాలు, నియమాలు, మాన్యువళ్లను నామమాత్రా వశిష్టంగా మార్చడంతో ఎన్నికలు డబ్బు ఉన్న పార్టీలకు లాభదాయకమైనదిగా మారాయని తీర్మానం పేర్కొంది. 2023 నవంబర్‌లో భారత సుప్రీంకోర్టు ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియ స్వతంత్రంగా ఉండాలంటూ ఇచ్చిన ఆదేశాలను తీర్మానం ప్రస్తావించింది. అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అత్యవసరంగా చట్టాన్ని మార్చి, నియామక సంఘం నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ముగ్గురిలో ఇద్దరిని కేంద్ర మంత్రివర్గ సభ్యులను నియమించిందని ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఎన్నికల కమిషన్‌పై ప్రజల విశ్వాసం సన్నగిల్లిందంటూ 2024 ఏప్రిల్‌లో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ చేసిన సర్వేను ప్రస్తావించింది. ఇటీవల కాలంలో నకిలీ ఓటరు కార్డులు వెలుగులోకి రావడం, ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు పెరుగుతుండడంపై మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. '2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం పౌర సమూహాలు విడుదల చేసిన "వోట్ ఫర్ డెమోక్రసీ" నివేదికలో దేశవ్యాప్తంగా కనీసం 79 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ప్రజా తీర్పు ప్రతిఫలించలేదని స్పష్టమైన సమాచారం ఉంది. 2024 ఎన్నికలలోని అన్ని విడతలలో సాయంత్రం 7-8 గంటలకు ప్రకటించిన ఓటింగ్ శాతం, చివరగా విడుదల చేసిన ఓటింగ్ శాతాన్ని ఆధారంగా గణించినప్పుడు 4,65,46,885 (సుమారు ఐదు కోట్లు) ఓట్లు అదనంగా కనిపించాయి. నిపుణుల విశ్లేషణ ప్రకారం ఈ బోగస్ ఓట్ల లాభం బిజెపి - ఎన్‌డిఎ కూటమికే ఎక్కువగా లబ్ధి చేకూరింది' అని తీర్మానం వివరించింది. బిజెపికి ఓటేయకపోవచ్చని అంచనా వేసిన మత, కుల సమూహాలున్న ప్రాంతాల్లో ఓటర్లను ఎక్కువగా తొలగించారు. కొత్త ఓటర్ల చేర్పులూ, వాటి చెల్లుబాటుపై మరింత లోతైన పరిశీలన చేయాలి. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యానికి బాధ్యత వహించేలా చేయడానికి ప్రజా ఉద్యమం అవసరం. ఇసిఐ లెక్కలు, డేటా, సమాచారం, ప్రతిపక్ష పార్టీలకు, ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేసింది. 'ఎన్నికల వ్యవస్థలో జరిగే అవకతవకలను బహిర్గతం చేయడంలో మరింతగా కృషి చేయాలి. దేశ ప్రజలందరూ భయం లేకుండా, స్వేచ్ఛగా ఓటు వేయడం సాధ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, పారదర్శకంగా పనిచేయాలి.' అని ఆ తీర్మానం పేర్కొంది. దీనిని నీలోత్పల్‌బసు ప్రవేశపెట్టగా, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి వి.శ్రీనివాసరావు బలపర్చారు.



తీర్మానాలను ఆమోదిస్తున్న ప్రతినిధులు

### 'ఒకే దేశం...ఒకే ఎన్నికపై'...

ఆర్ఎస్ఎస్- బిజెపి ప్రతిపాదిస్తున్న 'ఒక దేశం- ఒకే ఎన్నిక' విధానం దేశ ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తుందని సిపిఎం పేర్కొంది. ఈ మేరకు ఆమోదించిన తీర్మానంలో ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపింది. ఏక కేంద్రంగా దేశాన్ని నడపాలన్న వారి ఆలోచనకు ఇది నిదర్శనమని పేర్కొంది. వారి ఇతర నినాదమైన "ఒక దేశం, ఒక మతం, ఒక భాష, ఒక సంస్కృతి, ఒక నాయకుడు" అనే విధానం తాలూకు కొనసాగింపుగానే దీనిని చూడాలని తెలిపింది. హిట్లర్ కాలంలో ఉన్న ఫాసిస్టు నినాదం నుంచి దీనిని తీసుకొని, స్వల్పంగా మార్చినట్లు పేర్కొంది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలతో పాటు మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలన్న ఆలోచన ప్రజాస్వామ్యానికి మరింత ప్రమాదమని, ఇది మరింత తీవ్ర కేంద్రీకరణకు దారి తీస్తుందని వివరించింది. ఈ తీర్మానాన్ని అశోక్ ధావలే ప్రతిపాదించగా, అమ్రారామ్ బలపరిచారు.

# కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి అండగా...

**సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి**

కేరళను అభివృద్ధి బాటలో నడిపిస్తూ, పెద్ద ఎత్తున ప్రజానుకూల నిర్ణయాలు తీసుకుంటున్న వామపక్ష, ప్రజాతంత్ర ప్రభుత్వాని(ఎల్‌డిఎఫ్)కి అండగా నిలవాలని సభ్యులు సానుభూతిపరులతో పాటు ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులకు సిపిఎం మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆమోదించిన తీర్మానంలో హిందూత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, సెక్యులర్ విలువలను కాపాడుతూ, కేంద్ర ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయాలను కేరళ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. దీంతో కేంద్రంలోని బిజెపి-ఎన్‌డిఎ ప్రభుత్వం ఆ రాష్ట్రం పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ఆర్థికంగా అనేక ఆంక్షలు పెడుతోందని తెలిపింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కూడా ఈ కుట్రలో భాగస్వామిగా మారిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రజాస్వామ్యవాదులు, కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు సంఘటితం కావాలని మహాసభ పిలుపునిచ్చింది. కేరళలో వరుసగా అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వాలు, అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేశాయని, ఫలితంగా 2025-26 నాటికి సంపూర్ణ పేదరిక నిర్మూలన సాధ్యం కానుందని తెలిపింది. సామాజిక సంక్షేమ రంగాలతోపాటు, గడచిన మూడు దశాబ్దాలుగా జిడిపి వృద్ధిలోనూ కేరళ దేశానికి మించి ముందంజలో ఉంది. నూరుశాతం అక్షరాస్యత పెరగడం, అందరూ ఉన్నత చదువులు చదువుతుండటంతో నిరుద్యోగిత సమస్య ప్రస్తుతం ముందుకు వచ్చిందని, దీనికి పరిష్కారంగా, ఆర్థిక వ్యవస్థను ఆధునిక శాస్త్రీయ విజ్ఞానం, అధిక ఉత్పాదకత ఆధారితంగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఇందుకోసం నైపుణ్య ఆధారిత పరిశ్రమలు, స్టార్టప్‌లు పెరిగేందుకు పెట్టుబడుల ఆకర్షణకు కేంద్రంగా మారాలని, కేరళను ఒక "నాలెడ్జ్ ఎకానమీ"గా మారాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. ఈ చర్యల కారణంగా ప్రత్యామ్నాయ మార్గాన్ని త్యజించడం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగదని పేర్కొంది. 'ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ విద్యా వ్యవస్థ, పబ్లిక్ హెల్త్ వ్యవస్థ లు మరింత బలపడతాయి. ప్రజాస్వామ్య హక్కులు, కార్మిక హక్కులకు విఘాతం కలగదు. సామాజిక రంగం, చిన్న స్థాయి పరిశ్రమల్లో ప్రజల పాత్ర పెరుగుతుంది. కుల, లింగ వివక్షకు వ్యతిరేకంగా,లౌకిక, శాస్త్రీయ విలువల కోసం పోరాటం కొనసాగుతుందని ఆ తీర్మానం పేర్కొంది.



సలీమ్



జితేంద్ర

'ఇటువంటి ప్రజారంజక ప్రభుత్వాన్ని బిజెపి -ఎన్‌డిఎ కూటమి అణగదొక్కాలని చూస్తోంది. గవర్నర్‌పై ఒత్తిడి చేస్తూ, బిల్లులకు అనుమతి నిరాకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని దురుద్దేశపూరితంగా కుదిస్తున్నారు' అని తీర్మానం పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వివక్షను ఎండగట్టాలని, కేరళ సాధించిన ప్రజాస్వామ్య విజయాలను ప్రచారం చేయాలని, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని బలోపేతం చేసి అండగా నిలవాలని ప్రజాతంత్ర శక్తులకు సిపిఎం పిలుపునిచ్చింది. ఈ తీర్మానాన్ని ఎండి సలీం ప్రతిపాదించగా, త్రిపుర ప్రతినిధి జితేంద్ర చౌదరి బలపర్చారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68